అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
బుధవారం 30-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 242 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

సీఎం సెగ్మెంట్లో రైతుల బైటాయింపు



ఛత్తీస్‌గఢ్‌లో ఆందోళనకు దిగిన అన్నదాతలు

ఛత్తీస్‌గఢ్: రుణమాఫీ, మద్దతు ధర తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేలాది మంది రైతులు ఛత్తీస్‌గఢ్‌లో ఆందోళనకు దిగారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రమణ్ సింగ్ సొంత నియోజకవర్గం రాజ్‌నందన్‌గోన్‌లో సుమారు 10 వేల మంది రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. రుణమాఫీ, బోనస్, బకాయి పడిన పంట బీమా చెల్లించాలని, తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న తమను ఆదుకోవాలని రైతులు పెద్దఎత్తున నినదించారు. కలెక్టర్ వినతిపత్రం సమర్పించిన అనంతరం, ప్రదర్శనా వెళ్ళిన రైతులు రాజ్‌నందన్‌గోన్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని చుట్టుముట్టారు. పోలీసులు వీరిని అడ్డుకుని, నాయకులను అరెస్టు చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే... తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

పచ్చి మాంసం తిని...



జంతర్‌మంతర్ వద్ద తమిళ రైతుల వినూత్న నిరసన

న్యూఢిల్లీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా తమిళ రైతులు గళమెత్తారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పచ్చి మాంసాన్ని భుజించి నిరసన తెలిపారు. రుణమాఫీ, పండించిన పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని తమిళనాడు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోయినట్టయితే మానవ శరీరాన్ని కూడా తినేందుకు వెనకాడబోమని నిరసనకారులు తెలిపారు. దేశ రాజధానిలో44రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని భారత కిసాన్ సంఘం ఉపాధ్యక్షుడు అయ్యకన్ను విమర్శించారు. అన్నాడీఎంకే నేతలకు రైతుల సమస్యలపై చిత్తశుద్ధిలేదన్నారు. రైతుల సమస్యలను విస్మరించి వారంతా పదవుల కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు.



కాంగ్రెస్ ఉన్న కూటమిలో సీపీఐ(ఎం) చేరదు

సీతారాం ఏచూరి స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా వున్న ఎన్నికల కూటమిలో సీపీఐ(ఎం) చేరబోదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మంగళవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. అయితే జేడీ(యూ) రెబల్ నేత శరద్ యాదవ్‌తో కలిసి 'సేవ్ కాంపోజిట్ కల్చర్' (ఉమ్మడి సంస్కృతిని కాపాడండి) ప్రచారాన్ని కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రచారానికి సంబంధించిన సమావేశాలకు తమ పార్టీ హాజరవుతుందని, అయతే కాంగ్రెస్‌తో కూడిన మహా కూటమి ర్యాలీలలో తాము పాల్గొనబోమని ఆయన వివరించారు. ఉమ్మడి సంస్కృతి పరిరక్షణ అంశాన్ని మహా కూటమితో ముడిపెట్టవద్దని ఏచూరి సూచించారు. ఉమ్మడి సంస్కృతి పరిరక్షణకు చేపట్టిన ఉద్యమానికి, ఎన్నికల పొత్తులు, సర్దుబాట్లకు ఎటువంటి ...9లో

వర్ష బీభత్సం

వణుకుతున్న ముంబయి ..జనజీవనం అస్తవ్యస్తం

- అత్యవసరమైతే తప్ప బయటకువెళ్లొద్దు : మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- మరో 48గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు : వాతావరణ శాఖ
- విక్రోలిలో భవనం కూలి ఒకరి మృతి



కేఈఎం ఆస్పత్రిలో వర్షపు నీరు



డివైడర్ల సహాయంతో నడుస్తున్న వరద బాధితులు

దేశ ఆర్థిక రాజధాని ముంబయి భారీవర్షాలకు వణుకుతున్నది.పాత ముంబయి,నవీముంబాయితో పాటు పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెద్ద పెద్ద హోర్డింగులు గాల్లో ఎగిరిపోయాయి. రైల్వే ట్రాకులు,రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ముంబయి విమానాశ్రయంలోనూ నీరు చేరింది. దీంతో పలు విమానసర్వీసులను రద్దు చేయగా, మరికొన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతినిధి వీణ చిప్లూంకర్ తెలిపారు. అనుకూల వాతావరణం ఏర్పడగానే విమాన సర్వీసులను పునరుద్ధరిస్తామని అన్నారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. 9లో



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాగునీటి ప్రాజెక్టులకు రెండు వ్యవస్థలు

తాగునీరు, విద్యుదుత్పత్తి కోసం...

- భూమి రికార్డుల ప్రక్షాళన పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం
- మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయం
- రెవిన్యూ కార్యాలయాల్లో ఐటీ అధికారుల నియామకం : నీటిపారుదల, రెవిన్యూ, మిషన్ భగీరథ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఆపరేషన్ మ్యాన్యువల్స్ రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టు ద్వారా ఏ ప్రాంతం నుంచి ఎన్ని నీళ్లు మిషన్ భగీరథకు ఉపయోగిస్తారో మదింపు చేయాలని, రాష్ట్రం యూనిట్‌గా గుర్తించి యావత్ తెలంగాణ అవసరాలను తీర్చడం కోసం 'డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ'ను ఏర్పాటు చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఏ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి ఎన్ని నీళ్ల కావాలో లెక్కలు వేసి, వాటి వినియోగానికి సంబంధించి 'పవర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ'ను ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ భూముల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని ఉన్నత స్థాయిలో ...9లో

సైన్యంకంటే మీ వద్దే ఎక్కువ

దేశం మొత్తాన్ని తగులబెట్టొచ్చు : ఢిల్లీ-ఎన్‌సీఆర్ దుకాణదారులను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

లైసెన్సులపై తొలగని సస్పెన్షన్

వివరాలు 2లో

పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్

పది రోజుల్లో మూడో ఘటన

ముంబయి: మహారాష్ట్రలోని థానెలో దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటన నుంచి ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడ్డారు. దేశంలో గడిచిన పది రోజుల్లో మూడో రైలు ప్రమాద ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. రైలు.. నాగ్‌పూర్ నుంచి ముంబయికి వెళ్తుండగా మంగళవారం ఉదయం 6.40 గంటలకు థానెలోని అసాన్‌గాన్ సమీపంలో తొమ్మిది బోగీలు పట్టాలు తప్పాయి. వెంటనే రైల్వే అధికారులు ఘటనా స్థలికి ...9లో



జనం మత్తు..ఖజనా మస్తు!

- విరివిగా షాపుల అనుమతులకు కసరత్తు
- నిధుల సమీకరణ కోసం నూతన ఎక్సైజ్ పాలసీ
- సీఎం వద్దకు ముసాయిదా

నవతెలంగాణ బ్యూరో –హైదరాబాద్

ఖజానా నింపటానికి ప్రభుత్వాలు మద్యాన్నే ఆసరాగా చేసుకుంటున్నాయి. జనం ఆరోగ్యాన్ని గుల్లచేసే మద్యంపైనే పాలకులు ఆధారపడటం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. తాజాగా టీఆర్‌ఎస్ సర్కారు కూడా జీఎస్టీ వల్ల ఏర్పడే నిధుల లోటును పూడ్చుకునేందుకు లిక్కర్ మీదే ఆధారపడబోతున్నది. ఆ దిశగా ఏర్పాట్లు ...9లో



నీట్ అభ్యర్థులకు ఊరట

డీమ్డ్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5,500 సీట్ల భర్తీకి పచ్చజెండా

వచ్చేనెల 7లోపు తుది విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి : డీజీహెచ్‌ఎస్‌కు సుప్రీం ఆదేశాలు 2లో

గుడివెనుక ఆ స్వామీ..

97 ఏండ్ల పూజారి 20 ఏండ్ల యువతితో..

ఢిల్లీ శివారు ఫరీదాబాద్‌లో ఘటన.. 2లో



కాక్కొరోకో..



ఇక మీదట రెండు బాటిళ్లు తాగితే సరిపోదు.. విధానం మారింది.. నాలుగుకు తగ్గకూడదు..!!

ఉద్యోగులకు సీపీఎస్ శాపం

పేరు, హోదా, గౌరవం, మంచి జీతం వస్తుందని ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో పేరుంది. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా నెలకు కచ్చితమైన వేతనం వస్తుంది. నిత్యావసర ధరలు పెరిగితే కరువు భత్యం అందుకుంటారు. ఇలా ఏ కోణాన చూసినా ప్రభుత్వ ఉద్యోగులకు ఏ సమస్యా లేదన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ ప్రభుత్వ ఉద్యోగుల్లో కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) పరిధిలో ఉన్న వారి పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా మారింది. పేరుకేమో ప్రభుత్వ ఉద్యోగులు. కానీ వారికి కనీస పింఛన్ సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. ఉద్యోగులకు సీపీఎస్ శాపంగా మారింది. పాత పింఛన్ విధానం ప్రకారం ఉద్యోగి ఉద్యోగ విరమణ పొందినపుడు చివరి జీతంలో 50 శాతం పింఛన్ రూపంలో అందేది. అదే సీపీఎస్ విధానమైతే ఉద్యోగ విరమణ పొందినా, ప్రమాదవశాత్తూ మరణించినా ఎలాంటి సామాజిక భద్రత లేదు.

- ఉద్యోగం ఉన్నా కనీస పింఛన్ కరువాయే!
- షేర్‌మార్కెట్‌పైనే జీవనాధారం
- గ్రాట్యూటీ, కమ్యూటేషన్ సౌకర్యం లేదు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులపై ఆధారపడ్డ కుటుంబానికీ (ఫ్యామిలీ) పింఛన్ సౌకర్యం లేదు. కరువు భత్యం రాదు. ఇతర ఉద్యోగులకున్నట్టుగా జీపీఎఫ్, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ సౌకర్యాలు లేవు. దీంతో సీపీఎస్ ఉద్యోగుల బతుకులకు సామాజిక భద్రత లేదు. సీపీఎస్ ఉద్యోగులు ఇప్పటి వరకు సుమారు 250 మంది వరకు మరణించారు. వెయ్యి మందికిపైగా ఉద్యోగ విరమణ పొందారు. వారికి ఒక్క రూపాయి పింఛన్ రాలేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డెత్ కమ్ డిసెబులిటీ గ్రాట్యూటీ ఇస్తున్నది. రైల్వే ఉద్యోగులకూ వర్తించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపచేయడం లేదు. ఉద్యోగుల ఫ్రెండ్లీ అని మాటల్లో చెప్తున్న తెలంగాణ ప్రభుత్వం చేతల్లో చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మార్కెట్ శక్తులకే లాభం...

2004 జనవరి ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004, సెప్టెంబర్ ఒకటి తర్వాత ...9లో

మసాజ్‌తో మగపిల్లాడు

- మాంత్రికుడు చెప్పినట్టు వినలేదని అత్తామామ వేధింపులు
- అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నా పట్టించుకోని భర్త
- పిల్లాడితోపాటు రూ.10 లక్షలు తేవాలని గెంటివేత
- ఏడుగురిపై కేసు నమోదు చేసిన డీసీపీ
- రిమాండ్‌కు తరలింపు

ఎన్నో ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన యువతికి నెల రోజుల్లోనే వేధింపులు ఎదురయ్యాయి. గర్భవతి అని తెలిసిన వెంటనే మగపిల్లాడినే కనాలని హుకుం జారీ చేశారు. మంత్రగాని వద్దకు తీసుకెళ్లి నరకం చూపించారు. మసాజ్ పేరుతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆ యువతి మొరపెట్టుకున్నా ఆలకించలేదు. పైగా మాంత్రికుడు చెప్పినట్టు వినలేదని.. అందుకే ఆడపిల్ల పుట్టిందని.. పిల్లాడితోపాటు రూ.10లక్షలు తీసుకురావాలని ఇంట్లో నుంచే గెంటేశారు. 9లో

వర్ణిక కుండుపై లైంగిక వేధింపుల కేసు

బీజేపీ నేత తనయుడికి బెయిల్ నిరాకరణ

చండీగఢ్ : ఐఏఎస్ అధికారి కుమార్తె వర్ణిక కండూపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ నేత సుభాష్ బర్ల తనయుడు వికాస్ బర్ల, అతని స్నేహితుడి ఆశీష్ కుమార్‌కు చండీగఢ్ కోర్టు బెయిల్ నిరాకరించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బర్జిందర్‌పాల్ సింగ్ వీరి బెయిల్ పిటిషన్‌ను కొట్టిపారేశారు. వికాస్, ఆశీష్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ నేపథ్యంలో సమాధానం ఇవ్వాల్సిందిగా కోర్టు సోమవారం చండీగఢ్ పోలీసులను ఆదేశించింది. వీరిద్దరికీ బెయిల్ మంజూరు చేయరాదని కోర్టుకు పోలీసులు తెలపడంతో మేజిస్ట్రేట్ వారి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. దీంతో వీరిద్దరూ జైల్లోనే కొనసాగనున్నారు. కాగా, వీరిద్దరూ హై కోర్టులో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది.

మధ్యప్రదేశ్ వరదల్లో

లైబ్రరీలోని 21 వేల పుస్తకాలు ధ్వంసం

భోపాల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల పోటెత్తిన వరదల కారణంగా అల్లమా ఇక్బాల్ స్మారక గ్రంథాలయంలోని 21వేల పుస్తకాలు ధ్వంసమయ్యాయి. దీన్ని సాంస్కృతిక విషాదంగా భావిస్తున్నామని గ్రంథాలయ కార్యదర్శి రషీద్ అంజుమ్ తెలిపారు. చరిత్రకారులకు అవసరమైన అరుదైన పుస్తకాలన్నీ పాడయ్యాయని అన్నారు. కాగా, 1938లో నవాబ్ ఆహ్వానం మేరకు ప్రముఖ కవి, తత్త్వవేత్త అల్లమా ఇక్బాల్ భోపాల్‌లో పర్యటించారు. భోపాల్‌లో పర్యటించిన సంవత్సరం తర్వాత ఆయన మృతి చెందారు. ఆయన సంస్మరణార్థం భోపాల్‌లో గ్రంథాలయాన్ని నిర్మించారు. చరిత్రకు సంబంధించిన వేలాది పుస్తకాలను గ్రంథాలయ నిర్వాహకులు సేకరించారు. మధ్యప్రదేశ్‌లో వరదలు బీభత్సం సృష్టించడంతో వేలాది పుస్తకాలు పాడయ్యాయి. వాటిలో ప్రాచీన నిఘంటువుగా పిలవబడే తెహ్జీబుల్లిగత్, 1919లో బహిర్‌అహ్మద్ రచించిన మొఘల్ కలీన్ భరత్, వఖాయత్ దరూత్ హుకూమత్ పుస్తకాలతో పాటు పలు ప్రముఖ పుస్తకాలు పాడయ్యాయని అంజుమ్ చెప్పారు.

జమా మసీదు పేలుళ్ల కేసు..

యాసిన్ భట్కల్ దోషి

న్యూఢిల్లీ: ఇండియన్ ముజాహిదీన్ ఫౌండర్ మెంబర్ యాసిన భట్కల్ రెండు కేసుల్లో దోషిగా పాటియాలా కోర్టు నిర్ధారించింది. 2010 సెప్టెంబర్ 19న ఢిల్లీలోని జమా మసీదులో జరిగిన పేలుళ్లకు సంబంధించినవే. సాక్ష్యాధారాలు లేని కారణంగా ముగ్గురిని విడుదల చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఎన్ఐఏ కోర్టు భట్కర్ ఉరిశిక్ష విధించింది. పాటియాలో కోర్టుకు చేరిన ఈ కేసును అక్టోబర్ 23నుంచి విచారించనున్నది.

వెయ్యికి నో చాన్స్ : కేంద్రం

న్యూఢిల్లీ: తాజాగా రూ.200 నోట్లు మార్కెట్లోకి విడుదలైన నేపథ్యంలో రూ.1000 నోట్లు మళ్లీ చెలామణిలోకి రాబోతున్నాయంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. కానీ, అలాంటిదేమీ లేదని కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ మంగళవారం తేల్చి చెప్పింది. వెయ్యి రూపాయల నోట్లను తిరిగి మార్కెట్‌లోకి తేవడంపై ప్రతిపాదనలు కూడా ఏమీ లేవని వెల్లడించింది. రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ గతేడాది నవంబర్‌లో కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే కొత్త రూ.500, రూ.2000 నోట్లను మార్కెట్లోకి తెచ్చింది. ఇటీవల రూ.200 నోట్లు చెలామణిలోకి రాగా.. కొత్త రూ.50 నోట్లను కూడా ముద్రిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది.

రెండు కేసుల్లో నిర్దోషిగా...

- **అయినా.. బాబా రాంపాల్‌కు తప్పని జైలు జీవితం**

చండీగఢ్: వివాదాస్పద గురువు బాబా రాంపాల్‌ను రెండు కేసుల్లో నిర్దోషిగా తేలాడు. ఆయనపై ఆరోపణలను రుజువు చేయడంలో పోలీసులు విఫలమవడంతో హిస్సార్ కోర్టు మంగళవారం ఈ తీర్పు వెలువరించింది. శాంతి భద్రతల దృష్ట్యా.. తీర్పును వెలువరించేందుకు రాంపాల్ ఉంటున్న హిస్సార్ సెంట్రల్ జైలులోనే కోర్టును నిర్వహించారు. పలు కేసుల్లో విచారణ ఎదుర్కొంటుండంతో రాంపాల్ ఇంకా జైలులోనే గడపాల్సి ఉన్నది. 2014లో రెండు వర్గాలకు మధ్య జరిగిన అల్లర్లలో రాంపాల్ ప్రమేయమున్నదని, ఆయనే ఘర్షణలు తలెత్తేలా ప్రేరేపించాడని ఆరోపణలున్నాయి. ఆనాటి ఘటనలో ఓ చిన్నారి, ఐదుగురు మహిళలు చనిపోయారు. అయితే ఈ కేసులో రాంపాల్.. కోర్టుకు హాజరుకావడంతో 43 సార్లు విఫలమయ్యాడు. అరెస్టు కాకుండా పలుమార్లు తప్పించుకున్నాడు. ఆయనను ఎట్టకేలకు 2014 నవంబర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు ముందు రాంపాల్ అనుచరుల నుండి పోలీసులు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. హిస్సార్‌లోని బర్వాలాలో ఉన్న సత్లోక్ ఆశ్రమంలో ఉన్న రాంపాల్‌ను అరెస్టు చేయకుండా దాదాపు 15 వేల మంది అనుచరులు అడ్డుకున్నారు. చివరకు ఆశ్రమానికి నీటి, విద్యుత్ సరఫరాను నిలిపి వేసి రాంపాల్‌ను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా అల్లర్ల కేసులో నిర్దోషిగా తేలినా, రాంపాల్ జైలు జీవితం కొనసాగించక తప్పదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్ చౌదరీ అన్నారు. రాంపాల్.. హత్య, హత్యాయత్నం, రాజద్రోహం కింద పలు కేసులున్నాయని, వీటి నుంచి ఆయన తప్పించుకోలేరని తెలిపారు.

మందిరాల పునర్నిర్మాణానికి

పరిహారం చెల్లించనవసరం లేదు

గుజరాత్ సర్కారుకు సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 2002 నాటి దాడుల్లో ధ్వంసమైన ప్రార్థనా మందిరాల పునర్నిర్మాణానికి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నాటి దాడుల్లో ధ్వంసమైన ప్రార్థనా మందిరాల పునర్నిర్మాణం, రిపేర్లకు అవసరమైన నిధులను ప్రభుత్వమే అందచేయాలంటూ గుజరాత్ హైకోర్టు గతంలో వెలువరించిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ గుజరాత్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తి పిసి పంత్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

'ఆదివాసి విల్ నాట్ డాన్స్' నిషేధంపై నిరసన

- **రచయితకు మద్దతు ప్రకటించిన మేధావులు, సామాజిక కార్యకర్తలు**

రాంచీ : ప్రముఖ రచయిత హన్సదా సోవేంద్ర శేఖర్ రచించిన "ఆదివాసి విల్ నాట్ డాన్స్" అనే కథా సంకలనాన్ని జార్ఖండ్ ప్రభుత్వం నిషేధించడాన్ని రచయితలు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. సోవేంద్ర శేఖర్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఆదివాసి విల్‌నాట్ డాన్స్ కథలో 'సంథాల్' ప్రజలను ప్రత్యేకించి మహిళలను కించపరిచారని పేర్కొంటూ జార్ఖండ్ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. ఈ పుస్తకంపై పలువురు నిరసన వ్యక్తం చేశారు. రచయిత సోవేంద్ర శేఖర్ పనిచేస్తున్న పాకూర్ పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించడంతో పాటు కథా సంకలనాన్ని, ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కథా సంకలనాన్ని నిరసిస్తున్న వారు ఆన్‌లైన్‌లో తనను వేధిస్తున్నారని రచయిత వెల్లడించారు.

సుప్రీంకోర్టులో

ఆరుగురు న్యాయమూర్తుల కొరత

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రఫుల్లా చంద్రపంత్ మంగళవారం పదవీ విరమణ పొందారు. సర్వోన్నత ధర్మాసనంలో భారత ప్రధాన న్యాయమూర్తి సహా 31మంది న్యాయమూర్తులుండాలి. జస్టిస్ చంద్రపంత్ రిటైర్‌మెంట్‌తో సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య 25కి చేరింది. సీజేఐగా సేవలందించిన జేఎస్ ఖేహర్ ఈనెల27న పదవీ విరమణ పొందారు. సీనియర్ జడ్జీ దీపక్‌మిశ్రా భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా, జస్టిస్ ప్రఫుల్లా చంద్రపంత్ రిటైర్ కావడంతో సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల సంఖ్య ఆరుకు చేరుకున్నది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల ఆధారంగా న్యాయమూర్తుల నియామకాలు చేపట్టనున్నట్టు కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది.

గుడివెనుక ఆ స్వామీ..

న్యూఢిల్లీ : భగవంతునికి, భక్తుని మధ్య అనుసంధానంలా ఉంటామనే ఓ పూజారి గుడివెనుక బరితెగించాడు. ఓ యువతితో శృంగారంలో ఉండగా.. చూసిన భక్తులు ఆ స్వామీజీని పట్టుకుని చితకబాదారు. ఈ ఘటన ఢిల్లీ శివారులోని ఫరీదాబాద్‌లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం సోహనా రోడ్‌లో ఉన్న శనిమందిరంలో డోరిలాల్ శర్మ(97) పూజారిగా పనిచేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర ప్రాంతానికి చెందిన ఇతను గత కొన్నేండ్లుగా ఈ ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నాడు. సంజయ్ కాలనీకి చెందిన 20 ఏండ్ల యువతితో అసభ్యకరమైన స్థితిలో ఉండగా.. పరిసరాల్లోని భక్తులు పట్టుకుని చావబాదారు. సమాచారం తెలిసిన పోలీసులు పూజారి దోరిలాల్‌ను అరెస్టు చేశారు. అతడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లైంగికదాడి నిందితుడి మృతి కేసులో

ఐజీ సహా 8 మంది అరెస్టు


సిమ్లా : హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో లైంగికదాడి నిందితుడి కస్టోడియల్ డెత్ కేసులో ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ)తో పాటు మరో ఏడుగురిని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) మంగళవారం అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో ఐజీ జహూర్ హెచ్ జైదీ, డీఎస్పీలు మనోజ్ జోషి, రాజేందర్‌సింగ్, ఏఎస్ఐ దీప్‌చంద్, హెడ్ కానిస్టేబుళు సూరత్‌సింగ్, మోహన్‌లాల్, రఫీక్ అలీ, కానిస్టేబుల్ రంజిత్‌సింగ్‌లు ఉన్నారు. సిమ్లాలో గతనెలలో బాలిక(16)పై సామూహిక లైంగికదాడి, హత్య ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. చివరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించింది. కాగా కేసులో నిందితులైన రాజేందర్‌సింగ్, సూరజ్ సింగ్, ఆశీశ్ చౌహాన్, సుభాష్ బిస్త్, దీపక్‌కుమార్, లోక్‌జన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కాగా పోలీసుస్టేషన్‌లో నేపాల్ వ్యక్తి సూరజ్‌ను సహచర నిందితుడు రాజేందర్ హత్య చేసినట్టు ఆరోపణలున్నాయి.

నటుడు దిలీప్‌కు బెయిల్ నిరాకరణ

- **లైంగికదాడి యత్నం కేసులో ఆధారాలు లభ్యం**

కొచ్చి: ప్రముఖ మలయాళీ నటి భావనను అపహరించి, ఆమెపై అత్యాచారానికి యత్నించారనే ఆరోపణలతో అరెస్టయిన కేరళ సూపర్‌స్టార్ దిలీప్ బెయిల్ కోసం చేస్తున్న ప్రయత్నాలు రెండోసారీ బెడిసికొట్టాయి. ఈ కేసులో సున్నితమైన ఆధారాలు లభ్యం కావడంతో దిలీప్‌కు బెయిల్ ఇచ్చేందుకు కేరళ హైకోర్టు మంగళవారం నిరాకరించింది. దీంతో ఆయన్ను కొచ్చి జైలుకు తరలించారు. జూలైలోనూ కోర్టు ఓ సారి బెయిల్ నిరాకరించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 17న త్రిసూర్ నుంచి కొచ్చి వెళుతుండగా దిలీప్ సహా నలుగురు వ్యక్తులు భావనను లైంగికంగా వేధించిన ఘటనకు సంబంధించి 19 ఆధారాలను సేకరించామని పోలీసులు కోర్టుకు తెలిపారు.

సోషల్ హల్‌చల్





'అప్పుడూ భయపడలేదు.. ఇప్పుడూ భయపడను..'

న్యూఢిల్లీ, సిర్సా : '2009లో అతడికి వ్యతిరేకంగా నేను వాంగ్మూలం చెబుతున్నప్పుడు ఆ బాబా కోర్టు రూమ్‌లోనే ఉన్నాడు. లైంగిక దాడి బాబాకు అప్పుడూ భయపడలేదు.. ఇప్పుడూ భయపడను' అని డేరా సచ్చా సాధు చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ దుర్మార్గ చర్యలను బయటపెట్టి, అతడిని కటకటాల వెనక్కి పంపేందుకు కీలక సాక్ష్యమిచ్చిన మహిళ చెప్పారు. గుర్మీత్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష పడిన నేపథ్యంలో ఫోన్‌లో ఓ వార్తా సంస్థతో ఆమె మాట్లాడారు. 2002 నుంచి ఆమె పోలీసు రక్షణలో కాలం వెళ్లదీస్తున్నారు. లైంగిక వేధింపులపై అజ్ఞాతలేఖ అందిన ఇదే సంవత్సరం పంజాబ్, హర్యానా కోర్టు కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. లైంగిక వేధింపుల బాబాపై సాక్ష్యం ఇవ్వాల్సిందిగా ఆ ఊబిలో కూరుకుపోయిన 18 మంది మహిళలను సీబీఐ ఒప్పించింది. కాగా, ఇద్దరు మహిళలు మాత్రమే అతడికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం ఇచ్చారు. 'ఈ రోజుకు నాకు న్యాయం లభించింది' అని ఆ మహిళ చెప్పారు. సీబీఐ కోర్టు డేరా బాబాను దోషిగా తేల్చిన ఈ నెల 24 నుంచి ఆ మహిళకు పోలీసులు మరింత భద్రతను పెంచారు. సిర్సాలోని డేరా సచ్చా సౌదా హెడ్ క్వార్టర్స్‌లో కళాశాల విద్యనభ్యసిస్తుండగా ఆమెపై లైంగికదాడి జరిగినట్టు బాధితురాలి సమీప బంధువు ఒకరు చెప్పారు. ఆ తర్వాత ఆమె పెండ్లి చేసుకుందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్టు తెలిపారు. బాధితురాలి సోదరుడు కూడా డేరా చీఫ్ పరమ భక్తుడు. 'రామ్ రహీమ్ సింగ్ అనుచరులు 2002లో ఆమె సోదరుడ్ని హత్యచేశారు. తనపై కేసు నమోదుకు దారితీసిన ఆ అజ్ఞాత లేఖను బాధితురాలి సోదరుడే రాసి ఉంటాడని బాబా అనుమానం' అని బాధితురాలి బంధువు చెప్పారు. కాగా, ఈ హత్య కేసును కూడా సీబీఐ దర్యాప్తు చేస్తున్నది. సెప్టెంబరు 16న ఈ కేసు తుది విచారణ జరగనుంది. 'బాధితురాలి తండ్రి గతేడాది మృతిచెందారు. 2009లో కోర్టు గదిలో సాక్ష్యం ఇచ్చే సమయంలో అతను ఆమె వెంటనే ఉన్నారు. ఆ ఒక్కసారే ఆమె కోర్టుకు వెళ్ళింది. మిగిలిన అన్ని సందర్భాల్లోనూ బాధితురాలి తరపున ఆమె తండ్రి కోర్టుకు హాజరయ్యారు. డేరా చీఫ్ గార్డులు



ఆయుధాలతో కోర్టుకు వచ్చేవారు. వాటిని చూపిస్తూ బెదిరించేవారు. కేసును ఉపసంహరించుకోవాల్సిందిగా ఆయుధాలతో మమ్మల్ని బెదిరించేవారు. చివరకు... ఎంత అడిగితే.. అంత చెల్లిస్తామని కూడా సంప్రదింపులకు దిగారు' అని బాధితురాలి బంధువు చెప్పారు. 'తనకు న్యాయం కావాలని ఆమె పట్టుబట్టింది. మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్న అతడి బండారాన్ని బయటపెట్టాలని, అతడికి తగిన శాస్తి చేయాలని ఆమె నిర్ణయించుకుంది. ఎన్ని బెదిరింపులు వచ్చినా, డబ్బు ఆశ చూపినా.. మేము వెనక్కి తగ్గలేదు. న్యాయం కోసం నిలబడ్డాం. న్యాయం జరిగింది. డేరా అకృత్యాలను ఎంతో ధైర్యాంగా కోర్టులో చెప్పిన తొలి మహిళ ఆమె. ఆమె చరిత్ర సృష్టించింది' అని తెలిపారు.

సిర్సాలో కర్ఫ్యూ సడలింపు

డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీం ప్రధాన కార్యాలయంలోని సిర్సాలో కర్ఫ్యూను మంగళవారం సడలించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ కర్ఫ్యూను సడలిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. కాగా, డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి కొంత ఉద్రిక్తంగానే ఉన్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, దీంతో కర్ఫ్యూను సడలించినట్టు స్పెషల్ కమిషనర్ వి ఉమాశంకర్ చెప్పారు. 700 ఎకరాల విస్తీర్ణంలో డేరా ప్రధాన కార్యాలయ క్యాంపస్ చుట్టూ ఆర్మీ, పారామిలిటరీ, హర్యానా పోలీసుల పహారా కొనసాగుతోంది. ఈ క్యాంపస్‌లో దాదాపు 15 వేలమంది ఉన్నట్టు పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఒక చిన్న పట్టణాన్ని తలపించే గుర్మీత్ క్యాంపస్‌లో ఇండ్లు, పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులు, స్టేడియం, ఇతర మౌలిక వసతులు కూడా ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా హర్యానా, పంజాబ్‌లలో భద్రతా బలగాలు అప్రమత్తతో ఉన్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

మొబైల్ నెట్ సేవలపై కొనసాగుతున్న ఆంక్షలు

డేరా నేత గుర్మీత్ సింగ్‌ను సీబీఐ కోర్టు దోషిగా ప్రకటించిన రోజున ఆయన అనుచరులు సృష్టించిన విధ్వంసం, హింసాత్మక ఘటనల నేపథ్యంలో మొబైల్ ఇంటర్ నెట్ సర్వీసులపై ప్రకటించిన ఆంక్షలను మరో రోజు కొనసాగించారని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా జారీచేసిన ఆదేశాల ప్రకారం బుధవారం మధ్యాహ్న 12 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

'డేరా' హింసపై కేంద్రానికి నివేదిక

రామ్ రహీమ్ సింగ్‌ను కోర్టు దోషిగా ప్రకటించిన తరువాత రాష్ట్రంలో జరిగిన హింసాకాండపై హర్యానా ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యమేమీ లేదని నివేదికలో పేర్కొంది. హర్యానాలోని వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల్లో ఎంతమంది మరణించారు, ఎంతమందికి గాయాలయ్యాయన్న వివరాలతో పాటు, ఆస్తుల విధ్వంసం ఏ మేర జరిగిందన్న విషయంపై బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పంపిన 20 వేల మంది పారామిలటరీ సిబ్బందిని తగిన విధంగా మోహరించంలో విఫలమైన అంశాన్ని ఈ నివేదికలో ప్రస్తావించలేదు. ఈ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో పంచకులలో 32 మంది, సిర్సాలో ఆరుగురు మృతిచెందారు. దాదాపు 260 మందికి పైగా గాయాలయ్యాయి.

గుర్మీత్ ఆశ్రమంలోని 18 మంది బాలికలకు విముక్తి

బాబా లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు శిక్షకు గురైన డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీం ప్రధాన కార్యాలయంలోని సిర్సాలో 18 మంది బాలికలకు స్థానిక సహాయక బృందం విముక్తి కలిగించింది. వారిని ప్రస్తుతం వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు.

'కూతురు కాదు... అక్రమ సంబంధమే'



డేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు దత్త పుత్రికగా వార్తల్లోకి వస్తున్న హనీప్రీత్ సింగ్ ఇశాన్‌ల సంబంధంపై ఆమె భర్త సంచలన వ్యాఖ్యలు చేశారు. తన భార్య హనీప్రీత్, బాబా గుర్మీత్‌ల మధ్య అక్రమ సంబంధముందని విశ్వాస్ గుప్తా అన్నారు. హనీప్రీత్ అసలు పేరు ప్రియాంక తనేజా. 1999లో విశ్వాస్ గుప్తా, హనీప్రీత్‌లకు వివాహం జరిగింది. కాగా, 2011లో హనీప్రీత్ నుంచి విడాకులు కోరుతూ గుప్తా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హనీ ప్రీత్‌ను గుర్మీత్ సింగ్ లోబరుచుకున్నాడని, అందుకు తానే ప్రత్యక్ష సాక్షినని విశ్వాస్ గుప్తా తన విడాకుల పిటిషన్‌లో పేర్కొన్నారు. డేరా బాబాకు శిక్ష పడిన నేపథ్యంలో ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆశ్చర్యకరమైన విషయాలను గుప్తా వెల్లడించారు. బాబా నివాసమైన గుఫాలో తాను ఉండేవాడినని చెప్పారు. బాబా, హనీలను చూడకూడని స్థితిలో తాను చూశానని తెలిపారు. ఇది గమనించిన బాబా విషయం బయటకు చెబితే చంపేస్తానని తనను బెదిరించారని వెల్లడించారు. ఎక్కడికి వెళ్లినా హనీని బాబా తన వెంట తీసుకెళ్లేవాడని అన్నారు. కాగా, గుప్తా బాబా బండారాన్ని బయటపెట్టడంతో అప్పట్లో దుమారం రేగింది. దీంతో డేరా సచ్చా సౌదా అనుచరులు అవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టి పారేశారు. దత్త పుత్రికగా ఆమెను సృష్టించారు. బాబా ఒత్తిడి కారణంగా కోర్టులో దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని విశ్వాస్ తెలిపారు. గుప్తాకు డేరా సచ్చా సౌదా అనుచరుల నుంచి అపాయం ఉండటంతో ప్రస్తుతం రహస్య ప్రాంతంలో ఉంటున్నారు.

సాగునీటి ప్రాజెక్టును తాగునీటి ప్రాజెక్టుగామార్చారు...

'కాళేశ్వరం'పై ఎన్జీటీలో పిటిషనర్ వాదన

- సెప్టెంబర్ 6న తదుపరి విచారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రి కాళేశ్వరం 'సాగు'నీటి ప్రాజెక్టును 'తాగు'నీటి ప్రాజెక్టుగా మార్చిందని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో పిటిషనర్ పేర్కొన్నారు. సరైన అనుమతులు లేకుండానే ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా పిటిషనర్ల అభ్యంతరాలపై సెప్టెంబర్ 4వ తేదీలోగా సమాధానం చెప్పాలని తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశించింది. కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టు నిలుపుదల చేయాలంటూ ప్రాజెక్టు నిర్వాసితుడు హయాతుద్దీన్ ఎన్జీటీలో దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వతంత్ర కుమార్ నేతృత్వంలోని ప్రధాన ధర్మాసనం విచారించగా.. ఆగస్టు 25వ తేదీన జరిగిన విచారణ సమయంలో కేసును మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ జావేద్ రహీం నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం వాదనలు విన్నది. పిటిషనర్ తరపున న్యాయవాది సంజయ్‌ఉపాధ్యాయ వాదనలు వినిపించారు. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపట్టిందని తెలిపారు. పర్యావరణ, అటవీ, జాతీయ వన్యప్రాణి బోర్డు అనుమతులు తీసుకోలేదని వివరించారు. ఈ అంశంలో మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఎంపీసీబీ) సైతం అభ్యంతరం తెలిపిందని చెప్పారు. 'ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించింది. ఈ ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలో మూడు గ్రామాలు ముంపునకు గురవుతాయి' అని ఎంపీసీబీ వెల్లడించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి ప్రాజెక్టు నిర్మాణంపై తక్షణమే స్టే విధించాలని అభ్యర్థించారు. కాగా ఈ అంశంపై సమాధానం చెప్పేందుకు కొంత గడువు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర సర్కారు కోరింది. ఇందుకు సమ్మతించిన ధర్మాసనం.. కేసు విచారణను సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై 4వ తేదీలోగా సమాధానాలివ్వాలని ఆదేశించింది. తెలంగాణ నుంచి ఏజీ రామ్‌చందర్‌రావు, న్యాయవాది వెంకట్‌రెడ్డి హాజరయ్యారు.

ప్రధాని.. చైనా పర్యటన ఖరారు

- **వచ్చేనెల 3, 4 తేదీల్లో బ్రిక్స్ సదస్సు**



న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చైనా పర్యటన ఖరారైంది. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ మంగళవారం వెల్లడించింది. డోక్లామ్‌కు సంబంధించి భారత్, చైనాల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చైనాలో వచ్చేనెలలో జరిగే బ్రిక్స్ సదస్సుకు మోడీ హాజరవడంపై పలు రకాల ఊహాగానాలు వినిపించాయి. కాగా డోక్లామ్ వివాదానికి సోమవారం తెరపడింది. ఆ ప్రాంతం నుంచి బలగాలను ఉపసంహరించుకునేందుకు ఇరుదేశాలూ అంగీకరించాయి. దీంతో మోడీ.. చైనా పర్యటనకు మార్గం సుగమమైంది. వచ్చేనెల 3, 4 తేదీల్లో బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సు జరుగనున్నది. మోడీ 3 నుంచి 5 వరకు చైనాలో, 5 నుంచి 7 వరకు మయన్మార్‌లో పర్యటించనున్నారు.

రాజస్థాన్‌లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

మోడీ.. భారత ప్రధానిగా రాజస్థాన్‌లో రెండోసారి పర్యటించారు. ఆ రాష్ట్రంలో మోడీ మంగళవారం రూ.15 వేల కోట్లకు పైగా ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజస్థాన్ ముఖచిత్రాన్ని మారుస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రహదారులు బాగుంటేనే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాజస్థాన్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

కేంద్ర 'శక్తి పథకం' ప్రారంభ వేలం జీరో

గుజరాత్‌లో బొగ్గు సేకరణకు ముందుకురాని విద్యుత్ కంపెనీలు

అహ్మదాబాద్: విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు కొరతను తీర్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన నూతన పథకానికి ఎదురు దెబ్బ తగిలింది. విద్యుత్ కేంద్రాలకు తక్కువ ధరకే దేశీయ బొగ్గు సరఫరాకు ఉద్దేశించిన శక్తి పథకానికి గతేడాది మే నెలలో కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, ఈ పథకం కింద బొగ్గు సేకరణ కోసం గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన మొదటి టెండర్ ప్రకటనకు స్పందన కరువైంది. సోమవారంనాడు ఆ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ గుజరాత్ ఉర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ (జీయూవీఎన్ఎల్) ద్వారా రివర్స్ ఆక్షన్(అపసవ్య వేలం) పేరుతో 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం కంపెనీలను ఆహ్వానించగా జీరో వేలం నమోదైంది. వేలంలో పాల్గొనే కంపెనీలు ప్రభుత్వ పంపిణీ సంస్థలకు యూనిట్ విద్యుత్‌ను రూ.2.82 లేదా అంతకన్నా తక్కువ ధరకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం విధించిన ఈ షరతు తమకు గిట్టుబాటు కాదంటూ విద్యుత్ కంపెనీలు ముఖం చాటేశాయి. దీనిపై జీయూవీఎన్ఎల్ అధికారులను సంప్రదించగా.. వేలానికి మరో 20 రోజులు గడువు పొడిగిస్తున్నట్టు తెలిపారు. ధరలో ఏమైనా మార్పు ఉంటుందా అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పకుండా దాటవేశారు. ఈ పథకం ద్వారా దేశీయ బొగ్గును స్వీకరించే కంపెనీలు వేలం సందర్భంగా నిర్ణయించిన ధరలకే విద్యుత్‌ను సరఫరా చేయాలన్నది గమనార్హం. కాగా విద్యుత్ కంపెనీలన్ని రింగ్ అయ్యి యూనిట్ విద్యుత్ ధరను పెంచటమే దీని వెనుక వ్యూహమని నిపుణులు అంటున్నారు.

నీట్ అభ్యర్థులకు ఊరట

- **డీమ్డ్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5,500 సీట్ల భర్తీకి పచ్చజెండా**
- **వచ్చేనెల 7లోపు తుది విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి : డీజీహెచ్ఎస్‌కు సుప్రీం ఆదేశాలు**

న్యూఢిల్లీ : జాతీయ స్థాయి పరీక్ష నీట్‌లో (నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్ టెస్ట్) అర్హత సాధించినప్పటికీ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో అడ్మిషన్స్ లభించని విద్యార్థులకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. డీమ్డ్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5,500 సీట్ల భర్తీ కోసం కౌన్సిలింగ్ నిర్వహించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్)ను ఆదేశించింది. వచ్చేనెల7లోపు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, గతంలో సీటు పొందని అర్హులనైనా విద్యార్థులను మాత్రమే కౌన్సెలింగ్‌కు పిలవాలని మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించాలని తెలిపింది. డీమ్డ్ వర్సిటీల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ ప్రక్రియకు సంబంధించిన వ్యాజ్యంపై సీజేఐ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 5,500 సీట్లను 1:10 నిష్పత్తిలో భర్తీ చేయాలని త్రిసభ్య ధర్మాసనం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో, డీమ్డ్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5,500 సీట్ల భర్తీ కోసం నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. ఈఏడాది మే7న నీట్ పరీక్ష జరిగింది. జూన్12న ఫలితాలు విడుదలయ్యాయి. నీట్‌కు హాజరైన 11,38,890 మంది విద్యార్థుల్లో 6,11,539 మంది అర్హత సాధించారు.

మేరిటల్ రేప్‌ను క్రిమినల్ నేరంగా పరిగణించలేం

ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : భార్యకు ఇష్టం లేకపోయినా భర్త బలవంతంగా తన లైంగిక వాంఛ తీర్చుకోవడాన్ని (మేరిటల్ రేప్) క్రిమినల్ నేరంగా పరిగణించలేమని కేంద్రం మంగళవారం ఢిల్లీ హైకోర్టులో స్పష్టం చేసింది. దీనివల్ల వివాహ వ్యవస్థ మనుగడకే ముప్పు వాటిల్లగలదని ఆందోళన వ్యక్తం చేసింది. పైగా భర్తలను వేధించడానికి ఇదొక తేలికైన సాధనంగా మారుతుందని పేర్కొంది. మేరిటల్ రేప్‌ను నేరంగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం నేడు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఇప్పటికే ఐపీసీలోని 498 ఎ సెక్షన్ (వివాహితను ఆమె భర్త, అత్తమామలు వేధించడం) దుర్వినియోగం పెరుగుతోందని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు పేర్కొన్న విషయాన్ని కేంద్రం ఈ సందర్భంగా ప్రస్తావించింది. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాల్సిందిగా కేంద్రం కోరింది. తదుపరి దశలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వుండాలంటే ముందుగానే అందరి అభిప్రాయం తెలుసుకోవాలని పేర్కొంది. విచారణ సందర్భంగా పిటిషనర్లలో ఒకరి తరపున సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెస్ మాట్లాడుతూ, అవివాహితకు తన శరీరంపై పూర్తి హక్కులు ఎలా వుంటాయో వివాహితకు కూడా అలాగే వుంటాయని, పెళ్ళైనంత మాత్రాన ఆమెకు ఇష్టం లేకపోయినా భర్త బలవంతంగా తన లైంగిక వాంఛను తీర్చుకోవడానికి దీన్నొక లైసెన్స్‌గా చూడరాదని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి విదేశాల్లో ఇచ్చిన తీర్పులను ఆయన ఉదహరించారు. దీనిపై బుధవారం కూడా విచారణ కొనసాగనుంది. మేరిటల్ రేప్‌పై సమాజంలో కూడా విస్తృత ఏకాభిప్రాయం వుండాలని కేంద్రం పేర్కొంది.

సీతారామ ప్రాజెక్టు పనులపై హరీశ్ అసంతృప్తి

తుమ్మలతో కలిసి సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనుల నత్తనడకపై నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అసంతృప్తి వ్యకం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం సమీక్షించారు. భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు, పంప్‌హౌస్‌లు, కాల్వల నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్యాకేజీల వారీగా పనులపై ఆయన సమీక్షించారు. ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ఎత్తిపోతల పథకంలోని ఎనిమిది ప్యాకేజీల్లో మూడు ప్యాకేజీల పనులను ప్రారంభించారని మంత్రి తెలిపారు. మిగిలిన ఐదు ప్యాకేజీల పనులకు ఏజెన్సీలతో వెంటనే ఒప్పందాలు చేసుకుని పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఐదు పంప్‌హౌస్‌ల పనుల్లో ఇక పంప్‌హౌస్ పనులు మాత్రమే ప్రారంభమయ్యాయని, మరొక పంప్‌హౌస్ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. మిగిలిన మూడు పంప్‌హౌస్‌ల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మూడు పంప్‌హౌస్‌ల పనులను ఎప్పటిలోగా పూర్తి చేయనున్నారో తేదీల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి తనకు 15 రోజుల్లో తెలియచేయాలన్నారు. భూసేకరణ నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని మంత్రి ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ పర్యావరణ అనుమతుల కోసం అధికారులు కృషి చేయాలన్నారు. అటవీ రెవిన్యూ శాఖలు సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని అటవీ పర్యావరణ అనుమతుల సలహాదారు సుధాకర్‌ను మంత్రి ఆదేశించారు. 13వ కిలోమీటర్ నుంచి 30 వ కిలోమీటర్ వరకూ కాల్వల తవ్వకం కోసం వన్యప్రాణి పరిరక్షణ బోర్డు నుంచి అనుమతి తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రాజెక్టు కోసం అటవీ భూములను సేకరించినప్పుడు వీటికి ప్రత్యామ్నాయంగా భూములను సేకరించి అటవీ శాఖకు స్వాధీనం చేయాలన్నారు. సమావేశానికి ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఉదయసముద్రం పనులు డిసెంబర్‌లోపు పూర్తి చేయండి

ఉదయసముద్రం పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పనులపై మంగళవారం జలసౌధలో మంత్రి సమీక్షించారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి 24 గంటలూ పనులు చేయిస్తేనే ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 60 చెరువులను నింపాలని, 50 వేల ఎకరాలకు సాగునీరందించాలన్నారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పెండ్లిపాకల రిజర్వాయర్ పనులను, భూసేకరణ ప్రక్రియపై మంత్రి సమీక్షించారు. డిండి ఎత్తిపోతల పథకం కోసం 9,800 ఎకరాలు అవసరం కాగా ఇప్పటి వరకూ 5,000 ఎకరాలు సేకరించినట్టు అధికారులు తెలిపారు. రెండు వారాల్లో మిగిలిన భూమిని సేకరించాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఏజెన్సీల ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఖమ్మం జిల్లాలో మంజూరైన 19 ఎత్తిపోతల పథకాల గురించి మంత్రి సమీక్షించారు. ఈ పథకాలను పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మతతత్వాన్ని ఎదుర్కొనేందుకు...

వామపక్షాలు బలోపేతం కావాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతతత్వ బీజేపీని ఎదుర్కోవడానికి లౌకిక శక్తులు ఏకమవుతున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. ఇందులో వామపక్షాలే ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం లెఫ్ట్ పార్టీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరముందని అన్నారు. రెండు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురవరం ప్రారంభోపన్యాసం చేస్తూ.. అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిస్థితులను వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయనకు మద్దతుగా నిలిచిన వారు సైతం ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. పాకిస్తాన్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో చైనాతో కూడా మనదేశం ఘర్షణకు దిగిందని విమర్శించారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు దేశాలకు సూచించారు. రాజ్యాంగ పదవులన్నీ బీజేపీ చేతుల్లో ఉండటం దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ, ఈడీని ప్రయోగించడం ద్వారా ప్రతిపక్షాలను భయపెట్టి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులను బీజేపీ కైవసం చేసుకున్నదని విమర్శించారు. కాశ్మీర్‌లో పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయని కేంద్రం తాజాగా ఆర్టికల్ 35ను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అప్పుల రద్దు కోసం దేశవ్యాప్తంగా రైతాంగ సంఘాలు ఐక్యంగా ఆందోళనలు చేశాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు చేస్తున్న ఆందోళనలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు అడ్డుకోజూచుస్తున్నాయని.. అయితే ప్రజల మద్దతుతో వాటిని తిప్పికొడతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 350 ఎంపీ స్థానాలను గెలుస్తామంటూ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా చేసిన ప్రకటనను ప్రస్తావించిన సురవరం.. కేంద్రం విధానాలపై ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంటే ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. అధికారం కోసం టీడీపీ, వైసీపీ, టీఆర్‌ఎస్ వంటి పార్టీలతో బీజేపీ చాటుమాటు ఒప్పందాలు చేసుకుంటోందని విమర్శించారు. అదే విధంగా వచ్చే ఎన్నికల్లో కార్పొరేట్ల సాయం తీసుకోవడానికి వీలుగా ఇప్పుడు వారి రుణాలను మాఫీ చేసిందని విమర్శించారు. తెలంగాణలో సీపీఐని బలోపేతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురవరం

కొత్త కేజీబీవీల్లో ఏఎన్‌ఎంలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన 84 కొత్త కేజీబీవీల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డీఈఓలకు ఆదేశాలు జారీచేసింది. 80 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న కేజీబీవీల్లో ఏఎన్‌ఎంలను నియమించుకోవాలని కమిషనర్ ఆదేశించారు.విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే, ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా వీరిని నియమిస్తున్నట్టు కమిషనర్ జి కిషన్ తెలిపారు.

మోడల్ స్కూల్స్‌లో వాచ్‌మెన్స్ నియామకం

రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో వాచ్‌మెన్లను నియమిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఇప్పటికే డీఈఓలకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. త్వరలో వీరి నియమకాలు జరగనున్నాయి.

'ఉపాధిహామీ'ని రద్దు చేసే కుట్ర

వ్యవసాయ కార్మికవర్గం ఉద్యమించాలి

- వ్యవసాయ కూలీల్లో మహిళలే అధికం
- 33% రిజర్వేషన్ అమలుకు డిమాండ్ : అఖిల భారత వ్యకాస ప్రధాన కార్యదర్శి విజయరాఘవన్



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న ఎ.విజయరాఘవన్

నవతెలంగాణ-కోదాడ

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని, ఇందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికవర్గం ఉద్యమించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు ఎ.విజయరాఘవన్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని ఆర్‌ఎస్వీ ఫంక్షన్‌హాల్లో మంగళవారం నిర్వహించిన మహిళా కూలీల రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేండ్లలో దేశవ్యాప్తంగా దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. దేశంలో 12కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వీరిలో మహిళలు అత్యధికంగా ఉన్నారని చెప్పారు. వీరికి సరైన విద్య, వైద్యం, ఉపాధి అందని ద్రాక్షలా మిగిలిందన్నారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం నేటికీ అమలు చేయలేదన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర కేబినెట్‌లో మహిళలకు స్థానం కల్పించలేదంటే మహిళల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందని విమర్శించారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి.వెంకట్ మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కోసం ప్రత్యేక యంత్రాంగం రూపొందించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, మహిళా కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలకూ కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులను అరికట్టాలన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వ్యవసాయ కూలీల పాత్ర గొప్పదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తీసుకురాలేకపోయారన్నారు. రైతాంగ పోరాటాలకు కూలీలు మద్దతుగా నిలుస్తూ ఎన్నో విముక్తిదాయక ఉద్యమాలు నడిపారన్నారు.

మహిళా కూలీలు అనేక రకాల వివక్షతలకు, చీదరింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజాపోరాటాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, రూ.400 దినసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెలది పద్మావతి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సదస్సులో వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నాగయ్య, అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రసాద్, ఆర్.వెంకట్రాములు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జుట్టుకొండ బసవయ్య, ఎస్.రమ, నాయకులు ములకలపల్లి రాములు, ప్రభావతి, మట్టిపల్లి సైదులు, కుక్కడపు ప్రసాద్, బుర్రి శ్రీరాములు, ఎం.వెంకటేశ్వర్లు, ముత్యాలు, సూర్యనారాయణ, వెంకటనారాయణ, సోమపంగు రాధాకృష్ణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ 'విమోచన' యాత్ర

1 నుంచి 7 వరకు లక్ష్మణ్ పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ విమోచన దినాన్ని (సెప్టెంబర్ 17)ను రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 1 నుంచి 7వ తేదీ వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ యాత్రను నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్ రాంచంద్రరావు తెలిపారు. మంగళవారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు తెలంగాణ విమోచన యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాటి నిజాం నిరంకుశత్వం, రజాకార్ల అరాచకాలకు గురైన గ్రామాల్ని ఈ యాత్ర ద్వారా సందర్శిస్తామని తెలిపారు.

1వ తేదీ ఉదయం బషీర్‌బాగ్ కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి పార్టీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. దేవుని సంకేస, ఎర్రుపాలెం, బైరాన్‌పల్లి, దారశథి ఖిల్లా, గౌరెల్లి, అప్పంపల్లి ప్రాంతాలను ఈ సందర్భంగా సందర్శిస్తారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే బహిరంగ సభల్లో విమోచన దినోత్సవ ప్రాశస్త్యాన్ని, ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరిని ప్రజల్లో ఎండగడతామన్నారు. కేవలం ఎంఐఎం ప్రాపకం కోసమే సీఎం కేసీఆర్ అధికారికంగా విమోచన దినాన్ని నిర్వహించట్లేదని విమర్శించారు.


సంపాదకీయం

డోక్లామ్‌లో శాంతి పవనాలు

ప్రపంచంలో అతి పెద్ద దేశాలైన భారత్-చైనాలు డోక్లామ్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు స్వస్తి చెప్పి, విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న కృతనిశ్చయాన్ని వ్యక్తం చేయడం ఆహ్వానించదగిన పరిణామం. చైనాలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు వారం రోజుల ముందు వీచిన శాంతి పవనాలు ఈ ప్రాంతంలోని శాంతికాముకులకు కొండంత ఊరటనిచ్చాయి. డోక్లామ్‌పై గత రెండు మాసాలుగా కొనసాగిన ఉద్రిక్తత మరో యుద్ధానికి దారి తీస్తుందా? అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్న తరుణంలో ఇరు దేశాల నాయకత్వాలు విజ్ఞత ప్రదర్శించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు అంగీకరించడం ముదావహం. ఇక్కడ ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అన్నది కాదు ముఖ్యం. ఉభయ దేశాల మధ్య సత్సంబంధాల మెరుగుదలకు ఇది ఏమేరకు తోడ్పడుతుందన్నదే ప్రధానం. పరస్పర అపనమ్మకాలు, అపోహల స్థానే పరస్పర విశ్వాసం, అవగాహనతో ఇరు దేశాలు ముందుకు సాగితే సరిహద్దులను శాంతి వారధులుగా మార్చుకోవడం అసాధ్యమేమీ కాదు.

బ్రిక్స్ సదస్సులో మోడీ, జిన్‌పింగ్ భేటీ తరువాత ఉన్నత స్థాయి దౌత్య అధికారుల మధ్య చర్చల ప్రక్రియ ఊపందుకుంటుందని ఆశిద్దాం. వాణిజ్య సంబంధాలు అభివృద్ధి చేసుకుంటూనే రెండు దేశాలూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సరిహద్దు సమస్యను పరిష్కరించుకోడానికి కూడా చొరవ చూపాలి.

చారిత్రకంగా లభించిన సరిహద్దు సమస్యలను అధిగమించి ఐక్యంగా ముందుకు సాగిన చరిత్ర భారత్, చైనాలకు వుంది. వేల సంవత్సరాల పాటు సత్సంబంధాలు, ఆదానప్రదానాలు కలిగిన రెండు దేశాల మధ్య పొరపొచ్చాలు వచ్చింది కొద్దిపాటి కాలం మాత్రమే. 1962 సరిహద్దు యుద్ధం తరువాత రెండు దేశాల మధ్య తెగిపోయిన సంబంధాలు 1993లో కుదిరిన చారిత్రాత్మక శాంతి పరిరక్షక ఒప్పందంతో మళ్లీ గాడిన పడ్డాయి. సరిహద్దు సమస్యలను చరిత్రకు వొదిలిపెట్టి వాణిజ్యాన్ని పునరుద్ధరించుకోవాలని నిర్దేశించిన ఆ ఒప్పందం తరువాత రెండు దేశాల మధ్య వాణిజ్యాభివృద్ధికి మార్గం సుగమమైంది. 2013 సరిహద్దు రక్షణ సహకార ఒప్పందం ద్వారా సరిహద్దులో వచ్చే సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్దిష్టమైన యంత్రాంగాన్ని, విధివిధానాలను రూపొందించుకోవడం జరిగింది. ఈ ఒప్పందాలు రెండు దేశాలమధ్య దౌత్య, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయి. 2004 నాటికి 1360 కోట్ల డాలర్లుగా ఉన్న భారత్-చైనా వాణిజ్యం ఇటీవల కాలంలో ఉరుకులు పరుగులతో అభివృద్ధి చెంది 2016 నాటికి 7,150 డాలర్లకు చేరింది. ప్రపంచంలో భారత దేశానికి అది పెద్ద వాణిజ్య భాగస్వామి చైనాయే. అయితే రెండు దేశాల వాణిజ్య లోటు భారత్‌కు ప్రతికూలంగా ఉండడం ఒక సమస్యగా ఉంది. దాన్ని పరిష్కరించాల్సి ఉంది. ఏమైనా భారత్, చైనాల మధ్య 3,488కి.మీ పొడవైన సరిహద్దును వాణిజ్య మార్గంగా మార్చుకుంటే రెండు దేశాల ప్రజలూ ప్రయోజనం పొందుతారు.



కానీ ఆసియా ఖండాన్ని ప్రపంచాభివృద్ధికి కేంద్రంగా మారుస్తున్న భారత్-చైనాల మధ్య అగాథాన్ని పెంచాలని అమెరికా చూస్తోంది. చైనాకు వ్యతిరేకంగా పన్నిన యుద్ధ వ్యూహంలోకి భారత్‌ను లాగడానికి అమెరికా వేసిన ఉచ్చులో దురదృష్ట వశాత్తు మన ప్రభుత్వాలు పడుతున్నాయి. అమెరికాకు జూనియర్ భాగస్వామిగా భారత్‌ను చేర్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. ఇప్పటికే ఆ దేశంతో రక్షణ రంగంలో లాజిస్టిక్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అమెరికాయుద్ధ విమానాలకు, యుద్ధ నౌకలకు భారత వైమానిక, నావికా స్థావరాల్లో ఇంధనాన్ని నింపుకోవడానికి, మరమ్మతులు చేయడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తోంది. మోడీ ప్రభుత్వం అమెరికా యుద్ధ వ్యూహం నుండి బయట పడి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అవలంబిస్తే చైనాతో సహా ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపడతాయి.

డోక్లాం వివాదం నిజానికి పరిష్కరించలేనంత జటిలమైన సమస్యేమీ కాదు. గతంలో ఇంతకన్నా పెద్ద సమస్యలను ఈ రెండు దేశాలు దౌత్యపరమైన చర్యల ద్వారా సులువుగా పరిష్కరించుకున్నాయి. డోక్లామ్ వివాదాన్ని కూడా అదే స్ఫూర్తితో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వామపక్షాలు, విదేశాంగ నిపుణులు సూచించారు. మోడీ ప్రభుత్వం ఆలస్యంగా అయినా ఈ చర్చల ప్రాధాన్యతను గుర్తించినందుకు సంతోషం. డోక్లామ్ సెక్టార్ నుంచి దళాలు వెనక్కి తీసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించిన తరువాత కూడా ఈ ఒప్పందానికి గండి కొట్టేందుకు, రెండు దేశాల మధ్య అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. బ్రిక్స్ సదస్సులో మోడీ, జిన్‌పింగ్ భేటీ తరువాత ఉన్నత స్థాయి దౌత్య అధికారుల మధ్య చర్చల ప్రక్రియ ఊపందుకుంటుందని ఆశిద్దాం. వాణిజ్య సంబంధాలు అభివృద్ధి చేసుకుంటూనే రెండు దేశాలూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సరిహద్దు సమస్యను పరిష్కరించుకోడానికి కూడా చొరవ చూపాలి.

ప్రజావాణి

కూలీల బతుకులు మారేనా?

యాదాద్రి భువనగిరిజిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో జరుగుతున్న ఆదివారం సంతకు ఒక ప్రత్యేకత ఉంది. చౌటుప్పల్ చుట్టుప్రక్కల దాదాపు 60 గ్రామాల ప్రజలు ఆదివారం జరిగే సంతకు వస్తారు. ఈ సంతలో ఎక్కువగా గుంపులు గుంపులుగా ఎగబడి కొనుగోలు చేసేవి ఏమిటంటే... ధనవంతులు తొడిగేసిన పాతబట్టలు. ఈ ప్రాంతంలో 100కి పైగా కంపెనీలున్నాయి. పాత బట్టలు ఎక్కువగా కొనుగోలు చేసేవారు ఈ కంపెనీల్లో పనిచేసే కూలీలు. చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, కోల్‌కతా, మహారాష్ట్ర, బీహార్ ప్రాంతాల నుండి వచ్చిన వలస బిడ్డలు. కంపెనీలలో వేతనాలు సరిపడక, దుస్తులు కూడా కొత్తవి కొనుక్కోలేని దుస్థితి. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారి కూలీల బతుకులకు భరోసా ఏది? వారిని పట్టించుకునే వారే కరువు. వారు పొద్దంతా పనిచేస్తే పొట్టకు, గుడ్డకు కూడా సరిపడని బత్తెం. మళ్ళీ నెల వచ్చేసరికి ఎంతో కొంత కుటుంబానికి చేరవేయాలి. అభివృద్ధిలో భారత్ ముందుకు పోతుందన్న మోడీ సర్కార్‌కు వీరి బాధలు పట్టవా? ఇదేనా అభివృద్ధి? ఒకరు తొడిగేసిన బట్టలను మరొకరు ఎగబడి కొనుగోలు చేస్తే అభివృద్ధా? ఈ సందర్భంలో పాత బట్టలమ్మే చిరువ్యాపారుల సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతున్నది. ఈ చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముద్ర' పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తే వారికి కొత్త బట్టల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు సహకరించాలి. అదే విధంగా కంపెనీల్లో పనిచేస్తున్నటు వంటి యువతీ, యువకుల స్థితిగతులను తెలుసుకొని, కంపెనీల యాజమాన్యాల చేత కనీస వసతులు కల్పించేలా అధికారులు సహకరించాలి.

గుండమల్ల సతీష్‌కుమార్,
సంస్థాన్‌నారాయణపురం.

పందుల బెడద

గ్రామాలలో పందుల బెడద చాలా పెరిగింది. పందుల కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. అంతేకాక ఈ పందులు ఎక్కువగా తిరుగుతూ వాహనదారులకు అడ్డపడుతూ ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. ప్రతీరోజూ ఈ పందుల కారణంగా ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. పందులు డ్రైనేజీలో పొర్లాడి పరిసరాలు అపరిశుభ్రం చేస్తూ, ప్రజలు అనారోగ్యానికి గురి అయ్యేలా కారణమవుతున్నాయి. రోజు రోజుకు పందుల సంఖ్య పెరిగిపోతున్నది. వీటి బెడదతో ప్రజలు ఎక్కువగా యిబ్బందులకు గురవుతున్నారు. పందుల బెడద నుంచి ప్రజలను కాపాడటానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

షేక్ అస్లాంషరీఫ్, శాంతినగర్.

అక్షరాయుధం ఎంతటి వారినైనా శిక్షిస్తుంది!



డాక్టర్ దేవరాజు మహారాజు

హర్యానా రాష్ట్రంలోని సిర్సా పట్టణం, డేరా సచ్చా సౌదా నుండి పలుమార్లు అత్యాచారానికి గురవుతూ అక్కడ చిత్రహింస అనుభవించిన యువతి ఆనాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్‌కి రాసిన లేఖ ఈ విధంగా ఉంది. బాబా రామ్ రహీమ్ గుర్మీత్‌సింగ్ తనపై అత్యాచారం చేస్తున్న విషయం, కొన్ని వందల కుటుంబాలను భయభ్రాంతులను చేస్తున్న వైనం అన్నీ ఈ ఉత్తరంలో వివరంగా ఉన్నాయి. దీన్ని సుమోటోగా స్వీకరించిన కోర్టు అతన్ని దోషిగా ప్రకటించింది. ఆ యువతి లేఖను 'దేశ్ సేవక్' అనే పత్రిక 25 సెప్టెంబర్ 2002న ప్రచురించింది. దేశంలో బాబాలు రాజ్యాంగేతర శక్తులుగా ఎలా ఎదుగుతున్నారో ఈ ఉత్తరం తెలియజేస్తుంది. కేవలం ఇది బాబారామ్ రహీమ్ గుర్మీత్ సింగ్ బండారం బయటపెట్టడమే కాదు, దేశంలోని అందరి బాబాల జీవనశైలి, ఉద్దేశాలు ఎలా ఉంటున్నాయో చెపుతుంది. ఈ విషయంలో దీన్నొక 'నమూనా'గా తీసుకోవచ్చు. ఇది ఒక నిస్సహాయ యువతి

> **ఒక ఉత్తరంలోని అక్షరాలు నిశ్శబ్దంగా దేశంలో ఎంత సంచలనం సృష్టించాయో గ్రహించుకోవాల్సి ఉంది. ఇలాంటి బాబాల ఆదాయం మీద ప్రభుత్వాల నిఘా ఉండదు. ప్రభుత్వాధినేతలే ఇలాంటి వారికి మోకరిల్లుతుంటే ఇక అడిగే వారెవరు? అందుకే సామాన్యజనం చైతన్యవంతులై, కంచెల్ని చేను మేయకుండా అరికడుతూ ఉండాలి!**

నిశ్శబ్దంగా ప్రయోగించిన అక్షరాయుధం! తెలుగు పాఠకుల కోసం తెలుగులో...

"శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ జీ,
ప్రధాన మంత్రి, న్యూఢిల్లీ.

నేను పంజాబ్ రాష్ట్రానికి చెందిన అమ్మాయిని. హర్యానాలోని సిర్సాలో 'డేరా సచ్చా సౌదా'లో 'సాధ్వి'గా సేవలందిస్తున్నాను. నేనిక్కడ గత ఐదేండ్లుగా ఉంటున్నాను. ఇంకా ఇక్కడ నాలాగే వందలమంది అమ్మాయిలున్నారు. రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేస్తున్నారు. అయితే మేమిక్కడ శారీరకంగా దోచుకోబడుతున్నాం. అత్యాచారాలకు గురవుతున్నాం. ఈ డేరా (ఆశ్రమం)కు ముఖ్యుడయిన బాబా రామ్ రహీమ్ గుర్మీత్ సింగ్ ఈ డేరాలోనే స్వయంగా అమ్మాయిలను నిర్దాక్షిణ్యంగా 'రేప్' చేస్తున్నాడు. నేను చదువుకున్నదానిని. పట్టభద్రురాలిని. కానీ, నా కుటుంబం ఈ గుర్మీత్‌సింగ్‌ను గుడ్డిగా విశ్వసిస్తోంది. ఆయన మాయమాటలకు మోసపోయి, నన్ను బలవంతంగా తెచ్చి ఇక్కడ డేరాలో వేశారు. రెండేండ్లు చాకిరి చేయించుకున్న తర్వాత నన్ను 'సాధ్వి'గా ప్రకటించారు. బాబా గుర్మీత్‌సింగ్‌కు ఆంతరంగికులైనవారు, అతి సన్నిహితులైనవారు మరికొంత మంది శిష్యురాళ్ళు ఉంటారు. అందులో ఒకావిడ ఒక రోజు రాత్రి పదిగంటల వేళ నా దగ్గరికి వచ్చింది. ఉన్నఫళంగా బాబా పిలుస్తున్నారని చెప్పింది. అనుభవం, లోకజ్ఞానం లేని నేను సంతోషపడ్డాను. అంతవరకు నేరుగా ఆయన సమీపానికి కూడా వెళ్ళని నేను, ఆ అవకాశం వచ్చినందుకు ఆనందపడ్డాను. అంతటి మహనీయునికి నా సేవలు కావల్సివచ్చాయి కదా అని మురిసిపోయాను. ఒక్కొక్క మెట్టూ ఎక్కి పై అంతస్థులో ఉన్న ఆయన గదికి మొదటిసారి వెళ్లాను. లోపల అడుగుపెట్టే సరికి బాబా చేతిలో టీవీ రిమోట్ కనిపించింది. ఆయన 'బ్లూ ఫిల్మ్' చూస్తున్నారు. ఆయన పక్కన బెడ్ మీద రివాల్వర్ కనిపించింది. ఆ వాతావరణం చూసేసరికి నాకు వణుకు ప్రారంభమైంది. బాబా గుర్మీత్‌సింగ్ ఇలాంటి వారని నాకెప్పుడూ ఊహకైనా అందలేదు.

బాబాగారు టీవీ కట్టేసి, నన్ను తన పక్కన కూర్చోబెట్టుకున్నారు. మంచినీళ్ళందించారు. 'నిన్నెందుకు పిలిపించానో తెలుసా?' అని అడిగారు. 'నాకు అత్యంత ప్రీతిపాత్రురాలివి గనకే పిలిచాను' అని సమాధానం కూడా ఆయనే చెప్పారు. గట్టిగా కౌగిలించుకున్నారు. తన హృదయపు లోతుల్లోంచి నన్ను ప్రేమిస్తున్నట్టు చెప్పారు. ఇదంతా నాకు తొలి అనుభవం. నాతో ప్రేమ ఆట ఆడాలని ఉందని కూడా బాబా చెప్పారు. నేను అయోమయంలో పడ్డాను. అటూ ఇటూ గింజుకున్నాను. 'అదేమిటీ? నాకు నువ్వు శిష్యురాలివయినప్పుడే నీ తన, మాన, ప్రాణాలన్నీ భక్తితో అర్పించావు కదా? నేను స్వీకరించాను కదా? ఇంకా అభ్యంతరం దేనికీ? ఇంకా అనుమానమే వద్దు. నేనే దేవుణ్ణి!'

'హు దేవుడయితే ఇట్లా చేస్తాడా?' అని నసిగాను. దానికి ఆయన ఇలా సమాధానం చెప్పారు.."శ్రీకృష్ణుడు దేవుడే కదా? మరి ఆయనకు వేల మంది గోపికలున్నారు కదా? ఆయన వారితో రాసలీల లాడారు కదా? మరి ప్రజలంతా ఆయనను దేవుడిగా పూజిస్తున్నారు కదా? ఇందులో తప్పేంఉందీ? నేనూ అంతే!" ఆయన వాదనని నేను ఒప్పుకోలేదు. తన అడ్డంగా కదిలించాను. దాంతో ఆయన మరో హెచ్చరిక చేశారు. "నిన్ను ఈ క్షణమే ఈ రివాల్వర్‌తో కాల్చేసి, ఇక్కడే పాతిపెట్టించగలను. అడిగేవారుండరు. నీకు తెలుసుకదా నీ కుటుంబమంతా నాకు దాసోహమంది. నా మీద వారికి అమితమైన విశ్వాసం, అచంచలమైన భక్తి. నాకు వ్యతిరేకంగా వారేమీ చేయలేరు. చేసినా, బతకలేరు. నువ్వు చూశావు కదా... హర్యానా, పంజాబ్ ముఖ్యమంత్రులే నా ఆశీస్సుల కోసం వస్తారు. రాజకీయ నాయకులు నాతో సహాయం పొందుతూ ఉంటారు. కాబట్టి, నాకు వ్యతిరేకంగా వారేమీ చేయలేరు. నీ కుటుంబంలో ఎంతమంది ప్రభుత్వోద్యోగులుంటే అంతమందిని 'డిస్మిస్' చేయించగలను. నా 'సేవాదార్ల' (అంగబలం)ను పంపానంటే నీ కుటుంబంలోని ఒక్కరు కూడా ప్రాణాలతో మిగలరు. ఎక్కడా ఎవరికీ అనుమానం రాదు. హత్యలకు ఏమాత్రం సాక్ష్యం దొరకదు. నువ్వు వినే ఉంటావు కదా! ఈ డేరాలో మేనేజర్‌గా పనిచేసే ఫకీర్‌చంద్‌ను గుండాలు హత్యచేశారని. అది ఎవరు ఎట్లా చేశారో ఇంతవరకూ తెలలేదు. పిచ్చిపిల్లా! నీకు తెలుసా? నా డేరా (ఆశ్రమానికి)కు రోజూ వచ్చే ఆదాయం ఒక కోటి రూపాయలు!! దాంతో రాజకీయ నాయకుల్ని, పోలీసుల్ని, జడ్జిలని మొత్తానికి మొత్తంగా వ్యవస్థనే కొనేస్తాను..." అవన్నీ వింటుంటే నా మెదడు మొద్దుబారింది. స్థాణువునై పోయాను. నాకు నోటమాట రాలేదు.

డేరా సచ్చా సౌదా చీఫ్ రామ్ రహీమ్ బాబా గుర్మీత్ సింగ్ నాపై అత్యాచారం చేశాడు. గత మూడేండ్లుగా చేస్తూనే ఉన్నాడు. 25 రోజులకొకసారి నా వంతు వస్తుంది. ఎందుకు నా జీవితం ఇలా నిస్సహాయంగా అయిపోయింది? నా ప్రమేయం లేకుండానే ఎందుకిలా దిగజారింది? ఎవరికీ ఏమీ చెప్పుకోలేని పరిస్థితి. నా కంటే ముందు, నా తర్వాత కూడా బాబా గుర్మీత్ అమ్మాయిలను రేప్ చేస్తూనే ఉన్నాడు. అడ్డుకునే వారే లేరు. నా కంటే ముందు రేప్ చేయబడ్డవాళ్ళు ఇప్పుడు 35-40 యేండ్ల వయసుకు వచ్చారు. పెళ్ళీడు దాటిపోయింది. జీవితంలో దారులన్నీ మూసుకుపోయాయి. గత్యంతరం లేక నాలాగే ఈ డేరాలోనే గడుపుతున్నారు. మరో మార్గం లేదు. స్వతంత్రంగా బతికే ఆత్మశక్తిలేదు. భక్తి, భయం ఏదైనా కావొచ్చు, వారి వారి కుటుంబాలు వీరిని ఇంటికి రానివ్వరు. చాలా మంది యువతులు, మహిళలు నాలాగే చదువుకున్న వారు బీఏ, యం.ఏ, బీ.ఎడ్ వంటి డిగ్రీలున్నవాళ్ళు. కానీ ఏం లాభం? ఈ డేరా అనే నరకంలో జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. కారణం బాబాపై గుడ్డి నమ్మకంతో వారి కుటుంబాల వారు వీరిని 'సాధ్వు'లుగా చేసి వెళ్ళారు. మేం తెల్లబట్టలు, తలమీద స్కార్ఫ్ ధరిస్తాం. బాబాగారి ఆదేశాల ప్రకారం మే మగవారివైపు



చూడగూడదు. తప్పని సరైతే మాత్రం తలవంచుకుని పదిఫీట్ల దూరంలో ఉండి మాత్రమే మాట్లాడాలి. వచ్చే జనానికి మేం ధవళ వస్త్రాలతో దేవతా మూర్తుల్లాగా పవిత్రంగా కనబడాలి. కానీ అందరికి అందరం అత్యాచారం చేయబడ్డ బాధితులం. మా దుఃఖాన్ని వేదనని, బాధని తెల్లగుడ్డలు కప్పేస్తుంటాయి!

ఒకసారి నా కుటుంబ సభ్యులు వచ్చినప్పుడు ఇక్కడ డేరా సచ్చా సౌదాలో అసహ్యకరమైన పనులు జరుగుతున్నాయని చెప్పడానికి ప్రయత్నించాను. కాని వారు వినిపించుకునే పరిస్థితిలో లేరు. ఇంతకంటే నిర్మలమైన, పావనమైన మంచి ప్రదేశం ప్రపంచంలోనే ఎక్కడా లేదన్నట్టు మాట్లాడారు. పైగా ఆ బాబాని ధ్యానిస్తూ గడపమని ఉచిత సలహా ఇచ్చారు. ఇక్కడ నేనూ, నాలాంటి వారు ఎంత నిస్సహాయస్థితిలో ఉన్నామో మాటల్లో చెప్పలేను. అనుక్షణం బాబా ఆజ్ఞలు పాటిస్తూ ఉండాలి. సాధ్వీలుగా ఉన్న మహిళలైనా సరే, ఒకరితో ఒకరు మాట్లాడుకోగూడదు. అంతే కాదు, ఫోన్‌లో కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడుకోగూడదు. డేరాలో జరుగుతున్న విషయాల గూర్చి ఎవరైనా నోరు జారితే, బాబా ఆదేశాల మేరకు శిక్షలు పడతాయి. ఒకసారి బటిండాకు చెందిన యువతి విషయాలు బయటికి చెప్పితే, మిగతా సాధ్వీలతో, వాలంటీర్లతో చితకబాదించారు. ఆ అమ్మాయి వెన్నుపూస విరిగి జీవితాంతం మంచంపై గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ అమ్మాయి తండ్రి డేరాలో పనిమానుకుని సొంతూరికి వెళ్లిపోయాడు. ఎప్పుడు మృత్యువును ఎదుర్కోవాల్సి వస్తుందోనని భయం భయంగా బతుకుతున్నాడు. ఎక్కడా నోరు విప్పడు. అలాగే సంగూర్‌కు చెందిన అమ్మాయి పారిపోయి ఇక్కడి విషయాలు ఊళ్ళో అందరికీ చెప్పింది. అంతే గుర్మీత్ బాబా సాయుధ దళం వచ్చి గ్రామస్థుల్ని భయభ్రాంతుల్ని చేశారు. వారిముందే ఆ అమ్మాయి ఎముకలు నుగ్గి నుగ్గి చేశారు. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కథ! మన్సా, ఫిరోజ్‌పూర్, పాటియాలా, లుథియానా జిల్లాల నుండి ఎంతో మంది యువతులున్నారు. కాని డేరా అక్రమాల గురించి ఎవరూ నోరువిప్పలేని స్థితిలో ఉన్నారు. అలాగే సిర్సా, హిస్సార్, ఫతేహబాద్, హనుమాన్‌ఘర్, మీరట్‌ల మహిళలు డేరా గూర్చి నేను వెలిబుచ్చుతున్న అభిప్రాయాల వంటివే వెలిబుచ్చగలరు. కాని వారి నోళ్ళనీ మూతవేయబడ్డాయి.


నేను నా పేరు చెప్పలేను. చెపితే నేనూ, నా కుటుంబం అంతా హత్యచేయబడతాం. అందుకే చెప్పలేకపోతున్నాను. అయితే బయట ఉన్న జనబాహుళ్యానికి విషయాలు తెలియాలని ఈ ఉత్తరం రాస్తున్నాను. నా బాధలింక భరించలేక, నా భావోద్వేగాల్ని అదుపులో పెట్టుకోలేక, బయట పెడుతున్నాను. ప్రెస్ వాళ్ళు గానీ, ప్రభుత్వం గానీ విచారణ చేపడితే సుమారు 50 మంది యువతులు డేరాలో ఆరి అనుభవాలు చెప్పగలరు. చివరలో మరొక ముఖ్యమైన అభ్యర్థన ఏమిటంటే, మాకు వైద్యపరీక్షలు నిర్వహించండి. మాకన్యత్వం కొల్లగొట్టబడిందో లేదో తేలిపోతుంది. నిర్దాక్షిణ్యంగా మాపై అత్యాచారాలు చేసినవాడి పేరు బహిరంగంగా చెపుతున్నాం కదా? ఇంకా ఏం కావాలీ? అతన్ని నేరస్థుడిగా పరిగణించి విచారణ ఎందుకు చేపట్టరూ? చర్యల్ని చేపట్టి మమ్మల్ని ఎందుకు విముక్తిల్ని చేయరూ? దయతో పరిశీలించండి!

- ఒక నిస్సహాయురాలు."

ఇలాంటి బాబాల్ని దేశ నాయకులు ఎందుకు ప్రశంసిస్తుంటారో, వారి రాజకీయ ఉద్దేశాలేమిటో మనం.. అంటే సామాన్య జనం విశ్లేషించుకోవాల్సి ఉంది. ఒక ఉత్తరంలోని అక్షరాలు నిశ్శబ్దంగా దేశంలో ఎంత సంచలనం సృష్టించాయో గ్రహించుకోవాల్సి ఉంది. ఇలాంటి బాబాల ఆదాయం మీద ప్రభుత్వాల నిఘా ఉండదు. ప్రభుత్వాధినేతలే ఇలాంటి వారికి మోకరిల్లుతుంటే ఇక అడిగే వారెవరూ? అందుకే సామాన్యజనం చైతన్యవంతులై, కంచెల్ని చేను మేయకుండా అరికడుతూ ఉండాలి! విచిత్రమేమంటే మనదేశంలో అత్యాచారం చేసినవాడు దొరకకపోతే జనం కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వెలిబుచ్చుతారు. అత్యాచారం చేసినవాడు దొరికి, కోర్టు అతన్ని దోషి అని ప్రకటిస్తే మూఢజనం నగరాల్ని కాల్చేస్తారు. ఏమైనా సీబీఐ కోర్టు బాబాకు 20 ఏండ్లు జైలు శిక్ష విధించడం వల్ల నిస్సహాయ యువతి తన అక్షరాయుధంతో విజయం సాధించినట్టయ్యింది!

రచయిత: సుప్రసిద్ధ సాహితీవేత్త,
సైన్స్ ప్రొఫెసర్, సెల్: 9908633949

నైతిక విలువల్ని పెంచడం అవసరం




డాక్టర్‌చుక్కా రామయ్య

రామయ్యమాట

వ్యక్తిగత గోప్యతపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. ఈ తీర్పు మనిషి గౌరవప్రదమైన జీవనానికి గట్టి భరోసా. డిజిటల్ శకం మొదలై.. సమాచారమే ఒక ఆయుధంగా మారిన క్రమంలో ఏ ఒక్కరి వ్యక్తిగత వివరాలూ గోప్యంగా ఉంచుకోలేని పరిస్థితుల్లో ఈ తీర్పు రావడం కచ్చితంగా ప్రజల సమాచార భద్రతను పదిలపరిచేదే. ఇవ్వాళ సిమ్ కార్డు నుంచి ఆధార్ కార్డు దాకా దేనికి దరఖాస్తు చేసుకోవాలన్నా మనిషి వ్యక్తిగత వివరాలన్నీ వెల్లడించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అదే సమయంలో మనం వెల్లడించిన వ్యక్తిగత సమాచార భద్రతకు ఎలాంటి భరోసా లేకుండా పోతోంది. తద్వారా ఆ సమాచారం దుర్వినియోగం కావడం, దురుద్దేశాలకు వాడుకోవడం జరుగుతుంటే ఈ ప్రమాదాన్ని నిలువరించే యంత్రాంగం ఏదీ లేకపోవడంతో ప్రజలకు సామాజిక భద్రతే కరవయ్యే ముప్పు ఏర్పడింది. దినదినం విస్తరిస్తోన్న టెక్నాలజీ పరిణామాలతో మనిషి ప్రైవసీగా ఉండటం కూడా చాలా కష్టమవుతోంది. అనేక సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వ్యక్తిగత గోప్యత కూడా మనిషి ప్రాథమిక హక్కే అని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు హర్షనీయం.

రోజుకో పేరుతో మారిపోతున్న టెక్నాలజీతో మనిషి వ్యక్తిగత జీవితంలోకి ప్రభుత్వం చొరబడే ప్రమాదం ఏర్పడింది. గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం తీసుకొచ్చిన డీమానిటైజేషన్ వల్ల అనేకమంది డిజిటల్ పేమెంట్స్ చేయడంతో ఏ హోటళ్లలో ఎవరెవరు ఏం తింటున్నారో, ఎలాంటి పుస్తకాలు చదువుతున్నారో అనే సమాచారం సైతం తెలుసుకోవడం ప్రభుత్వానికి కష్టమేం కాదు. నేటి మన ప్రభుత్వాలు ఇంకా పరాయి ప్రభుత్వాల ఆదర్శాలనే కొనసాగిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం అవసరంలేదు. ఎందుకంటే దీనికి అనేక ప్రభుత్వ వైఫల్యాలు ఉన్నాయి. వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. ప్రజల జీవన విధానానికి రాజకీయ నాయకుల జీవన విధానం పూర్తిగా విభిన్నంగా ఉండటం కూడా మరో ప్రధానమైన కారణం. ఇది వరకు రాజకీయ నాయకులంతా ప్రజల్లోనే ఉండేవారు. కానీ ఈనాడు ఆ పరిస్థితులు పూర్తిగామారిపోయాయి. రాజకీయ నాయకుల్లో కూడా వ్యక్తిగత జీవితం.. ప్రజా జీవితం వేరువేరు అనే భావన కనబడుతోంది. ఇది చాలా ప్రమాదకరమైనది. ప్రజల వ్యక్తిగత సమాచారం అందుబాటులో ఉంచుకుంటున్న ఏ సంస్థలైనా, పభ్రుత్వాలైనా దాన్నిదుర్వినియోగం చేస్తాయనే అపోహలు కలగక మానవు. ఎందుకంటే ఏ నియోజకవర్గం, ప్రాంతంలో ఏ కులం, ఏ మతం ప్రజలు ఎక్కువ మంది ఉంటారు? వాళ్లకు అందుతోన్న సంక్షేమ పథకాలు ఏమిటి? వాళ్ల ఫోన్ నంబర్లు ఏమిటి? ఇలా తమవద్ద ఉన్న సకల సమాచారంతో ప్రజల్ని నియంత్రించే అవకాశమూ లేకపోలేదు. అందువల్ల సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ప్రభుత్వాలపై కొత్త బాధ్యత పడింది.



ప్రజల వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచేందుకు ప్రభుత్వాలకు అతీతంగా ఉండే స్వయం ప్రతిపత్తి కల్గిన ఓ ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. 2009లో ఏర్పాటైన భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఆధార్)ద్వారా ఈ జూన్ మాసం నాటికి మొత్తం 115 కోట్లమందికి ఈ కార్డులను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో మొత్తం దేశ ప్రజల నుంచి సేకరించిన ఈ సమాచారానికి భద్రత కల్పిస్తూ.. వ్యక్తిగత గోప్యతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉంది. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. బ్యాంకుఖాతాలతో కొంత సమాచారం బయటకు వస్తోంది. అయితే, ఇప్పటికే ఇచ్చిన సమాచారాన్ని దుర్వనియోగానికి పాల్పడిన సంస్థలేవైనా వాటిపై కఠిన చర్యలు తప్పవంటూ కేంద్రం హెచ్చరించాలి. ఈనాడు పర్సనల్ లా కూడా పెను ప్రమాదంలో పడింది. ప్రభుత్వాలకు అదొక సవాల్‌గా మారింది. పర్సనల్ లాను ధిక్కరిస్తే సమాజమే కూలిపోయే ప్రమాదం ఉంది. వ్యక్తిగత గోప్యత కాపాడటంలో ప్రజల అప్రమత్తతతో పాటు నైతికత కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల చిన్నపటినుంచే పిల్లల్లో నైతిక విలువలను నేర్పించాలి. లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా కఠినంగాఉండాలి. అనేక సామాజిక ఉద్యమాలు రావాల్సిన అవసరం ఉంది. గతంలో అక్షరాస్యత ఉద్యమాన్ని చేపట్టినట్టే జేవీవీ లాంటి ప్రగతిశీల, సామాజిక చైతన్య సంస్థలు, కార్యకర్తలు పిల్లల్లో నైతికతను ప్రచారం చేసేందుకు పెద్ద ఎత్తున ముందుకు రావాలి. పిల్లల్లో నైతికతను పెంపొందించేందుకు కుటుంబం, పాఠశాల తదితర ప్రాంతాలన్నింటా విస్తృతంగా అవగాహన తీసుకొస్తేనే అదొక సంస్కృతిగా మారుతుంది. అదే అనేక సామాజిక రుగ్మతలకు గొప్ప ఔషధం.

-ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

వేదుల రామకృష్ణ

మౌనమేల నితీశా!

నితీశ్ కుమార్ బీజేపీతో జతకట్టి అధికారంలో కూర్చున్నాక ఒకవారం తిరగకుండానే సంఘ్ పరివార్ బీహార్‌లో ఇక వారిదే తడాఖా అని తెలిసొచ్చేలా చేశారు. గత ఆగస్ట్ 3న పాట్నా నుండి 90 కి.మీ. దూరంలో ఉన్న భోజ్‌పుర్ జిల్లా శాహ్‌పుర్‌లో 84వ నెం. జాతీయ రహదారిలో పెట్రోల్ బంకులో నిలబడి ఉన్న ఒక లారీని అటకాయించి బజరంగీలు ముగ్గురు వ్యక్తులను చితకబాదారు. ఆ లారీలో గోమాంసం ఎక్కడికో రవాణా అవుతోందని వారి సందేహం. చావు దెబ్బలు తిన్నది మైనారిటీ మతస్తులు. బజరంగీల ఈ చొరవ చూసి విశ్వ హిందు పరిషత్తు(వీహెచ్‌పీ) వారు తాము మాత్రం ఎందుకుతగ్గాలి అని అనుకున్నారు. అందుకు ఎలాంటి భావనో అలాంటి పనే అనే చందంగా గోమాంసం భుజించేవారికి తగిన బుద్ధి చెప్పటానికి రంగంలోకి దిగారు. ఇక్కడ కూడా ఆ సందేహం ఆధారంగానే వారి ఘనకార్యం. ఆ రాష్ట్ర పశ్చిమ్ చంపారణ్ జిల్లాలో ఇంటింటా చొరబడి గోమాంసం తిన్న నేరానికి ఆరు కుటుంబాల వారిని నిర్దాక్షిణ్యంగా చితకబాదారు. ఈ సంఘటన ఈ నెల 17వ తేదీన జరిగింది. నితీశ్, బీజేపీ చెట్ట పట్టాల్ తరవాత నెలలోపే బీహార్‌లో ఇది రెండో సంఘటన. వీహెచ్‌పీకి చెందిన గోరక్షక సైన్యానికి చెందిన సాయుధ గూండాలు ఒకటి తరవాత ఒకటి మైనారిటీల ఇండ్లల్లో చొరబడి తాండవం చేశారు. ఇప్పటివరకు గోరక్షకులమని చెప్పుకుంటున్న వారిని ఎవరినీ పోలీసు అదుపులోకి తీసుకోలేదు. ఇంకా చెప్పాలంటే బాధిత మైనారిటీ ప్రజలనే ఠాణాలకు తీసుకెళ్లారు. పైగా, బాధితులకు భద్రత కల్పించటానికే వారిని ఠాణాలకు రప్పించటం జరిగింది అని పోలీసు వాదన. కానీ పోలీసుల ఈ వాదన ఎవరూ నమ్మలేకపోతున్నారు. సంఘటనలను కళ్ళారా చూసినవారు వీహెచ్‌పీకి చెందిన వంద కంటే ఎక్కువమంది గుంపుగా లాఠీలు, హాకీ స్టిక్కులు వగైరా చేతబూని 'భారత్ మాతాకి జై' అంటూ నినాదం చేస్తూ ఆరుగురిని పట్టుకుని తీసుకువచ్చి చితకబాదారు. వారిలో చాలామందిని వేరేగా నిర్బంధించి ఉంచారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దాద్రీలో సెప్టెంబరు 2015లో ఒక మైనారిటీకి చెందిన వ్యక్తిని కొట్టి చంపినలాంటి సంఘటన పునరావృతం చేయటం వారి ఉద్దేశం. 2015 సెప్టెంబరు దాద్రీ సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా నితీశ్ కుమారే ఉన్నారు. అప్పుడు ఆయన బీజేపీకి ఘోర వ్యతిరేకి. ఇప్పుడు అతను బీజేపీకి అతి దగ్గరి నేస్తం. దాద్రీ సంఘటన సమయంలో అతను దాన్ని తీవ్ర పదజాలంతో ఖండించి ప్రధాని మోడీ మౌనాన్ని పరిహసిస్తూ వ్యంగ్య బాణాలు సంధించారు. కానీ నేడు స్వంత రాష్ట్రంలోనే స్వఘోషిత గోరక్షకుల తాండవ లీలలు నరేంద్ర మోడీని అనుసరించి మౌనముద్రతో తిలకిస్తున్నారు. ఒక నెల లోపే రెండు గోరక్షకుల తాండవ సంఘటనలు జరగటంతో నితీశ్ ప్రతిపక్షం చాలా ఉద్వేగంగా ఉంది. బీహార్ కూడా ఉత్తర్ ప్రదేశ్ బాట పట్టిందా అని వారి ప్రశ్న? నేడు స్వఘోషిత గోరక్షకుల సైన్యం ఎలాగైతే ఉత్తరప్రదేశ్‌లో దాడులు కొనసాగిస్తున్నదో బీహార్‌లో గోరక్షకుల ముఠాలు తాండవం, కార్యకలాపాలు నడిపిస్తున్నాయి. గోరక్షకుల తాండవంపై చాలా కాలం మౌనం పాటించిన తరవాత మోడీ గత నెల గుజరాత్‌లో సబర్మతీ ఆశ్రమంలో దాన్ని విమర్శించి దేశ పరువు మంటకలుస్తున్నదని చెప్పారు. గాంధీ భారతాన్ని చంపవద్దని సందేశమిచ్చారు. కానీ అతని ఆ విమర్శ సంఘ్ ఆనుగత్యం ఉన్న గోరక్షకులు చెవిన పెట్టారా? గోరక్షకుల హింసను నివారించే పని రాష్ట్రాలపై నెట్టేసి మోడీ చేతులు దులిపేసుకున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం చేసేదేమీ లేదన్నట్టు ఫోజు పెట్టారు. కానీ ఇప్పుడు కనబడుతున్న దేమిటి? గోరక్షకుల హింస, దాడుల సంఘటనలు అన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి. వాటిని మాత్రం ప్రధాని ఎక్కడా ప్రస్తావించటం లేదు. ఆ రోజు గోరక్షకులను ఉద్దేశించి సందేశం ఇచ్చిన కొద్ది గంటలకే బీజేపీ పాలిత ఝార్ఖండ్ సంఘ్ పరివార్ అండదండలున్న ముఠా మైనారిటీలను పట్టుకు చితకబాదారు. దీన్నిబట్టి ఒక ప్రశ్న ముందుకు వస్తోంది. తమను గోరక్షకులుగా చెప్పుకునే ఈ ముఠాలు ప్రధాని మాటను కూడా పెడచెవిన పెట్టాయి. బజరంగీలు, వీహెచ్‌పీ ముఠాలు ఒక నెలలోపే బీహార్‌లో రెండుసార్లు మైనారిటీలపై దాడులు చేసి వారిదే ఆ రాష్ట్రంలో ఇప్పుడు తిరుగులేని అధికారమని చాటుకున్నారు. సంఘ్ పరివారం మాటే బీహార్‌లో ఇక వేదమని చాటుకున్నారు. గోరక్షకుల ఈ రకమైన రెండు సంఘటనల తర్వాత కూడా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బహిరంగంగా స్పందించలేదు. ఆయన కూడా మోడీలా మౌనమే ఎంచుకున్నట్టు కనబడుతోంది. కానీ ఎన్నాళ్ళు ఇలా మౌనంగా ఉండగలరు నితీశ్? ఇప్పుడు అందరి మదిలో ప్రశ్న అదే.



కొడితే చదువొస్తుందా?

చుక్కకూర...



చుక్కకూరలో విటమిన్ 'ఎ', 'కె', 'ఇ' లు పుష్కలంగా ఉంటాయి. ఇవి వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతాయి. అలాగే శ్వాస సంబంధిత సమస్యలను, యూరినరీ, పేగు సంబంధిత సమస్యలను నివారించడంలో అద్భుతంగా సహాయపడుతాయి. రోజు ఒక కప్పు చుక్కకూర తింటే చాలు క్రమంగా మలబద్ధక సమస్య దూరం అవుతుంది. దీంట్లో డైటరీ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీవక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే మంచి యాంటీ ఆక్సిడెంట్లుగా పని చేస్తాయి. శరీరంలోకి ఫ్రీరాడికల్స్‌తో పోరాడే గుణాలను కలిగి ఉంటాయి. చుక్కకూర ముఖ్యంగా అధిక రక్తపోటును తగ్గించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. దీంట్లో ఫ్లేవనాయిడ్, ఫైటోన్యూట్రియంట్స్ యాంటీ కాన్సర్ గుణాలను కలిగి ఉంటుంది. కాబట్టి దీన్ని రోజు వారీ భోజనంలో జోడించుకుంటే సరిపోతుంది. ❄

కురులకు నిగారింపు...



జుట్టు అందంగా, దృఢంగా కనిపించాలంటే ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఎంత జాగ్రత్త తీసుకున్న ఊడిపోవడం అన్నది తరచూ జరుగుతూనే ఉంటుంది. అలా ఊడిపోకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- ఉసిరికాయ ముక్కలను ఎండబెట్టుకోవాలి. ఎండిన ముక్కలను కొబ్బరి నూనెలో వేసి వేడి చేసి ఒక రాత్రంతా ఉసిరి ముక్కలను నూనెలో ఉంచి, మరుసటి రోజు ఆ నూనెను కురులకు పట్టిస్తే సరిపోతుంది.
  ఇలా చేయడం వల్ల జుట్టు పొడవుగా, దృఢంగా పెరుగుతుంది.
- ఉసిరికాయ ముక్కలను పొడిగా చేసుకొని దాంట్లో నిమ్మరసం కలిపి రోజూ ఉపయోగించే షాంపూలో కలుపుకొని పెట్టి స్నానం చేస్తే జుట్టు ఊడిపోవడం తగ్గుతుంది. ఇలా వారానికి రెండు సార్లు చేసిన మంచి ఫలితం కనిపిస్తుంది.
- కొత్తిమీర రసాన్ని తలకు పట్టించి ఆరిన తర్వాత స్నానం చేస్తే జుట్టు ఊడటం తగ్గుతుంది. దాంతో పాటు కురులు మృదువుగా తయారవుతాయి.
- మెంతి పొడిలో పెరుగు కలుపుకొని పేస్టులా చేసుకొని వెంట్రుకలకు పట్టించి 20 నిమిషాల తర్వాత కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- అలాగే కొబ్బరి నూనెలో రెండు చెంచాల ఆలివ్ నూనెను కలుపుకొని గోరు వెచ్చగా చేసి వెంట్రుకలకు పట్టించి గంట తర్వాత తల స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల జుట్టు దృఢంగా తయారవుతుంది. ❄

30 దాటితే...



వయసు అనేది ఉట్టి సంఖ్య మాత్రమే. శక్తిసామర్థ్యాలు, పనిచేయాలనుకునే తత్వం ఉన్నవారు వయసు పైబడుతున్నా యువతలాగే పనిచేస్తారు. అది వ్యక్తులు, వాళ్ల పని విధానం మీదే ఆధారపడి ఉంటుంది. కానీ ఆరోగ్యం, శారీరక మార్పులు సహజమైనవి. వయసుతోపాటే వచ్చేవి. 30 ఏండ్లు వచ్చాయంటే శరీరంలో మార్పులొస్తాయి. కొన్నేండ్ల కిందట ఉన్నట్టుగా ఉండదు. ఎముకల పటిష్టత కోల్పోవడం 30 తరువాతే ప్రారంభం అవుతుంది. కండరాలు దాని టోన్‌ని కోల్పోతాయి. ఫిట్‌నెస్, బ్యాలెన్స్, శక్తిపైన దాని ప్రభావం ఉంటుంది. ఫిట్‌గా ఉండటానికి వ్యాయామంచేయండి. సమతుల పోషకాహారం తీసుకోవాలి. క్యాల్షియం అధికంగా ఉన్న ఆహారం, తాజా పండ్లు కూరగాయలు తినాలి. ఇన్ని తీసుకున్నా ఆరోగ్యం బాగుందా అని ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. 30 దాటాక చేయించుకోవాల్సిన కొన్ని టెస్టులు.

రక్తపోటు చాలా కీలకం. గుండె, కిడ్నీ, మెదడు సంబంధిత అనేక జబ్బులకు హైబీపీ కారణమవుతుంది. కాబట్టి 30 దాటిందంటే కచ్చితంగా బీపీ పరీక్షలు తరచూ చేయించుకోవాలి.

శరీరంలో కొలెస్ట్రాల్ పెరగడం అనేక ప్రమాదాలకు కారణం. కాబట్టి అది పెరగకుండా చూసుకోవాలి. రక్త పరీక్షలుచేయించుకుని, రక్తంలో ఉన్న కొలెస్ట్రాల్ స్థాయిలను పరీక్షించుకోవాలి. చెడు కొలెస్ట్రాల్ 130 కంటే అధికంగాఉంటే ప్రతి ఏటా పరీక్షలు చేయించుకోవాలి.

థైరాయిడ్ గ్రంథులు పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల అధిక బరువు పెరగడం, రోగ నిరోధకశక్తి తగ్గిపోయి అనేక జబ్బులకు కారణమవుతుంది. కాబట్టి ఐదేండ్లకోసారి థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవాలి. భావోద్వేగాల్లో మార్పులు, అధిక బరువు పెరగడం, అపసవ్య రుతుస్రావం, నిద్రలేమి వంటి లక్షణాలన్నీ థైరాయిడ్ సూచికలు కావచ్చు.

జీవనవిధానంలో వస్తున్న మార్పులతో ఇటీవల కాలంలో బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతున్నది. ప్రారంభదశలో కనుక తెలుసుకోగలిగితే దీన్నించి పూర్తిగా బయటపడొచ్చు. కాబట్టి బ్రెస్ట్‌క్యాన్సర్ పరీక్షలు సైతం చేయించండి.

30 నుంచి 39 ఏండ్ల వరకు ఏడాది రెండుసార్లు కంటి పరీక్షలు చేయించండి. దాదాపు కంటి సంబంధిత జబ్బులు వచ్చేది 30 ఏండ్ల చివర్లలో 40 ఏండ్ల ప్రారంభ దశలో. కళ్లు అలసిపోయినట్టు ఉండటం, దృష్టి మసకబారడం, నొప్పి, కళ్లు ఎర్రబడటం, పొడిబారడం వంటివన్నీ కంటి వ్యాధులకు ముందస్తు సూచనలు. కాబట్టి కంటి పరీక్షలు కచ్చితంగా చేయించుకోండి. ❄

ఆరేండ్ల పాపను కొడుతూ తల్లి చదివించిన వీడియో ఒకటి ఈ మధ్య వైరల్ అయ్యింది. 'ప్యార్ సే బోలో మా' అని పాప ఎంత వేడుకుంటున్నా... తల్లి మాత్రం గద్దించడం అందిరినీ కదిలించింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు చూసినవారందరికీ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ తరువాత బాలీవుడ్ సింగర్.. ఆ పాప తన అక్క కూతురని, వీడియోకు సంబంధించిన వివరణ ఇచ్చాడు. చూసినవాళ్లకు వచ్చిన కోపం, తిరిగి ఆ గాయకుడు సంజాయిషీ ఇవ్వడం అన్నీ పక్కకు పెడితే... ఆ వీడియో ఒక చర్చను లేవనెత్తింది. పిల్లలకు చదువు ఎలా చెప్పాలి? హోమ్ వర్క్ ఎలా చేయించాలి? కొడితే పిల్లలు నేర్చుకుంటారా? వాళ్లు సులభంగా నేర్చుకోవాలంటే ఏం చేయాలి? వంటి ప్రశ్నలెన్నో మళ్లీ ఉదయించాయి. వాటన్నింటికీ సమాధానమిచ్చే ప్రయత్నం ఇది.

భారంగా వద్దు...

పిల్లల చదువనగానే పెద్దల్లో ఎక్కడో ఏదో మూల ఆందోళన మొదలవుతోంది. వాళ్లకిస్తున్న హోమ్‌వర్క్ విషయంలో. పిల్లల చదువు విషయంలో మనం ఎంత సమయం కేటాయించాలి? ఎంత వరకు జోక్యం చేసుకోవాలి? ఎప్పుడూ ఆందోళనే. మొదట ఆ భారమనే మాటనే తొలగించాలి. ఎల్‌కేజీ స్థాయినుంచే వాళ్లను ర్యాంకుల పంటగా చూడకూడదు. హోమ్‌వర్క్ అనగానే భారంగా... తొందరగా పూర్తి చేసే పనిగా చూస్తే ఇలాంటి ఆందోళనలు తప్పవు. పిల్లల చదువులపై మన జోక్యాన్ని ర్యాంకుల కోసం కాకుండా తల్లిదండ్రులు పంచుకునే, పెంచుకునే అనుబంధంలో భాగంగా చూడాలి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులు కావడం, ఎక్కువ సేపు పిల్లలు స్కూల్, ట్యూషన్ వంటివాటితోనే గడిపేస్తున్నారు. దీంతో పిల్లలతో మీరు గడిపే సమయం తగ్గిపోతోంది. అందుకే హోమ్‌వర్క్‌ని పిల్లలతో కలిసి గడిపే సమయంగా భావించండి. దీని వల్ల హోమ్‌వర్క్ పిల్లలకే కాదు మీకూ భారంగా అనిపించదు.

సాన్నిహిత్యమే...

సహజంగా పిల్లలు తల్లిదండ్రుల సాన్నిహిత్యం కోరుకుంటారు. పేరెంట్స్ ఎప్పుడూ మన సమక్షంలోనే ఉండాలనుకుంటారు. తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడు దగ్గరకు తీసుకుంటారా అని తపన పడుతుంటారు. ఇది ఒక్క ఎల్‌కేజీ పిల్లల్లోనే కాదు.. పదో తరగతి వచ్చినవాళ్లలోనూ ఉంటుంది. ఆ సాన్నిహిత్యం దొరకని పిల్లల్లో ఎన్నో సమస్యలు కనిపిస్తాయి. ఉద్వేగాలపై నియంత్రణ ఉండదు. ఆత్మన్యూనతతో బాధపడుతుంటారు. బయటివాళ్లు ఏ కాస్త ఆప్యాయత చూసినా కరిగిపోయి వాళ్లు చెప్పినట్టల్లా వింటారు. కాబట్టి మీ పిల్లలు అలా కాకుండా ఉండాలంటే... మీ సాన్నిహిత్యం ముఖ్యం. పిల్లలను దగ్గర తీసుకొని ప్రేమగా నేర్పించండి. పిల్లల జీవితానికి అతికీలకమైన చదువుల సమయంలో మీరు తోడు ఉండటం.. తమ ప్రగతిలో భాగంగా మీ సాన్నిహిత్యాన్నీ ఆస్వాదించడం వల్ల పిల్లల్లో చక్కటి మానసిక ఎదుగుదల కనిపిస్తుంది.

జోక్యం వద్దు...

మన దేశంలోని తల్లిదండ్రులు దగ్గరుండి మరీ హోమ్‌వర్క్ చేయించడంలో ప్రపంచంలో ఎవరికీ తీసిపోరు. కాకపోతే, పిల్లలకి దాన్నో శిక్షగా మారుస్తారు. ర్యాంకులపై తమ ఆందోళనలన్నీ వాళ్లపై రుద్దుతారు. లేకపోతే.. వాళ్లపని తాము చేసిపెడతారు. నోట్స్ తామే రాసేస్తారు. దీంతో పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెరగకుండా మీరే అడ్డుకున్నవారవుతారు. పిల్లలు స్వతంత్రంగా ఆలోచించుకోకుండా నిరోధించినవారవుతారు. పిల్లలు తొందరగా ఓ పాఠాన్ని నేర్చుకోవాలని బట్టీ కొట్టించడం చేస్తుంటారు ఇంకొందరు...ఇది కూడా మంచి పద్ధతి కాదు. దేన్నైనా వాళ్ల నిత్యజీవితానికి అన్వయించి చెప్పాలి. దాంతో సులభంగా నేర్చుకుంటారు.

ఓపికతో...

పిల్లలందరూ ఒకేలా ఉండరు. కొందరు పిల్లలు తెలివిగా ఉంటారు. ఒక్కసారి చెబితే నేర్చుకుంటారు. మరికొందరు తొందరగా నేర్చుకోలేరు. అంతమాత్రాన మీ పిల్లలు ఎందుకు పనికిరాని వాళ్లని కాదు. వాళ్లూ నేర్చుకుంటారు. కాకపోతే చదువు విషయంలో ఎప్పుడూ ఇతరులతో పోల్చకండి. అది ఆత్మన్యూనతకు దారి తీస్తుంది. ఇతరులు ఒక్కసారికే నేర్చుకున్నది మీ పిల్లలు మూడోసారికో, నాలుగోసారికో ఒంట



బట్టించుకోవచ్చు. కాబట్టి పిల్లలకు చెప్పేటప్పుడు ఓపికతో ఉండండి. పిల్లలకు ఇష్టమైనదేదో ఉండే ఉంటుంది. చదువును దానితో ముడిపెట్టి చెప్పడం అలవాటు చేసుకోండి. వాళ్లూ ఇష్టంగా నేర్చుకుంటారు. మీకూ సులభమవుతుంది.

మోటివేట్ చేయాలి...

పిల్లలను క్రమశిక్షణలో పెట్టడం అవసరమే. ఆ పేరుతో వాళ్ల మీద ఒత్తిడి పెట్టడమే తప్పు. ప్రమాదం కూడా. పిల్లలు బద్ధకంతో చదవట్లేదా లేక ఏదైనా సమస్య ఉందా అని గమనించాలి. ఇతరులతో పోల్చడం వల్ల పెద్దవాళ్లు ఆశించిన ఫలితాలు రాకపోగా, ప్రతికూల ఫలితాలు వచ్చే ప్రమాదమే ఎక్కువ. ముందు పిల్లల శక్తిసామర్థ్యాలు, వాళ్ల గ్రాహక శక్తి తెలుసుకోవాలి. పాజిటివ్‌గా మోటివేట్ చేయాలి. అంతేకాదు పిల్లల మీద ఒత్తిడి పెట్టడం వల్ల మరింత మొండికేసే ప్రమాదం ఉంది.

ప్రణాళికతో...

కేజీ నుంచే పిల్లలు రోజూ నిర్దిష్ట వేళల్లో చదివే అలవాటుని పరిచయం చేయండి. పిల్లలు చదువకునే సమయంలో వాళ్లే కాదు మీరూ మొబైల్, టీవీ, ల్యాప్‌టాప్‌లకి దూరంగా ఉండండి. వాళ్ల చదువులకంటూ ఇంట్లో ఓ ప్రత్యేక ప్రదేశం, టేబుల్ కేటాయించండి. నిశ్శబ్ద వాతావరణం కల్పించండి. అప్పుడే వాళ్ల దృష్టి మరలకుండా ఉంటుంది. పని కూడా త్వరగా పూర్తిచేస్తారు. కుదిరితే చదువుకునేందుకు ఓ గదిని విడిగా ఏర్పాటుచేస్తే మరీ మంచిది. ఇది ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్త. అలాగే వీలైనంతవరకూ స్కూలునుంచి రాగానే ఓ అరగంట విరామం ఇచ్చి.. తరవాత చదువుకునేలా చూడాలి. పిల్లలు ఎదిగేకొద్దీ, హోమ్‌వర్క్ చేసే సమయానికి సంబంధించిన ప్రణాళికలు పిల్లల్నే వేయమనండి. మీరు వాళ్లకి సమయపాలనా సామర్థ్యం నేర్పించినవాళ్లవుతారు. మీరు కేవలం పాఠాల్లో వాళ్లకి సహకరించడం కాకుండా.. వాటినే క్విజ్‌లుగానో, జీకే పోటీలుగానో మార్చండి. ఆయా సబ్జెక్టుపై చక్కగా పట్టుసాధిస్తారు. బాగా చదివినప్పుడు 'శభాష్' అంటూ వెన్నుతట్టడం, ఒత్తిడితో అలసిపోతే తలనిమరడం ఇవన్నీ వాళ్లకు సాంత్వననిస్తాయి.

ఆసక్తితో...

ఎంతసేపు పాఠ్యపుస్తకాలనే కాదు... ఇతర పుస్తకాలను చదివించండి. చదవడం వల్ల బోలెడు ప్రయోజనాలున్నాయని మనకు తెలుసు. అది పిల్లలకు అర్థంకావాలంటే వారికి ముందు ఆసక్తికరమైన కథలు చెప్పండి. దానివల్ల మరికొన్ని కథలు తెలుసుకోవాలనే ఉత్సాహం వారిలో కలుగుతుంది. అప్పుడు మీరో కథల పుస్తకాన్ని ఇచ్చినా.. ఇష్టంగా చదివేందుకు ఆసక్తి చూపిస్తారు. పుస్తకాలు చదివించడం అంటే ఏదో ఒకటిలే అనుకోవద్దు. వారి ఆసక్తిని తెలుసుకోండి. వారికి చరిత్ర అంటే ఇష్టమా? ఎప్పటిదో చరిత్రను చెప్పే పుస్తకం బదులు దానికి గుర్తుగా మిగిలిపోయిన కోటలూ, దర్బారుల చిత్రాలను ముందు వారికి చూపించండి. అప్పటి వస్తువులను పరిచయం చేయండి. తరవాత వాటి వెనకున్న కథలను చెబితే మరింత ఉత్సాహంగా ఆ పుస్తకాలను చదవగలుగుతారు.

ఊహాశక్తి పెరిగేలా...

రంగు రంగుల బొమ్మల చిత్రాలున్న పుస్తకాలను చూపించండి. వాటి గురించి వివరణ ఇస్తున్నప్పుడు ఆయా చిత్రాల ప్రత్యేకతను వివరించండి. ఫలితంగా పిల్లల్లో ఊహాశక్తితో పాటు వినే అలవాటు ఏర్పడుతుంది. ఇష్టంగానూ చదివేందుకు ప్రయత్నిస్తారు. ప్రతిరోజూ ఓ కథల పుస్తకాన్నో, మరొకటో వారితో చదివించే అలవాటు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఒక్కసారి అలవాటు అయితే.. మీ సాయం లేకుండానే వారు పుస్తకాలు చేతుల్లోకి తీసుకుంటారు. మీరు ఎప్పటికప్పుడు ప్రశ్నలు వేయండి. లేదా రాయించండి. దానివల్ల వాళ్లు ఎంతవరకూ చదువుతున్నారనేది తెలుస్తుంది.

- మానవి డెస్క్

ఇట్ల చేద్దాం

కూరగాయలు కోసేటప్పుడు తొడిమెల వంటివి తీసి పారేస్తుంటారు. అలా కాకుండా అన్నింటినీ ఒక్కచోట చేర్చి ఉడికించి స్టాక్ చేసి పెట్టండి. సూప్‌లో వాడటానికి బాగుంటుంది.

అభినవ సత్యభామ



జమున(30 ఆగస్టు)

Women of the day

'గోదారి గట్టుంది.. గట్టు మీద చెట్టుంది.. చెట్టుకొమ్మన్న పిట్టుంది.. పిట్ట మనసులో ఏముంది' అంటూ అమాయకంగా ప్రశ్నించే పల్లెటూరి అమ్మాయి... 'మీరజాలగలడా....మీరజాలగలడా నా యానతి..వ్రతవిధాన మహిమన్ సత్యాపతి' అంటూ గడసరితనం ప్రదర్శించే సత్యభామగా తెలుగు ప్రేక్షకుల మదిలో నిలచిన ప్రముఖ నటి జమున. తెలుగు చలన చిత్రంలో అరుదైన కథానాయికగా గుర్తింపు పొందిన మేటితార.

జమున హంపీలో పుట్టారు. ఆమె మాతృభాష కన్నడ. ఆమె తల్లితండ్రులు నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యాదేవి. తండ్రి వ్యాపారరీత్య గుంటూరు జిల్లా దుగ్గిరాలకు వచ్చి స్థిరపడ్డారు. సహజంగా బెరుకు అంటూ లేని జమున స్కూలులో చదివేకాలంలో నాటకాలపై ఆసక్తి పెరిగింది. సినీనటుడు జగ్గయ్య అదే గ్రామస్తుడు కావడంతో జగ్గయ్యతో పరిచయం నాటకాల వైపు దారితీసింది. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం' అనే నాటికలో ఆమె తొలిసారి నటించారు. ప్రముఖ నటుడు గుమ్మడి కూడా ఈ నాటికలో నటించాడు. జమున నటనాప్రతిభ నలుమూలలకూ పాకడంతో సినిమా అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. కళపై ఉన్న మక్కువతో నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకున్నారు.

బి.వి.రామానందం తీసిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, నందమూరి తారక రామారావు తదితర నటుల సరసన నాయికగా నటించారు. ఎన్ని పాత్రల్లో నటించినా ఆమెకు బాగ పేరు తెచ్చింది సత్యభామ పాత్రే. వినాయకచవితి చిత్రంలో మొదటి సారి సత్యభామ పాత్రలో జమున నటించారు. ఆ తర్వాత శ్రీకష్ణ తులాభారం చిత్రంలో ఆమె నటన సత్యభామ అంటే ఇలాగే ఉంటారు అని ప్రేక్షకుల చేత మెప్పించారు.

తెలుగు, దక్షిణభారత భాషల్లో కలిపి ఆమె 198 సినిమాల్లో నటించారు. 1967లో ఆమె హిందీలో చేసిన మిలన్ సినిమా, 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1965లో జూలూరి రమణరావును వివాహం చేసుకున్నారు జమున. ఆయన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జువాలజీ ప్రొఫెసర్ గా పనిచేశారు. 2014 నవంబరు 10లో గుండెపోటుతో మరణించారు. కుమారుడు వంశీకష్ణ, కూతురు ప్రముఖ ఆర్టిస్టు స్రవంతి.

ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో 1980లో కాంగ్రెసు పార్టీలో చేరిన జమున రాజమండ్రి నియోజకవర్గం నుంచి 1989లో లోక్ సభకు ఎంపిగా ఎన్నికయ్యారు. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థ నెలకొల్పి గత మూడు దశాబ్దాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారామె. ❄

నచ్చేలా.. మెచ్చేలా..

పిల్లలకు మనం ఎన్నో బొమ్మలు కొనిస్తాం. వారికి ఊహ తెలిసిన నాటి నుంచి వారు ఇష్టపడేది బొమ్మలనే. మరి ఏ వయసు వారికి ఎలాంటి బొమ్మలు కానుకగా ఇస్తే బాగుంటుందో తెలుసా! పిల్లలకు ఇచ్చే బహుమతులు వారికి నచ్చేలా.. వారు మెచ్చేలానే కాదు.. వారి మనోవికాసానికి ఉపయోగపడేలావ ఉండాలి.

- ఏడాది దాటిన చిన్నారులకు కదిలే బొమ్మలను ఎంతో ఆసక్తిగా చూస్తారు. మాట్లాడే బొమ్మలు, మ్యూజిక్ వచ్చే బొమ్మలు కొనిస్తే మంచిది.



- మూడేండ్లు వచ్చేనాటికే వారికి రంగులు తెలుస్తాయి. చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూంటారు. ఈ వయసులోని పిల్లలకు వివిధ రకాల జంతువుల బొమ్మలు, వినోదంతో పాటు పరిసరాలను పరిచయం చేసే బొమ్మలు కొనివ్వాలి.
- ఆరేండ్లు పై బడిన పిల్లలకు కాస్త ఊహ తెలుస్తుంది. వారికి విజ్ఞానాన్నీ, వినోదాన్నీ పెంచే ఆటవస్తువుల్ని కొనిస్తే బాగుంటుంది.
- పదేండ్లు పై బడితే చదవడం అలవాడుతుంది. ఈ వయసులో బొమ్మలతో కూడిన చిన్నచిన్న కథల పుస్తకాలు కొనివ్వాలి. చెస్, క్యారెమ్స్ వంటి ఆటలు నేర్పించాలి.
- పన్నెండేండ్లు నిండితే పిల్లల ఆసక్తులూ, అలవాట్లు మారిపోతాయి. ఇంట్లో ఒంటరిగా కూర్చోని కాకుండా నలుగురితో కలిసి ఆడుకునేలా ఔట్‌డోర్ గేమ్స్ అలవాటు చేయాలి. వీడియో గేమ్స్ వైపు ఆకర్షితులు కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచాలి. గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలను కానుకగా ఇవ్వాలి. ❄



వాషింగ్ మెషీన్ శుభ్రంగా...

ఇంట్లో ఉన్న బట్టలన్నింటినీ శుభ్రం చేసేది వాషింగ్ మెషీన్. మరి ఆ వాషింగ్ మెషీన్ శుభ్రంగా లేకపోతే కష్టం. కాబట్టి... ఎప్పటికప్పుడూ మీ వాషింగ్ మెషీన్ శుభ్రం చేయాలి. అందుకు ఈ చిట్కాలను పాటించాలి.

- డిటర్జెంట్ సొరుగు పురుగుల స్వర్గంగా, ఇరుక్కుపోయిన వాషింగ్ పౌడర్ పేరుకుపోయి ఉంటుంది. సాధ్యమైతే, మొత్తం సొరుగును బయటకు తీసి, ఒక పాత టూత్ బ్రష్ తో శుభ్రం చేసి తిరిగి పెట్టండి. దీనికి సాధారణ క్లీనర్ ఉపయోగించండి.
- మెషీన్‌లోని ఫిల్టర్ వెచ్చగా ఉంటుంది. తేమకూడా ఉంటుంది. కాబట్టి దీంట్లో పురుగులు ఎక్కువ జమ అవుతాయి. దీనిని ఎప్పటికప్పుడు ఖాళీ చేయండి. లోపలి జమ అయిన చెత్తను ఎప్పటికప్పుడు తీసేయండి.
- మీకు వాషింగ్ మషీన్ లోపలిభాగం శుభ్రంగా మెరుస్తూ కనపడినా, దీనిలో ఉన్న రంధ్రాలలో మరియు పగుళ్ళలో పురుగులు ఉంటాయి. నెలలో రెండుసార్లు దీనిని ఖాళీగా ఉంచి వాష్ రన్ చేయటం మంచిది. దీనిని శుభ్రపరచటానికి సోడా స్ఫటికాలు లేదా డిష్ వాషర్ ఉపయోగించొచ్చు. వేడినీళ్లతో (60 డిగ్రీల ఉష్ణోగ్రత) శుభ్రం చేయండి. ఇలా చేయటం వలన పురుగులు చస్తాయి, చెడు వాసనలు తొలగిపోతాయి సబ్బు తెట్టె, లైమ్ స్కేల్ తొలగిపోతుంది.
- దుస్తులు ఉతికిన తరువాత డ్రమ్ లోపలికి బయటి గాలి వెళ్ళేట్లుగా వాషింగ్ మెషీన్ డోర్ కొద్దిగా తెరిచి ఉంచండి. దీనివలన పురుగుల ఉత్పత్తిని అరికట్టవొచ్చు.
- వాషింగ్ మెషీన్ శుభ్రపరచడంలో సరైన క్లీనర్ ఉపయోగించడం మంచిది. పౌడర్ కాకుండా ద్రవరూపంలో ఉపయోగించండి. డ్రమ్‌లో ఇరుక్కుపోవడం, దుర్వాసన రావడం వంటి సమస్యలుండవు. ❄

కార్మిక చట్టాలు బేఖాతర్



అమరావతి : బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఎంఏ గఫూర్ విమర్శించారు. హైర్ అండ్ ఫైర్ విధానాలను పెద్దఎత్తున ముందుకు తీసుకొస్తూ కార్మిక సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీఐటీయూ అనుబంధ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) 60వ కార్యవర్గ సమావేశాలను మంగళవారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఫెడరేషన్ అధ్యక్షులు సింగారవేలు ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గఫూర్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం చూస్తోం దని, మైనింగ్ శాఖను ప్రైవేట్‌కు అప్పగిం చేందుకు సిద్ధమయిందన్నారు. కార్మిక సంఘాలను, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందన్నారు. బీజేపీ హయాంలో మంచిరోజులు కార్పొ రేట్లకు, విదేశీ కంపెనీలకు వచ్చాయని, సామాన్య ప్రజలకు కాదన్నారు. నల్లధ నాన్ని వెనక్కు తీసుకొస్తానని చెప్పిన మోడీ, తీసుకురాకపోగా ఇప్పుడు అది మరింత రెట్టింపయిందని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే విధానాలను ఒక పక్క ప్రవేశపెడుతూ మరోపక్క మతం పేరుతో వారిని విడగొట్టేందుకు బీజేపీ ప్రయత్ని స్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘపరివార్ జరిపిన దాడుల్లో సుమారు 53 మంది కార్మికులు మరణిం చారని తెలిపారు. మత సామరస్యతకు, కార్మిక వర్గ ఐక్యతకు కృషి చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. నోట్ల రద్దు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నెలల పాటు భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరక లేదని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను చంద్రబాబు ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో పక్క దారి పట్టిస్తోందన్నారు.

విద్యార్థినులపై దూసుకెళ్లిన టిప్పర్

ఒకరు మృతి.. ఏడుగురికి తీవ్రగాయాలు

ఓర్వకల్లు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో మంగళవారం విద్యార్థినులపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఓ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓర్వకల్లు పోలీసు స్టేషన్ సమీపంలో ఆర్‌సి ఎల్లారెడ్డి కళాశాల ఉంది. విద్యార్థులు ఓర్వకల్లు బస్టాండ్‌లో దిగి అర కిలోమీటరు నడిచి కళాశాలకు చేరుకోవాలి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విద్యార్థినులు నడుచుకుంటూ కళాశాలకు వెళ్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ వారిపైకి దూసుకెళ్లింది.

కేసులెలా రద్దు చేస్తారు?

ఏపి సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం



- టీడీపీ నేతల కేసుల రద్దు పిల్‌ను విచారించిన ధర్మాసనం
- హైకోర్టు ఆదేశించే వరకూ కేసుల్ని ఎత్తేయం : ఏజీ

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ నేతలు 274 మందిపై ఉన్న వివిధ రకాల కేసుల్ని రద్దు చేయడాన్ని సవాల్ చేసిన వాజ్యాన్ని హైకోర్టు మంగళ వారం మరోసారి విచారించింది. ఈ సంద ర్భంగా గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కౌంటర్ పిటీషన్‌ను దాఖలు చేయకపోవడంపై బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కేసులెలా రద్దు చేస్తారని ప్రశ్నించింది. టీడీపీ పెద్దలపై పోలీస్ కేసుల్ని రద్దు చేస్తూ జారీ అయిన పలు జీవోల్ని ప్రస్తావిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ఉమ్మడి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిల్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగ నాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించి ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎంతమందిపై ఏయే కారణాలతో కేసులు ఎత్తేశారో, అందుకు ఎన్ని జీవోలిచ్చారో తెలియజేయాలని ప్రతివాదుల్ని బెంచ్ ఆదేశించింది. ఎంతమందిపై దోపిడీలు, దొమ్మీలు, హత్య, అత్యాచార తదితర ఆరోపణల కేసులున్నాయో పట్టిక రూపంలో తెలియజేయాలని గతంలో హైకోర్టు ఆదేశించిన మేరకు పిటిషనర్ ఆళ్ల రామకష్ణా రెడ్డి ధర్మాసనానికి నివేదించారు. హత్య, అత్యాచార కేసుల్ని కూడా రద్దు చేశారని అతని తరపు న్యాయవాది సుధాకర్‌రెడ్డి వాదించారు. ఈ కేసులపై కింది కోర్టుల్లో విచారణకు వచ్చినప్పుడు ఏం చేస్తారని ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను బెంచ్ ప్రశ్నించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కౌంటర్ పిటిషన్లు దాఖలు చేసే వరకు కింది కోర్టుల్లో కేసులపై విచారణ వాయిదా వేయమని కోరతామని, అప్పటి వరకు ఆ కేసుల్ని రద్దు చేసేది లేదన్న అడ్వకేట్ జనరల్ ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డు చేసింది.

ఒక జీవోను అందరికీ ఆపాదిస్తున్నారు : ఏజి దమ్మాలపాటి

ఒక జీవోలోని విషయాలను మొత్తం కేసుల ఎత్తివేతకు ఆపాదిస్తూ వాదించడం సబబుకాదని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. అభ్యంతరాల్ని కింది కోర్టుల్లో చెప్పుకోవాలని, రాజకీయ వాదన చేయ కూడదన్నారు. కేసుల్ని ఎత్తేసే అధికారం ప్రభుత్వానికి ఉందంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ "పిటిషనర్ రాజకీయ ప్రయోజనాన్ని పక్కకుపెట్టండి. అవసరమైతే ఈ కేసును హైకోర్టే సుమోటోగా చేప డుతుంది. ప్రతివాదులందరికీ (కేసులెత్తేసిన వారికి) నోటీసులిస్తాం" అని ప్రకటించింది. వెంటనే ఏజి కల్పించుకుని తొలుత ప్రభుత్వ వాదన తెలుసు కునేందుకు ఏపి సర్కార్‌కు నోటీసులివ్వాలని సూచిం చడంతో అందుకు ధర్మాసనం అంగీకరించింది.

జీవోల్ని కొట్టేయాలి : పిటిషనర్ తరఫు న్యాయవాది పొన్నవోలు

సీఎం చంద్రబాబు తన మంత్రివర్గంలోని కొందరు సభ్యులు, అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలపై గతంలో పోలీసులు నమోదు చేసిన కేసుల్ని ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ తేదీల్లో జారీ చేసిన పలు జీవోల్ని కొట్టే యాలని పిటిషనర్ న్యాయవాది పొన్న వోలు సుధా కర్‌రెడ్డి వాదించారు. అధికార పార్టీ నేతలపై నమో దైన కేసులపై పలు కోర్టుల్లో జరుగుతున్న ప్రాసిక్యూ షన్‌ను ఉపసంహరించుకోవాలని ఆయా కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రకటించాలని కోరారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమైన ఆ జీవోల్ని కొట్టేయాల న్నారు. 274మంది టీడీపీ నేతలపై కేసుల ఉపసంహరణకు ఎపి సర్కార్ 132 జీవోల్ని జారీ చేసిందని, మూకుమ్మడిగా కేసులెత్తేసే ప్రభుత్వ ప్రయత్నాల్ని అడ్డుకోవాలని ఆయన హైకోర్టును కోరారు. ఎపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలి డిప్యూటీ చైర్మెన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఉప ముఖ్యమంత్రి కెఇ కష్ణమూర్తి, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, సిద్దా రాఘ వరావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు కరణం బలరాం, ఎమ్మెల్యేలు నందమూరి బాలకష్ణ, టీవీ రామారావు, గొల్లపల్లి సూర్యారావు, దాట్ల సుబ్బ రాజు, దాసరి బాలవర్ధనరావు, చింతమనేని ప్రభాకర్, ఎ.ఆనంద రావు, ఎం.అశోక్‌రెడ్డిలతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి నేతలు, పార్టీ కార్యకర్తలు ఇలా మొత్తం 274 మందిపై కేసుల్ని చంద్రబాబు సర్కార్ రద్దు చేసిందని పిల్‌లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 274 మందినీ వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. డీజీపీ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, వివిధ జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేశారు. కేసు విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

బాలకృష్ణపై హైకోర్టులో వైసీపీ కేసు

హైదరాబాద్ : నంద్యాల ఉప ఎన్నిక ప్రచార సమయంలో బాహాటంగా ఓటర్లకు డబ్బులిచ్చిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణపై ఎన్నికల సంఘం కేసు నమోదు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ ప్రతిపక్ష వైసీపీ ప్రధాన కార్యదర్శి కె.శివ కుమార్ హైకోర్టులో కేసు వేశారు. నంద్యాలలో 16న బాలకష్ణరోడ్‌షో నిర్వహించినప్పుడు ఓటర్లకు డబ్బులిచ్చి ప్రలోభపర్చుకున్నారని ఈ రిట్‌లో పేర్కొన్నారు. ఫొటో ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం కేసు నమోదు చేయక పోవడం అన్యాయమన్నారు. కోర్టు స్పందించి ఇసికేసు పెట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రిట్‌లో కేంద్రఎన్నికల సంఘం, ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, నంద్యాల నియో జకవర్గ రిటర్నింగ్ అధికారి సహా బాలకష్ణనూ ప్రతివాదులుగా పేర్కొన్నారు.

అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలకు కాంట్రాక్టు నామినేషన్‌పై ఎలా ఇచ్చారు?

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాల హక్కులను అడ్వాన్స్‌డ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు అక్రమంగా ఇచ్చారంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. నామినేషన్ విధానంపై రెండేళ్లకు లైవ్ ప్రసారాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ రిట్‌ను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించి ప్రతివాదులైన ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శి, అడ్వాన్స్‌డ్ టెలీకమ్యూనికేషన్స్‌కు నోటీసులు జారీ చేసింది. ఎలాంటి టెండర్లు పిలవకుండా ఆంధ్రజ్యోతి దినపత్రిక యజమాన్యానికి సంబంధించిన అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు అసెంబ్లీ లైవ్ ప్రసారాలు ఎలా ఇస్తారని పిటిషనర్ తరఫు న్యాయవాది పి.సుధాకర్‌రెడ్డి వాదించారు. నామినేషన్ విధానంలో ఇవ్వడంలో ఆ కంపెనీకి ఉన్న అర్హత ఏమిటి, గంటకు రూ.75 వేలు చొప్పున చెల్లింపునకు ప్రమాణికం ఏమిటి, రెండేళ్లకు కాంట్రాక్టు ఎలా ఇచ్చారో తేల్చాలని ఆయన హైకోర్టును కోరారు. టెండర్లు లేకుండా అసెంబ్లీ ప్రసారాల కాంట్రాక్టును నామినేషన్ విధానంలో ఎందుకిచ్చారో వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ వచ్చే నెల 12కి వాయిదా వేసింది.

49.36 లక్షల మంది చిన్నారులకు ఎంఆర్ టీకా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మీజిల్స్-రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమంలో రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతున్నది. సోమవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 49,36,172 (54.84%) మంది చిన్నారులకు టీకాలు వేశారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 3,44,354 మంది, అత్యల్పంగా కొమరంభీం అసిఫాబాద్ జిల్లాలో 81,510 మంది తీసుకున్నారు. ఎంఆర్ టీకాను 9 నెలల నుంచి 15 ఏండ్లలోపు పిల్లలందరికీ వేయించాలని, గతంలో టీకాలు తీసుకున్న పిల్లలకు కూడా తప్పకుండా వేయించాలని ఇమ్యూనైజేషన్ జేడీ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

డీఎస్సీనోటిఫికేషన్‌ప్రకటించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం విప్లవకుమార్, కార్యదర్శి ఎ విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం రాష్ట్రంలో లక్షలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులు వేచిచూస్తున్నారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. ఫలితంగా వేలాది మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాకముందు జరిగినట్టుగానే కొత్త రాష్ట్రం ఆవిర్భవించినా ఆత్మహత్యలు కొనసాగడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలతో పాలకులకు రాజకీయ ఉద్యోగాలొచ్చాయని ఎద్దేవా చేశారు. కానీ నిరుద్యోగులకు మూడున్నరేండ్లయినా ఉద్యోగాలు రాలేదని తెలిపారు. ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ స్పందించి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కొత్త కేజీబీవీల్లో ఏఎన్ఎంలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన 84 కొత్త కేజీబీవీల్లో ఏఎన్ఎంలను నియమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డీఈఓలకు ఆదేశాలు జారీచేసింది. 80 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న కేజీబీవీల్లో ఏఎన్ఎంలను నియమించుకోవాలని కమిషనర్ ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే, ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా వీరిని నియమిస్తున్నట్టు కమిషనర్ జి కిషన్ తెలిపారు.

మోడల్ స్కూల్స్‌లో వాచ్‌మెన్స్ నియామకం

రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో వాచ్‌మెన్లను నియమిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఇప్పటికే డీఈఓలకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. త్వరలో వీరి నియమకాలు జరగనున్నాయి.

1 నుంచి 7 వరకు 'డిమాండ్స్ డే'

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే నెల 1 నుంచి 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'డిమాండ్స్ డే'గా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం అమృతా ఎస్టేట్‌లోని రైతు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఉపాధ్యక్షులు ఎం. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) పిలుపు మేరకు సెప్టెంబరు 1న రైతు సంఘాల జెండాలను గ్రామాల్లో ఎగురవేసి, సమావేశాలు నిర్వహించాలని కోరారు. 2నుంచి 6 వరకు సదస్సులు, సభలు జరపాలని, 7న ఎమ్మార్వో, ఆర్‌డీవో, కలెక్టర్ కార్యాలయాల ముందు పికెటింగ్ నిర్వహించాలని పిలుపు నిచ్చారు.

మధ్యప్రదేశ్‌లోనూ భగీరథ

చీఫ్ జనరల్ మేనేజర్ అశీష్ కుమార్ శ్రీవాత్సవ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ ఖరీదైన ప్రాజెక్టు కాదని, ప్రజల కోసం ఎంతైనా ఖర్చుపెడతామని మధ్యప్రదేశ్ తాగునీటి శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ అశీష్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. ప్రజారోగ్యం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. భగీరథ ప్రాజెక్టు పనులను పరిశీలించడానికి మూడు రోజుల పర్యటనకు కోసం మధ్యప్రదేశ్ తాగునీటి అధికారుల బందం తొలిరోజు ఎర్రమంజిల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అధికారులను కలిసింది. భగీరథ ప్రాజెక్టు స్వరూపం, లక్ష్యాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టెండర్ పద్ధతులతోపాటు అంచనాల తయారీలో అనుసరించిన విధానాలను తెలిపారు. దాదాపు రూ.47 వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్టు చెప్పారు.

నేడు, రేపు ఫీల్డ్‌కు

బుధవారం మెదక్ జిల్లా సింగూరు, గురువారం మహబూబ్‌నగర్ జిల్లా ఎల్లూరులో జరుగుతున్న పనులను మధ్యప్రదేశ్ బందం పరిశీలించనుందని చెప్పారు.

ల్యాండ్ మాఫియాను సృష్టించేందుకే జీఓ 39

ప్రభుత్వంపై భట్టి విక్రమార్క ఫైర్

- టీఆర్ఎస్ దయాదాక్షిణ్యాలపై బతకాల్సిందే
- న్యాయపరంగా ఎదుర్కొంటామని వెల్లడి



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ, సహకార శాఖల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 39 ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసేలా ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ల్యాండ్ మాఫియాను సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర సమన్వయ కమిటీలను నియమించేందుకు కుట్ర చేసిందని విమర్శించారు. పట్టా భూములు ఉన్న రైతులు భవిష్యతులో టీఆర్ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సి వస్తోందని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ చీఫ్‌విప్ గండ్ర వెంకటరమణా రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖలు చేయల్సిన పనులను టీఆర్ఎస్ కార్యకర్తలతో చేయించడానికి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ జీవోను కాంగ్రెస్ పార్టీ న్యాయపరంగా ఎదుర్కొంటుందన్నారు. ఈ సమన్వయ కమిటీలు ఏర్పడితే గ్రామాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూ వివాదాలు పరిష్కరించే బాధ్యతను ఈ సమన్వయ కమిటీలకు అప్పగించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు పాత భూస్వామ్య వ్యవస్థను తెస్తున్నారని చెప్పారు. రైతులపై టీఆర్ఎస్ నేతలంతా పెత్తనం చేస్తారని చెప్పారు. భూ వివాదాలను రెవెన్యూ శాఖ లేదా కోర్టు ద్వారా పరిష్కరించే పద్ధతి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో వాటిని నిర్వీర్యం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. భవిష్యతులో ఈ సమన్వయ కమిటీలు లేని వివాదాలు సృష్టించి లబ్దిపొందే అవకాశం ఉందన్నారు. ఈ కమిటీలను నామినేషన్ పద్ధతి కాకుండా ఎన్నికల ప్రక్రియ ద్వారా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

వెంటనే ఈ జీవో 39 వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే నిజమైనా భూ హక్కుదారులకు అన్యాయం జరగబోతుందని హెచ్చరించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలపై కేసీఆర్ నమ్మకం లేదన్న అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు.

అర్జున్‌రెడ్డి సినిమాను నిలిపివేయాలి :వీహెచ్

నెల రోజులపాటు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల్ని పోలీసులు విచారించారు కానీ అర్జున్‌రెడ్డి సినిమాలో డ్రగ్స్ తీసుకుని ఆపరేషన్లు చేసినట్టు చూపించారని, ఈ సినిమాను వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపీ వి హనుమంతరావు డిమాండ్ చేశారు.

ప్రయివేటు కంపెనీ అత్యుత్సాహం

- కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు
- ఇక్ఫాతో నాకు సంబంధం లేదన్న స్వామినాథన్
- ఇంగ్లీషు పత్రికలో కథనం
- అది ఓ ఫేక్ కంపెనీ : కాంగ్రెస్ నేత
- అవార్డు తీసుకునేందుకు ముఖ్యమంత్రి నిరాకరణ
- బూమ్‌రాంగ్ అయిన సీఎం కార్యాలయం ప్రకటన
- తెలుసుకోకుండా గవర్నర్ ప్రశంసలు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు ప్రకటించింది ప్రభుత్వ సంస్థ కాదు. అది ఓ ప్రయివేటు కంపెనీ. ఇంకా చెప్పాలంటే ఫేక్ కంపెనీ. దీనికి సంబంధించి మంగళవారం ఓ ఇంగ్లీషు పత్రికలో కథనం ప్రచురితమైంది. కేసీఆర్‌ను ఎంపిక చేసినట్టుగా తనకు కూడా తెలియదని, ఎవరో చెప్పగా తెలిసిందని, అయినా ఆ కంపెనీతో నాకు సంబంధం లేదు అని స్వామినాథన్ ఆ పత్రిక అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దీంతో కంపెనీ యొక్క చరిత్ర బయటకు రావడంతో ఆ అవార్డు తీసుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిరాకరించారు. ఆ అవార్డు తీసుకోవడం లేదు అని విశ్వసనీయ సమాచారం. ఇంగ్లీషు పత్రిక కథనంతో ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు చేసిన ప్రచారం బూమ్‌రాంగ్ అయింది. ఇలాంటి కంపెనీ చూపిన అత్యుత్సాహంతో కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు ఇవ్వబోతున్నట్టు చెప్పగానే వెనుకాముందు చూడకుండానే ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు ప్రకటన విడుదల చేయడం, అది చూసి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ కూడా ప్రశంసించడం చర్చనీయాంశమైంది. అసలుకు అది ఫేక్ కంపెనీ అని కాంగ్రెస్‌పార్టీ నేత దాసోజు శ్రవణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా వివిధ విభాగాల్లో అవార్డులను ప్రదానం చేసే భారత ఆహార , వ్యవసాయ మండలి (ఐసీఎఫ్ఎ) ఈ ఏడాది కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డును ఇస్తున్నట్టు ప్రకటించింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి చేసే కృషికి గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్టాత్మక వ్యవసాయ నాయకత్వ అవార్డుకు కేసీఆర్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ ఈనెల 19న కేసీఆర్‌కు లేఖ పంపింది.సంస్థ పదో గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్‌షిప్ సమ్మిట్-2017 సందర్భంగా వచ్చే నెల సెప్టెంబర్ ఐదున ఈ అవార్డును అందజేయనున్నారు. హరిత విప్లవ పితామహుడిగా ప్రఖ్యాతి పొందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత స్వామినాథన్ అధ్యక్షతన 20 మంది సభ్యులతో కూడిన కమిటీ అవార్డుకు కేసీఆర్‌ను ఎంపిక చేసినట్టు ఐసీఎఫ్ఎ(ఇక్ఫా) చైర్మెన్ ఎంజే ఖాన్ తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం మీడియాకు తెలియజేసింది. అయితే సంస్థ పూర్వాపరాలు తెలుసుకోకుండానే అది ప్రభుత్వ సంస్థే నిర్ధారణకు వచ్చి సీఎంకు చెప్పకుండానే అవార్డు స్వీకరణకు సమ్మతిని పంపినట్టు తెలిసింది. అసలు విషయాలు తెలుసుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ అవార్డు తీసుకోవడానికి వెళ్లడం లేదు. అయితే స్వామినాథన్ నాకు కూడా కేసీఆర్‌ను ఎంపిక చేసినట్టుగా సంస్థ చైర్మెన్ చెబితేనే తెలిసింది. నాకు ఆ సంస్థ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలతో సంబంధం లేదు. అని చెప్పడం గమనార్హం. ఈ సంస్థ 2008 నుంచే ఈ అవార్డులను ఇస్తున్నది ఓ స్వచ్ఛంద సంస్థ హోదాలో అగ్రికల్చర్ టుడే మ్యాగజైన్ పేరిట అవార్డులు ఇచ్చేవాళ్లు. 2015లో ఇక్ఫా పేరిట కంపెనీని ప్రారంభించినా అది రిజిస్ట్రార్ రికార్డుల ప్రకారం ప్రయివేటు కంపెనీ. ఇందులో డైరెక్టర్‌లు కూడా ఏడెనిమిది కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. చివరికి ఇక్ఫా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంధవా స్పందిస్తూ ఇది సెక్షన్ 8 కంపెనీ, ఫిక్కీ, సీఐఐ లాగా, డుంపాంట్, నాగార్జున అగ్రికెమ్, కార్గిల్ వంటి కంపెనీలు ఆర్థికసాయం చేస్తాయి. స్వామినాథన్‌కు సంస్థలో ఏ పొజిషన్ లేదు అని అంగీకరించారు. ప్రయివేటు , బహుళజాతి విత్తన కంపెనీలు, ఫెస్టిసైడ్ కంపెనీల సాయంతో నడిచే ఓ ఆర్గనైజేషన్ ఇచ్చే అవార్డు గురించి ఇంత గొప్పగా ప్రభుత్వం, టిఆర్ఎస్‌నేతలు ప్రచారం చేసుకోవడం వివాదాస్పదమైంది. దాసోజ్ శ్రవణ్ కంపెనీని ఫేక్ కంపెనీతో పోల్చారు.ఉద్యోగుల జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్న కంపెనీ 2015లోనే గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్ షిప్ అవార్డును శివరాజ్ చౌహాన్‌కు ఎలా ఇచ్చారని రాందవాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. అంతపెద్ద ప్రోగ్రాం చేయడానికి ఎలాంటి ఖర్చులేకుండా ఎలా నిర్వహించారో చెప్పాలని, ఈ అవార్డు ఫంక్షన్లకు ఎవరు డబ్బులు ఇస్తున్నారో తేలాలని అన్నారు. ఈ అవార్డు ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

ఏప్రిల్ 13 నుంచి వేసవి సెలవులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఎట్టకేలకు 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. జూన్1, 2018 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరాన్ని ఏప్రిల్ 12 వరకు పాఠశాలలు కొనసాగించి, 13 నుంచి వేసవి సెలవులు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ప్రతి ఏటా ఏప్రిల్ చివరి వారంలో పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చి, జూన్ 12న నూతన విద్యాసంవత్సరం ప్రారంభించే వారు. దీంతో జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాయి. దీంతో షెడ్యూల్‌లో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

త్వరలో కరీంనగర్, గోదావరిఖనికి మినీ బస్సులు

- టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ జివి రమణారావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ప్రవేశపెట్టిన మినీ బస్సు సర్వీసుల్ని (వజ్ర) విస్తరించినట్టు ఆ సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ జివి రమణారావు తెలిపారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా హైదరాబాద్ నుంచి వరంగల్, నిజామాబాద్ పట్టణాలకు నడుస్తున్న వజ్ర బస్సు సర్వీసుల విస్తరణలో భాగంగా కరీంనగర్, గోదావరిఖని ప్రాంతాలకు త్వరలో నడపనున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని, అలాగే కరీంనగర్, గోదావరిఖని నుంచి కూడా నడుస్తాయని పేర్కొన్నారు. గతంలో ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారానే టిక్కెట్ల బుకింగ్ సౌకర్యం ఉండగా, ఇప్పుడు బస్సులో కూడా ప్రయాణీకులు టిక్కెట్లు తీసుకొనే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ బస్సులు ఆయా ప్రాంతాల్లో వివిధ కాలనీల నుంచి నడుస్తాయని తెలిపారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి 'జంప్'

- టచ్‌లో 8 మంది మంత్రులు, 15 మంది ఎమ్మెల్యేలు
- గులాబీ దళంలో కాంగ్రెస్ కోవర్టులు :భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీల నుంచి తమ పార్టీలోకి భారీ వలసలు రానున్నాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ వలసలతో రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారబోతుందని చెప్పారు. ఆయా పార్టీల నుంచి తమతో టచ్‌లో ఉన్నారని, ముఖ్యంగా టీఆర్ఎస్ 7,8 మంది మంత్రులు కూడా సుముఖంగా ఉన్నట్టు తెలిపారు. సరైన సమయంలో వారు తమ పార్టీలోకి వస్తారని తెలిపారు. గులాబీ దళంలో తమ కోవర్టులు ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. తెలంగాణలో టీడీపీ పరిస్థితి బాగా లేకపోవడంతో ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు, వరంగల్‌కు చెందిన మహిళా నాయకులు కూడా కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్టు చెప్పారు. ఖమ్మం, మెదక్,రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వలసలు ఎక్కువగా ఉంటాయన్నారు. టీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలకు, నియంతృత్వ దోరణిలకు విసిగివేసారి పోయారని చెప్పారు.

గవర్నర్ తప్పడు ప్రచారంపై తమ అభ్యంతరం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండియన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ రందవకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసోజు శ్రవణ్ ప్రతి లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు ఇండియన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ గ్లోబల్ లీడర్ షిప్ అవార్డు 2017 ఇవ్వడంపై దాసోజు తీవ్రమైన విమర్శలు చేశారు. సదరు సంస్థ దానికి స్పందిస్తూ వివరణ ఇవ్వాలంటూ దాసోజుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ రందవ లేఖ రాశారు. న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. దీనిపై దాసోజు స్పందిస్తూ ప్రతి లేఖ రాశారు.

శ్రీకాంత్ మృతికి కారణమైన రఘువీరారెడ్డిపై చర్యలు తీసుకోండి డీజీపీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

ఆసిఫాబాద్ పట్టణంలో పంచాతీయరాజ్(పీఆర్) శాఖలో ఏఈఈగా పని చేస్తున్న డి శ్రీకాంత్ మృతికి కారణమైన పంచాయతీరాజ్ ఈఈ రఘువీరారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు మల్లు రవి, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ మంగళవారం డీజీపీని కోరారు. రఘువీరారెడ్డి వేధింపులు తట్టుకోలేకనే యువ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నారని వారు పేర్కొన్నారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఉద్యోగ జేఏసీ నేతల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగ జేఏసీ నేతలు మంగళవారం హైదరాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్, టీజీవో అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ తలపెట్టిన కార్యక్రమాల్లో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఈనెల 30న ఉద్యోగులందరూ గృహకల్ప భవన్‌లో చేపట్టే ర్యాలీలో పాల్గొనాలని చెప్పారు. వచ్చేనెల 1న ఎస్-ఎస్‌సీ బోర్డు కార్యాలయంలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేయాలని అన్నారు. సీపీఎస్ విధానానికి స్వస్తి పలికే విధంగా ఉద్యోగులు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవో నగర నాయకులు జి వెంకటేశ్వర్లు, ఎమ్ లక్ష్మినారాయణ, టీఎన్జీవో నేతలు ప్రతాప్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల డిప్యూటేషన్ రద్దు చేయాలి'

కమిషనర్‌కు ఎస్ఎంసీ కమిటీ వినతి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పెద్దపల్లి జిల్లాలోని బ్రాహ్మణపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆ పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్ఎంసీ), తెలంగాణ పేరెంట్స్ కమిటీ ప్రభుత్వాన్ని కోరాయి. మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌ను ఆయా కమిటీల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో 28 మంది విద్యార్థులున్నారనే పేరుతో పాఠశాలను కొద్దిరోజుల క్రితం మూసివేశారనీ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన ఫలితంగా ఆగస్టు 21న తిరిగి పాఠశాలలను ప్రారంభించారని చెప్పారు. అయితే టీచర్ల డిప్యూటేషన్లను మాత్రం రద్దు చేయలేదనీ, దీంతో కేవలం ప్రధానోపాధ్యాయుని తోనే పాఠశాల కొనసాగుతున్నదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, బ్రాహ్మణపల్లి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.


అఫ్ఘాన్‌లో అమెరికా సైనికులు (ఫైల్)

అఫ్ఘాన్‌పై అంతులేని ఖర్చు !

వైమానికదళం, స్పెషల్‌వింగ్ విభాగాలకు వేల కోట్లు విడుదల

వాషింగ్టన్ : అఫ్ఘాన్ యుద్ధంలో అమెరికా ఖర్చు పెరగటమేగానీ, తగ్గటం లేదు. అక్కడ సైనిక ఆపరేషన్లు నిర్వహిస్తున్న వైమానిక దళానికి, స్పెషల్ వింగ్ విభాగాలకు 727 మిలియన్ డాలర్ల (సుమారుగా రూ.4654 కోట్లు) మొత్తాన్ని తాజాగా విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ వచ్చిన తర్వాత, అఫ్ఘాన్ విషయంలో ఇంతపెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయటం ఇదే మొదటిసారి. ఆఫ్ఘాన్ యుద్ధంలో వైమానిక దళానికి, స్పెషల్ వింగ్ హెలికాప్టర్స్, ఇతర విమానాలకు సంబంధించి సాంకేతిక సాయం, ఇంజనీరింగ్, సిస్టమ్ ఇంటిగ్రేషన్...మొదలైన పనుల కోసం ఈ నిధుల్ని ఖర్చు చేయనున్నారు. ఇందుకోసం రక్షణ రంగానికి చెందిన 'లిడోస్ ఇన్నోవేషన్' అనే కంపెనీకి పనులు అప్పగిస్తూ కాంట్రాక్ట్ కుదిరిందని 'పెంటగాన్' తాజాగా ఒక ప్రకటన చేసింది.

అఫ్ఘాన్ యుద్ధంలో 2002 నుంచి ఇప్పటిదాకా కేవలం ఆయుధాలు, ఇతర పరికరాలపై 76 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.48 వేల కోట్లు)ను అమెరికా ఖర్చు పెట్టింది. అఫ్ఘాన్‌లో చేస్తున్న ఖర్చుపై 'అమెరికా గవర్నమెంట్ ఎకౌంటబిలిటీ ఆఫీస్' (జీఏఓ) ఇటీవలే ఒక నివేదిక విడుదల చేసింది. రైఫిల్స్, పిస్తోళ్లు...మొదలైన ఆయుధాల్ని 6 లక్షల వరకు అఫ్ఘాన్ ఆర్మీ, పోలీసులకు వాషింగ్టన్ అందజేసిందని 'జీఏఓ' నివేదిక పేర్కొన్నది. 'నేషనల్ ప్రయారిటీస్ ప్రాజెక్ట్' (ఎన్‌పీపీ) అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఫెడరల్ బడ్జెట్‌పై పలు నివేదికలు తయారుచేసింది. అందులో అఫ్ఘాన్ యుద్ధంలో ఖర్చు గురించి 'ఎన్‌పీపీ' ఏమన్నదంటే..."అఫ్ఘాన్ యుద్ధంలో 780 బిలియన్ డాలర్లను అమెరికా ఖర్చు చేసింది. దీనినిబట్టి ఇది అంత తొందరగా ముగిసే యుద్ధం కాదని అర్థమవుతున్నది. కనుచూపుమేరలో కూడా ఆఫ్ఘాన్ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనపడటంలేదు. అమెరికా పౌరుడు చెల్లించే పన్నుల్లో పెద్ద మొత్తాన్ని ఇక్కడ వెచ్చిస్తున్నా"మని పేర్కొన్నారు.

జుకర్‌బర్గ్ కూతురు పేరు 'ఆగస్ట్'

శాన్‌ఫ్రాన్సిస్కో: ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌కు పుత్రికోత్సాహం కలిగింది. ఆయన భార్య ప్రిని ల్లాచాన్ సోమవారం పండంటి పాపకు జన్మనిచ్చింది. జుకర్ దంపతులు ఆ పాపకు 'ఆగస్ట్' అని పేరు పెట్టుకున్నారు. ఈ ఆనందకర విషయాన్ని జుకర్ తన ఫేస్‌బుక్ పేజ్ ద్వారా పంచుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారి ఆగస్ట్‌కు ప్రేమతో జుకర్ లేఖ రాశారు.

ఉత్తరకొరియా మరో క్షిపణి ప్రయోగం





ప్యాంగ్యాంగ్ : ఉత్తర కొరియా తాజాగా మరో క్షిపణి పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. మంగళవారం ఉదయం మధ్యస్థాయి బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించింది. ఇది జపాన్ మీదుగా ప్రయాణించి హోక్కైడో ఉత్తర ప్రాంతంలోని సముద్ర జలాల్లో పడిపోయింది. ఈ క్షిపణి ప్రయోగంపై దక్షిణ కొరియా, జపాన్ దేశాధినేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరకొరియా ప్రయోగించిన క్షిపణి.. ఇటీవల అభివృద్ధి చేసిన మధ్యంతర స్థాయి క్షిపణి హ్వసాంగ్-12 అయి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది 3 వేల మైళ్ల దూరంలోని లక్ష్యాలను ఛేదిస్తుందని.. అమెరికా సైనికస్థావరం ఉన్న గువాం దీవిని సులువుగా చేరుకోగలదని అంచనా వేస్తున్నారు. ఉత్తర కొరియా ఇటీవల వరుస క్షిపణి ప్రయోగాలకు దిగుతున్న ప్పటికీ జపాన్ భూభాగం లక్ష్యంగా ప్రయోగాలు చేపట్టడం అరుదు. తాజా క్షిపణి ప్రయోగంపై జపాన్ ప్రధాని షింజో అబే మండిపడ్డారు. "ఉ.కొరియా జపాన్‌పై ఇలాంటి రెచ్చగొట్టే చర్యలు చేయడం గతంలో జరగలేదు. ఇది మా దేశానికి తీవ్రమైన ముప్పుగా పరిగణిస్తున్నాం. ఉత్తర కొరియాపై చర్యలు తీసుకునేందుకు తక్షణం ఐక్యరాజ్య సమితి సమావేశం ఏర్పాటు చేయాలి. ఈ క్షిపణి ప్రయోగం ఐరాస తీర్మానాలను ఉల్లంఘించడమే. మేం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని అన్నారు.

సరిహద్దులో బాంబుల వర్షం కురిపించిన ద.కొరియా

ఉ.కొరియా సరిహద్దులకు సమీపంలో ద.కొరియా బాంబుల వర్షం కురిపించింది. ద.కొరియా చేపట్టిన సైనిక విన్యాసాల్లో భాగంగా ఈ దాడులను చేసింది. ఉ.కొరియా మంగళవారం క్షిపణి ప్రయోగాన్ని చేసిన గంటల వ్యవధిలోనే ద.కొరియా బాంబులతో దాడి చేయడం గమనార్హం.

ద.కొరియా ఎఫ్-15కే ఫైటర్ జెట్స్ నుంచి దాదాపు ఎనిమిది బాంబులను ఉ.కొరియా సరిహద్దుకు సమీపాన ఉన్న తైబేక్ ప్రాంతంలో వేసింది. దీని గురించి ద.కొరియా విదేశాంగశాఖ మంత్రి కంగ్ క్యుంగ్-వా మాట్లాడారు. యుద్ధ సన్నాహాల్లో భాగంగానే బాంబింగ్ డ్రిల్ జరి పామ న్నారు. ఉ.కొరియా పట్ల ద.కొరియా విధానాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారని ఆయన చెప్పారు.

పరిస్థితిపై చైనా ఆందోళన

- సంయుక్త సైనిక విన్యాసాలతో రెచ్చగొట్టడం వల్లే ఇదంతా..

కొరియా ద్వీపకల్పంలో పరిస్థితి తీవ్రస్థాయికి చేరటం చైనాను ఆందోళనకు గురిచేస్తున్నది. పరిస్థితి ఇంతదాకా రావడానికి కారణం అమెరికా, దక్షిణ కొరియా చేపట్టిన చర్యలేనని చైనా విమర్శించింది. అమెరికా, దాని మిత్ర దేశాలు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున సంయుక్త సైనిక విన్యాసాలు జరపటం, తరుచూ రెచ్చగొట్టడం వల్లే ఉత్తర కొరియా క్షిపణి పరీక్షల దిశగా అడుగులు వేయడానికి దారి తీసిందని చైనా అభిప్రాయపడింది. ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అమెరికా- దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు ప్రతిస్పందనగా ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలను చేపట్టింది. వరుసగా జరుగుతున్న ఈ పరిణామాలు పరిస్థితిని తీవ్రస్థాయికి చేర్చిందని వ్యాఖ్యానించారు. కొరియాలో శాంతిని, స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు ఆయా దేశాలు (అమెరికా, దక్షిణ కొరియా, ఉత్తరకొరియా) కృషిచేస్తాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఉత్తర కొరియాపై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా, దక్షిణ కొరియాలు వరుసగా సంయుక్త సైనిక విన్యాసాలు చేయడాన్ని తప్పుబట్టారు. అసలు ఆ రెండు దేశాలు శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నాయా? అంటూ ప్రశ్నించారు. ఒత్తిడి తీసుకురావడం, ఆంక్షలు విధించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, శాంతి చర్చలు జరగాలని సూచించారు.

అమెరికా పర్యటనలు రద్దు!

- పాక్ ద్వైపాక్షిక చర్చలు జరపదని 'డాన్' పత్రిక కథనం

ఇస్లామాబాద్: ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచిపోషిస్తున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ నిరసన వ్యక్తం చేసింది. ట్రంప్ వ్యాఖ్యలకు నిరసనగా అమెరికాతో ద్వైపాక్షిక చర్చలను, అమెరికా పర్యటనలను రద్దు చేసుకుంటున్నట్టు 'డాన్' పత్రిక కథనం పేర్కొన్నది. ఇరు దేశాల మధ్య ప్రతినిధుల రాకపోకలను కూడా పాక్ నిలిపివేస్తున్నట్టు ఇందులో తెలియజేశారు. అఫ్ఘాన్‌పై అమెరికా విధాన ప్రకటన సందర్భంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

విద్యాసంవత్సరం కోల్పోవాల్సిందేనా?

- కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశమివ్వండి
- ఉన్నత విద్యామండలి వద్ద విద్యార్థుల ఆందోళన
- కొత్త వారికి ఇచ్చేది లేదంటున్న దోస్త్ అధికారులు
- సీటు రాని వారికే ఆప్షన్ల వెసులుబాటు : పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో నెలకొన్న గందరగోళం ఇంకా కొనసాగుతూనే ఉంది. సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, కొందరు తల్లిదండ్రులు తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్), ఉన్నత విద్యామండలి కార్యాలయానికి వస్తూనే ఉన్నారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ డిగ్రీ ఆన్‌లైన్‌కు దరఖాస్తు చేసుకోలేదని కొందరు, కాలేజీ మార్చుకునేందుకు ఇంకొందరు, కాలేజీలో చేరి ఆ సీటు రద్దు చేసుకోవడంతో టోకెన్ నెంబర్ క్యాన్సల్ అయ్యిందని మరికొందరు ఇలా వివిధ కారణాలతో అధికారులకు విన్నవించారు. కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశమివ్వాలని కోరుతున్నారు. అవకాశమివ్వకపోతే విద్యాసంవత్సరం కోల్పోతామని కొందరు మీడియా ముందు కన్నీరు మున్నీరయ్యారు. తాము విద్యాసంవత్సరం కోల్పోవాల్సిందేనా?అని ప్రశ్నించారు. ఇంకొందరు నచ్చిన కాలేజీలో సీటు రాలేదని, కాలేజీ మార్చుకునేందుకు ఎందుకు అవకాశం కల్పించడం లేదని అడిగారు. నచ్చిన కాలేజీలో చేరేందుకు అవకాశం కల్పించాలని, ఆన్‌లైన్ విధానం వద్దని కొందరు డిమాండ్ చేశారు. స్పాట్ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తే తమకు నచ్చిన కాలేజీలో చేరుతామని విద్యార్థులు అన్నారు. ఇలా ఒక్కొక్కరి సమస్యలను ఒక్కో విధంగా అధికారులకు చెప్పడంతోపాటు మీడియాకు వివరించారు. నాలుగో విడతలో వెబ్‌ఆప్షన్ల నమోదుకు మంగళవారం గడువు ముగియనుంది. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, సీజీజీ అధికారులు చక్రధర్, శ్రీధర్, రూసా అధికారులు లింబాగౌడ్, వసుంధర సమావేశమయ్యారు. అనంతరం పాపిరెడ్డి తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ ఆన్‌లైన్ ప్రక్రియలో కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదని స్పష్టం చేశారు. కాలేజీ మార్చుకునేందుకు స్లైడింగ్ అవకాశమూ కల్పించడం లేదన్నారు. ఇప్పటి వరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు పొందని విద్యార్థులకే వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. ఈనెల 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే విద్యాసంవత్సరంలో ఇబ్బందులొస్తాయని అన్నారు. సెమిసర్ పరీక్షలపై ప్రభావం పడుతుందని, తరగతులకు ఇబ్బంది వస్తుందని చెప్పారు. సీజీజీ చేసిన పొరపాట్లను గుర్తించి విద్యార్థులకు నష్టం కలగకూడదనే నాలుగో విడతకు అవకాశం కల్పించామని వివరించారు. విద్యార్థులంటే తమకు వ్యతిరేకత లేదన్నారు. ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ ఇబ్బందుల దృష్ట్యా సెప్టెంబర్‌లో జరగాల్సిన మొదటి ఇంటర్నల్ పరీక్షలను అక్టోబర్ 5,6,7 తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు.

1.87 లక్షల మంది చేరిక : లింబాద్రి

డిగ్రీ కాలేజీల్లో మూడోవిడత పూర్తయ్యేనాటికి 1,87,368 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరారని దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి చెప్పారు. నాలుగో విడత తర్వాత మరింత మంది విద్యార్థులు చేరుతారని అన్నారు. గత విద్యాసంవత్సరంలో డిగ్రీ కాలేజీల్లో 2.13 లక్షల మంది చేరారని వివరించారు. అందులో దోస్త్ ద్వారా 1.90 లక్షల మంది చేరారని అన్నారు. గురుకులాల్లో మూడు వేల మంది ప్రవేశాలు పొందారని చెప్పారు. మిగిలిన 20 వేల మంది కోర్టు ద్వారా అనుమతి పొందిన కాలేజీల్లో చేరారని అన్నారు. ఈ విద్యాసంవత్సరంలోనూ దోస్త్ ద్వారా చేరే వారి సంఖ్య 1.90 లక్షలు దాటుతుందని చెప్పారు.

విద్యార్థులతో సర్కారు ఆటలు : కొనగాల మహేశ్

తెలంగాణ రాష్ట్ర డిగ్రీ విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రహసనంగా మారిందని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ విమర్శించారు. ఉన్నత విద్యామండలి తలాతోకలేని విధానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. డిగ్రీ విద్యార్థులతో సర్కారు ఆటలాడుతోందన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మూడవ దశ అడ్మిషన్లలో అనేక తప్పులు జరిగాయని చెప్పారు. విద్యార్థులు తమ ఇష్ట ప్రకారం గ్రూపులు మార్చుకునేందుకు కళాశాలలు డిలీట్ ఆప్షన్ ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా 4వ అడ్మిషన్ల సమయం పొగిడించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసిందని ఆయన విమర్శించారు.



క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- సాట్స్‌చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

చిన్న పట్టణంలో జన్మించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్ఠలు సంపాదించిన ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు,యువత ఆదర్శంగా తీసుకోవాలని సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గచ్చిబౌలిలో జాతీయ క్రీడల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్టేడియంలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ... క్రీడాకారులకు కావాల్సిన వసతులు, సహాయ సహకారాలను తెలంగాణ ప్రభుత్వం తరపున అందిస్తామని చెప్పారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ... గచ్చిబౌలిలో స్టేడియంలో మరుగుదొడ్ల పరిశుభ్రత, పెరిగిన గడ్డిని తొలగించుట, స్టేడియంలోకి పందులు మరియు కుక్కలు లాంటి జంతువులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. క్రీడాదినోత్సవం సందర్భంగా హాకీపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ దినకర్‌బాబు, అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్‌తో పాటు క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజులతోనే క్రీడల నిర్వహణ

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలను విద్యార్థుల నుంచి వసూలు చేసే స్పోర్ట్స్ ఫీజు ద్వారానే నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన డీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. 'ఓన్లీ సెలక్షన్స్' శీర్షికతో ఈ నెల 21న 'నవతెలంగాణ'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. విద్యాశాఖ నిధులు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు ఆటలు ఆడించకుండా, సెలక్షన్స్ మాత్రమే చేస్తున్నరని కథనం వివరించింది. అయితే ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ నుంచి నిధులు ఇస్తున్నామని కమిషనర్ చెప్పారు. అవి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలకు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. పాఠశాల, మండల, డివిజన్ స్థాయి పోటీలకు జీవోనెంబర్ 94 ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ బడులకు చెందిన విద్యార్థుల నుంచి రుసుములు వసూలు చేసి, వాటిలోంచి ఖర్చు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వసూలు చేస్తున్నారని, దానిలో రూ.14 స్థానిక పాఠశాలలో ఆటల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారనీ, మిగిలిన రూ.6 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా శాఖకు అప్పగిస్తున్నారని ఉదహరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు తప్పనిసరిగా నిర్వహించాలని డీఈఓలను ఆదేశించారు. చైల్డ్‌ఇన్ఫో ఆధారంగా నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి స్పోర్ట్స్‌ఫీజు వసూలు చేయాలని సూచించారు.

కోదండరామ్‌ను కరివేపాకులా వాడుకుంటున్నారు..

- కాంగ్రెస్‌పై వేణుగోపాలచారి ఆరోపణ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కాంగ్రెస్ నేతలు జేఏసీ చైర్మెన్ కోదండరామ్‌నుకరివేపాకులా వాడు కుంటున్నారని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణు గోపాలచారి ఆరోపించారు. తెలం గాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కోదం డరామ్ ఉంటే సమావేశాల్లో, సభల్లో ప్రజలు వస్తారన్న భ్రమల్లో ఆ పార్టీ నేతలు న్నారని అన్నారు. టీఆర్ఎస్ చేరే వరకూ జేఏసీ బలపడలేదన్న విష యాన్ని గుర్తుంచు కోవాలన్నారు. ఇక కేసీఆర్‌కు గ్లోబల్ అగ్రికల్చర్ అవార్డు వస్తే కాంగ్రెస్ నేతలు ఓర్వలేక పోతున్నారని ఆరోపించారు. వ్యవ సాయ శాఖను కేసీఆర్ మొత్తం ప్రక్షాళన చేశారని చెప్పారు. సమగ్ర సర్వే అనంతరం కమతాలు, క్రాప్ కాలనీలు పెరిగాయని చెప్పారు.

నవచిత్రం


నయనతార

సరికొత్త మహిళా ప్రధాన చిత్రంలో..


దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు నయనతార కేరాఫ్‌గా నిలుస్తున్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఓ పక్క కమర్షియల్ చిత్రాలు చేస్తూనే అవకాశం వచ్చినప్పుడల్లా మహిళా ప్రాధాన్యత కలిగిన పాత్రలు పోషిస్తూ తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. స్టార్ హీరోలకు దీటుగా స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నయనతార తాజాగా మరో మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తమిళంలో లైకా ప్రొడక్షన్‌లో రూపొందే 'కోకో' చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రాన్ని ఇటీవల చైన్నైలో చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ లాంచ్ చేసింది. నెల్సన్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో నయనతార పాత్ర తీరుతెన్నులు చాలా శక్తివంతంగా ఉంటాయట. అంతేకాదు సరికొత్తగా ఉంటుందని, మొదటిసారి ఓ కొత్త నయనతారని ఈ చిత్రం ద్వారా చూడనున్నారని చిత్ర నిర్మాతలు తెలియజేస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుద్ రవిచంద్రన్ సంగీతం సమకూరుస్తున్నారు. నయనతార ప్రస్తుతం తెలుగులో బాలకృష్ణ 102వ చిత్రంలో, చిరంజీవి సరసన 'సైరా నరసింహారెడ్డి'తోపాటు తమిళంలో 'ఇమైక్కా నోడిగల్', 'కోలైయుథిర్ కాలమ్', 'అరామ్మ్', 'వెలైక్కరన్' వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

క్రేజీ కాంబినేషన్


రామ్‌చరణ్, బోయపాటి శ్రీను

'బ్రూసలీ' తర్వాత విభిన్న కథా చిత్రాలను చేసేందుకు రామ్ చరణ్ ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న 'రంగస్థలం' చిత్రంలో నటిస్తున్న ఆయన తదుపరి చిత్రం బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఉంటుందని తెలుస్తుంది. రామ్‌చరణ్ నెక్స్ట్ చిత్రం మణిరత్నం దర్శకత్వంలో ఉంటుందని గతంలో వార్తలు వినిపించాయి. కానీ దీనిపై అటు మణిరత్నం నుంచి గానీ, ఇటు చరణ్ నుంచి గానీ క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో 'సరైనోడు', 'జయ జానకి నాయక' వంటి మాస్ కమర్షియల్ సినిమాలతో ఆకట్టుకున్న బోయపాటి దర్శకత్వంలో పక్కా కమర్షియల్ సినిమా చేసే ఆలోచనలో చరణ్ ఉన్నారట. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మించనున్నట్టు తెలుస్తుంది. సుకుమార్ దర్శకత్వంలో చరణ్ నటిస్తున్న 'రంగస్థలం 1985' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇందులో ఆయన సరసన సమంత హీరోయిన్‌గా నటిస్తుంది.

రాజుగారి గది 2 ఫస్ట్‌లుక్


'రాజుగారి గది 2'లో నాగార్జున

నాగార్జున ప్రధాన పాత్రలో నటిస్తున్న 'రాజుగారి గది 2' చిత్ర ఫస్ట్‌లుక్ విడుదలైంది. నాగార్జున పుట్టినరోజు(మంగళవారం) సందర్భంగా నటి సమంత ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. 'ఆయన రాజే ఎందుకంటే.. తనను తాను ఎలా మలుచుకోవాలో ఆయనకు తెలుసు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ నా మామ గొప్పగా తయారవుతున్నారు' అంటూ ఈ ట్వీట్‌లో పేర్కొంది. దీనికి నాగార్జున స్పందిస్తూ, 'ధన్యవాదాలు ప్రియమైన కోడల.. యు ఆర్ ది బెస్ట్' అని ట్వీట్ చేశారు. విడుదలైన ఫస్ట్‌లుక్‌లో నాగార్జున రుద్రాక్షమాలను పట్టుకుని చాలా స్టయిలీష్‌గా కనిపిస్తున్నారు. ఓంకార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నాగార్జునతో పాటు సమంత, సీరత్ కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పీవీపీ, మాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై ప్రసాద్ వి.పొట్లూరి నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు.

మాఫియా డాన్‌గా


శర్వానంద్

'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు', 'శతమానం భవతి', 'రాధ' ఇలా దేనికదే భిన్నమైన సినిమాల్లో నటించి వరుస విజయాలను అందుకుంటున్నాడు శర్వానంద్. ప్రస్తుతం ఓ భిన్న పాత్రతో రాబోతున్నాడు. ఈ నేపథ్యంలో త్వరలో ఆయన మాఫియా డాన్‌గా మారబోతున్నట్టు తెలుస్తుంది. మారుతి దర్శకత్వంలో నటిస్తున్న 'మహానుభావుడు' తర్వాత సుధీర్ వర్మ దర్శకత్వంలో నటించబోతున్నాడు శర్వానంద్. ఇందులో ఆయన మాఫియా డాన్‌గా కనిపిస్తాడని తెలుస్తుంది. కమల్ హాసన్ నటించిన 'నాయకుడు' సినిమా స్ఫూర్తితో దర్శకుడు సుధీర్ వర్మ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నాడట. ఇందులో శర్వానంద్ పాత్ర మాఫియా డాన్‌ను పోలి ఉంటాయని తెలుస్తుంది. 'మహానుభావుడు'లో శర్వానంద్ సరసన మెహరీన్ కథానాయికగా నటిస్తుంది. ఇందులో శర్వానంద్ అతి శుభ్రత పాటించే కుర్రాడిగా కనిపించనున్నాడు.


రాజమౌళి, విజయ్ దేవరకొండ

క్రెడిట్ అంతా దర్శకుడిదే

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'అర్జున్‌రెడ్డి' చిత్రానికి ఇండస్ట్రీ నుంచి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. నాగార్జున, కేటీఆర్ వంటి ప్రముఖులు సినిమాను ప్రశంసించారు. తాజాగా రాజమౌళి, రానా కూడా అభినందించారు. 'ఇప్పుడే 'అర్జున్‌రెడ్డి' సినిమా చూశా. ప్రేమ కథలు తెరకెక్కించడం నా తరం కాదు. అయినా ఈ సినిమాను ప్రశంసించకుండా ఉండలేను. అర్జున్ పాత్రలో విజయ్ దేవరకొండ జీవించేశాడు. అతనే కాదు నటి షాలిని, మిగతా నటీనటులు కూడా చాలా బాగా నటించారు. డైలాగులు కూడా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రెడిట్ అంతా దర్శకుడు సందీప్ వంగాదే. చిత్రబృందాన్ని చక్కగా హ్యాండిల్ చేయగలిగాడు' అని రాజమౌళి ట్వీట్ చేయగా, 'ఫైనల్‌గా సినిమా చూశా. సెకండ్ హాఫ్‌లో చిన్న లోపాలున్నా విజయ్ దేవరకొండ అవుట్‌స్టాండింగ్ నటనను కనబరిచాడు. బాగా చేశావ్ బ్రదర్. ఇలాంటి మంచి సినిమాలు చేయాలి' అని రానా తెలిపారు.

మరోసారి నిర్మాతగా?


నాని

'ఢీ ఫర్ దోపిడీ' చిత్రానికి సహ నిర్మాతగా మారిన నాని మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఓ షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఓ నవ్యమైన చిత్రాన్ని నిర్మించేందుకు రెడీ అవుతున్నారు. దేశంలోనే తొలిసారిగా వర్చువల్ ఆడియో టెక్నాలజీతో 'డైలాగ్ ఇన్ ది డార్క్' అనే లఘు చిత్రాన్ని రూపొందించిన ప్రశాంత్ చెప్పిన లైన్‌కి బాగా ఇంప్రెస్ అయిన నాని ఈ సినిమాను నిర్మించడానికి ప్లాన్ చేసుకుంటున్నాడు. మరి ఇందులో హీరోగా నాని నటిస్తాడా? లేదా?అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. నాని 'ఎంసీఏ', 'కృష్ణార్జునయుద్ధం'లో నటిస్తున్నాడు.


శ్రియా

రైటర్‌గా..!

శ్రియా..17ఏండ్ల కెరీర్‌లో 50కిపైగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి మెప్పించింది. దాదాపు అగ్ర హీరోలందరితోనూ కలిసి నటించింది. ఇటీవల ఆమెకు ఛాన్స్‌లు తగ్గాయి. ఈ నేపథ్యంలో శ్రియా ఇప్పుడు రంగస్థలం, నాటకాలపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తుంది. ఓ సంగీత నాటకానికి సహ రచయితగా వర్క్ చేసేందుకు ప్లాన్ చేసుకున్నట్టు సమాచారం. 'నేను నటిగా రాణించకపోతే డాన్స్ ట్రైనర్‌గా పనిచేసేదాన్ని' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది శ్రియా. స్వతహాగా ఆమె కథక్ డాన్సర్. ఇతర డాన్సులు కూడా నేర్చుకుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఛాన్స్‌లు తగ్గడంతో ఇకపై రంగస్థలంపై దృష్టిసారించేందుకు ప్లాన్ చేసుకుంటుందట. శ్రియా ప్రస్తుతం బాలకృష్ణ సరసన 'పైసా వసూల్' చిత్రంలో నటిస్తుంది. ఈచిత్రం సెప్టెంబర్ 1న విడుదల కానుంది. దీంతోపాటు నారా రోహిత్, సుధీర్‌బాబు కాంబినేషన్‌లో వస్తున్న ఓ చిత్రంలోనూ హీరోయిన్‌గా నటిస్తుంది.

షారూఖ్ టాక్ షోలో కరణ్


కరణ్‌జోహార్, షారూఖ్ ఖాన్

బాలీవుడ్‌లో టాక్ షోలకు మంచి క్రేజ్ ఉంది. కరణ్ జోహర్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' ఎంతటి ఆదరణ పొందుతుందో తెలిసిందే. తాజాగా షారూఖ్ ఖాన్ ఓ కొత్త టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఓ అంతర్జాతీయ సంస్థ ఇండియాలో నిర్వహిస్తున్న 'టెడ్ టాక్స్ ఇండియా: నయి సోచ్' అనే షోకి షారూఖ్ ఖాన్ హోస్ట్‌గా ఉన్నారు. త్వరలో ప్రసారం కాబోయే ఈ కార్యక్రమానికి తొలి గెస్ట్ ఎవరన్నది ఇప్పటి వరకు ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో అది కాస్త రివీల్ అయ్యింది. దర్శకనిర్మాత కరణ్ జోహర్ మొదటి అతిథిగా ఈ షోలో పాల్గొనబోతున్నారు. ఈ విషయాన్ని కరణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా షారూఖ్‌తో ఉన్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

కథకే ఎగ్జైట్ అవుతా


గౌరీ షిండే

'కథ తప్ప మిగిలిన ఏ అంశాలు నన్ను ఎగ్జైట్ చేయవు. మంచి కథ దొరికితే దాన్ని ఏ ప్లాట్‌ఫామ్‌లోనైనా సినిమాగా తెరకెక్కించవచ్చు' అని అంటున్నారు దర్శకురాలు గౌరీ షిండే. 'ఇంగ్లీష్ వింగ్లీష్', 'డియర్ జిందగీ' చిత్రాలను రూపొందించి ఆకట్టుకున్నారామే. ఓ వేదికపై ఆమె మాట్లాడుతూ, 'డిజిటల్ వచ్చాక సినిమాను రూపొందించడం ఈజీ అయ్యింది. సినిమాను చాలా ప్లాట్‌ఫామ్స్‌లో తీయొచ్చు. కానీ వీటి కంటే నేను స్టోరీనే బాగా నమ్ముతాను. ఒక ఐడియా వస్తే, ఆ కథ బాగుంటే దాన్ని ఎన్ని ప్లాట్‌ఫామ్‌ల్లోనైనా తీయొచ్చు. ఎలా తీయాలనేది కథను బట్టి నిర్ణయించుకోవచ్చు. అంతేకానీ నన్ను డిజిటల్ వరల్డ్ ఎగ్జైట్ చేయదు. కేవలం కథ మాత్రమే ఎగ్జైట్ చేస్తుంది. దాని ఆధారంగానే కొత్తగా చేసేందుకు ప్రయత్నిస్తాను' అని తెలిపారు.

నవతరం ప్రేమ కథతో ఈగో


'ఈగో'లో సిమ్రాన్, ఆశిష్ రాజ్

ఆశిష్ రాజ్, సిమ్రాన్ జంటగా సుబ్రమణ్యం దర్శకత్వంలో వీకేఏ ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కరణ్, కౌసల్ కరణ్, అనిల్ కరణ్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఈగో'. రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'నవతరం ప్రేమ కథా చిత్రమిది. ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ రొమాంటిక్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. మూడో షెడ్యూల్ కోసం గోదావరి పరిసర ప్రాంతాలకు వెళ్ళనున్నాం. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కథానాయకుడి పాత్ర సరికొత్తగా ఉంటుంది. అనుకున్న దానికంటే ముందుగానే షూటింగ్ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఎక్కడా రాజీపడకుండా ప్రేక్షకులకు క్వాలిటీ ఔట్‌పుట్‌ను ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను విడుదల చేస్తాం' అని అన్నారు. దీక్షాపంత్, రావురమేష్, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, గౌతంరాజు, షకలక శంకర్, చంద్ర, వేణు, శిశన్నారాయణ, భద్రం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.


అజయ్ దేవగణ్, అజయ్ దేవగణ్,

మళ్ళీ ప్రేమికులుగా

అజయ్ దేవగణ్, కాజోల్ 1990–20 కాలంలో పలు విజయవంతమైన ప్రేమ కథా చిత్రాల్లో నటించి మెప్పించారు. ఈ ఇద్దరు మరోసారి కలిసి నటించబోతున్నారు. ప్రదీప్ సర్కార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో ప్రేమికులుగా నటించనున్నారు. ఈ చిత్రం ఫ్యామిలీ అనుబంధాలు, అందులోని సున్నితమైన అంశాలతో సాగుతుందట. ప్రస్తుతం 'బాద్‌షాహో', 'గోల్‌మాల్ ఎగైన్' చిత్రాల్లో నటిస్తున్నారు అజయ్ దేవగణ్.


వెంకటేష్, గురురాజ్, దివ్య, శశికాంత్, కిరణ్, నరేంద్రబాబు

డిఫరెంట్ హర్రర్‌గా మళ్ళీ వచ్చిందా

కిరణ్, దివ్య జంటగా కె.నరేంద్రబాబు దర్శకత్వంలో సీవీ ఫిల్మ్స్ పతాకంపై వెంకటేష్.సి నిర్మించిన చిత్రం 'మళ్ళీ వచ్చిందా'. గురురాజ్, శశికాంత్, కృష్ణమూర్తి సహనిర్మాతలు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్‌ను ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'హర్రర్ అనేది యూనివర్సల్ కంటెంట్. సినిమా బాగుంటే ఏ భాషా చిత్రాన్నైనా ప్రేక్షకులు ఆదరిస్తారు. కన్నడకు చెందిన దర్శకనిర్మాతలు తెలుగులో ఈ చిత్రాన్ని నిర్మించడం అభినందించాల్సిన విషయం. టైటిల్ బాగుంది. దీని క్యాప్షన్ ఇంకా బాగుంది' అని అన్నారు. 'దర్శకుడు నరేంద్రబాబు చెప్పిన కథ నచ్చి స్నేహితులమైన వెంకటేష్, శశికాంత్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాం. దర్శకుడు అనుకున్న దానికంటే ముందే సినిమాను పూర్తి చేశాడు. సినిమా చాలా బాగా వచ్చింది. ఆద్యంతం సస్పెన్స్‌గా సాగే ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని నిర్మాత గురురాజ్ తెలిపారు. దర్శకుడు నరేంద్రబాబు మాట్లాడుతూ, 'నేను కన్నడలో 7 సినిమాలు రూపొందించాను. తెలుగులో నిరూపించుకోవాలని ఈ చిత్రాన్ని రూపొందించా. హర్రర్ ప్రధానంగా సాగే చిత్రమిది. ఇందులో దెయ్యానికి రాత్రి, పగలు అంటూ తేడా లేదు. ఏ టైమ్‌లోనైనా వస్తుంది. గతంలో వచ్చిన సినిమాల్లో దెయ్యాలు ఆత్మల రూపంలో వచ్చేవి. కానీ ఇందులో మొబైల్ ఫోన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ఆ టైమ్‌లో సెల్‌కి ఓ డెత్ మెసేజ్ వస్తుంది. అది వచ్చిన వారిని చంపేస్తుంది. ఆద్యంతం సస్పెన్స్‌గా సాగే చిత్రమిది. ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తూనే వినోదాన్ని పంచుతుంది. సరికొత్తగా ఉండే ఈ సినిమా క్యూరియాసిటీతో సాగుతూ, ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. ఇందులో బ్లడ్ కనిపించదు, భయం మాత్రమే ఉంటుంది. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు. 'ఇందులో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు థ్యాంక్స్' అని హీరోహీరోయిన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.


'మా.. దేవుడు' లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో..

వడ్డే నవీన్, భూమిక ప్రధాన పాత్రధారులుగా ప్రభాకర్ వర్మన్ దర్శకత్వంలో శ్రీ హర్ష సినిమాస్ ప్రై.లి పతాకంపై రూపొందనున్న చిత్రం 'మా.. దేవుడు'. ఈ చిత్ర లోగోను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం సికింద్రాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రభాకర్ మాట్లాడుతూ, '2012 టైమ్‌లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నాం. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటం ప్రధానంగా సినిమా సాగుతుంది. వచ్చే నెల 15 నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం. ఈ చిత్రానికి శ్రీనివాస్ యర్రా కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.

భారీ పారితోషికం!


దీపికా పదుకొనె

హాలీవుడ్ చిత్రం 'ట్రిబులెక్స్: రిటర్న్స్ ఆఫ్ ది గ్జెండర్ కేజ్' చిత్రం తర్వాత గ్లోబల్ వైడ్‌గా పాపులర్ అయ్యింది బాలీవుడ్ నటి దీపికా పదుకొనె. ఈ చిత్రంతో ఆమె ఇమేజ్ ఒక్కసారిగా పెరిగింది. తన ఇమేజ్‌ను, పాపులారిటీని రెమ్యూనరేషన్ పరంగా క్యాష్ చేసుకుంటుంది దీపికా. ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న 'పద్మావతి' చిత్రానికి రికార్డు రెమ్యూనరేషన్ తీసుకుంటుంది. ఈ చిత్రానికి ఆమె ఏకంగా రూ.13కోట్లు పారితోషికంగా తీసుకోవడం ఓ విశేషమైతే.. సహ నటులు రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ కంటే ఇది ఎక్కువ కావడం మరో విశేషం. రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్‌లు ఈ చిత్రంలో నటిస్తుందుకు గానూ రూ. 10కోట్లు పారితోషికంగా తీసుకుంటున్నారు. పద్మావతిగా దీపికా పదుకొనె టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో షాహిద్ కపూర్ ఆమెకు భర్తగా రానా రావల్ రతన్ సింగ్ పాత్రలో, రణ్‌వీర్ సింగ్.. ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీగా నటిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రం నవంబర్ 17న విడుదల కానుంది.


రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్

మసాజ్‌తో మగపిల్లాడు

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన మహ్మద్ ముజఫర్ హుస్సేన్ కూతురు హబీబా ఫాతిమా(19)ను మొఘల్‌పురాకు చెందిన మహ్మద్ మన్సూర్ అలియాజ్ సైఫ్‌కు ఇచ్చి ఆగస్టు, 2016లో పెండ్లి చేశారు. మన్సూర్ దుబాయ్‌లో మంచి హోదాలో ఉద్యోగం చేస్తుండడంతో వారు అడిగిందల్లా ఇచ్చారు. 10 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.ఐదు లక్షలు, బట్టలు, ఇతర సామాగ్రి ఇచ్చారు. పెండ్లి అయిన 25 తర్వాత మన్సూర్ ఉద్యోగరీత్యా దుబాయ్‌కి వెళ్లిపోయాడు. ఇదిలావుండగా, ఫాతిమా గర్భవతి అయింది. భర్తతోపాటు ఫాతిమా అమ్మానాన్న ఎంతో సంతోషపడ్డారు. కానీ అత్తారింట్లో ఉన్న ఫాతిమాకు కష్టాలు మొదలయ్యాయి. మగబిడ్డనే కనాలంటూ మామ మహ్మద్‌సిద్ధికీ, అత్త సమీనా సుల్తానా, తోటి కోడళ్లు సాబా, జిబా, సైబా వేధించారు. మగబిడ్డను కనేవిధంగా వైద్యం చేయాలంటూ మొఘల్‌పురాకు చెందిన బురిడీబాబా, వైద్యుడు షేక్ అబ్దుల్ రహెమాన్‌ను కలిశారు.

మాంత్రికిని మాయాజాలం..

తన మంత్రశక్తులతో మగ పిల్లాడికి జన్మనించే విధంగా చేస్తానంటూ నమ్మించాడు. కొన్ని మంత్రాలు చేసి, మందులు ఇచ్చాడు. తీసుకోనని ఫాతిమా మొండికేయడంతో అత్తామామలు ఒత్తిడి చేసి ఇప్పించారు. ఆ తర్వాత ఓ నూనె తీసుకొచ్చిన బాబా ఫాతిమా పొట్టపై రాయడం మొదలుపెట్టాడు. దానికి ఒప్పుకోకపోవడంతో అత్తామామలతో బెదిరింపులు, వేధింపులకు గురిచేయించాడు. ఇదే అదునుగా భావించి మాంత్రికుడు అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఫాతిమా ఈ విషయాన్ని దుబాయ్‌లో ఉన్న భర్తకు చెప్పింది. కొన్నాండ్లపాటు దుబాయ్‌కి రమ్మనడంతో వెళ్లింది. అత్తారింట్లో జరిగిన విషయం, బాబా ప్రవర్తనపై వివరించింది. అయినా భర్త స్పందించలేదు. తిరిగి తన అమ్మానాన్నల వద్దకే పంపించాడు. కొన్నాళ్లు వైద్యం చేసిన బాబా మగపిల్లాడు పుడతాడని చెప్పి రూ.20 వేలు దండుకున్నాడు.

పురిటికోసం పుట్టింటికి

ప్రసవం కోసం ఫాతిమాను పుట్టింటికి పంపించారు. మగపిల్లాడితో రావాలంటూ అత్తామామ హుకూం జారీచేశారు. అయితే మే 15, 2017న పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. విషయం తెలుసున్న భర్త, అత్తామామలు కోపగించుకున్నారు. ఇంటికి రావొద్దంటూ హెచ్చరించారు. మగపిల్లాడిని కనలేదు కాబట్టి, రూ.10 లక్షలు తీసుకురావాలన్నారు. అత్తామామల వేధింపుల విషయం భర్తకు చెప్పినా పట్టించుకోకపోవడంతో న్యాయం చేయాలంటూ ఫాతిమా తల్లిదండ్రులు పెద్ద మనుషులను తీసుకెళ్లి వారితో మాట్లాడారు. పుట్టిన చిన్నపిల్లనైనా చూసి ఇంట్లోకి రానివ్వాలంటూ వేడుకున్నా కనికరించలేదు. బాబా చెప్పినట్టు చేయకపోవడంతోనే ఆడపిల్ల పుట్టిందని, మా ఇంటికి రావొద్దంటూ వెళ్లగొట్టారు. దాంతో బాధితురాలు జూన్ 22న చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నచ్చజెప్పినా వినకుండా విడాకులు కావాలంటూ మహ్మద్ మన్సూర్ డిమాండ్ చేశాడు. దీంతో సౌత్‌జోన్ డీసీపీ నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలోనే మన్సూర్ ఫోన్లోనే ఫాతిమాకు 'తలాఖ్' అని చెప్పడంతో.. దుబాయ్‌లో ఉన్న అతనికి పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు పంపించారు.

మూఢవిశ్వాసాలు నమ్మొద్దు.. : డీసీపీ

మంత్రాలు, మందులు, ఆయిల్స్‌తో మగపిల్లలు పుట్టరని, మూఢ నమ్మకాలు నమ్మొద్దని సౌత్‌జోన్ డీసీపీ సత్యనారాయణ తెలిపారు. నకిలీ బాబాలు, వైద్యులపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. మగపిల్లాడు కావాలంటూ వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని డీసీపీ తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులకు రెండు వ్యవస్థలు

(మొదటీపేజీ తురువాయి)

పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి, రెవెన్యూ కార్యాలయాల్లో ఐటి అధికారుల నియామకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయం, నీటి పారుదల, మిషన్ భగీరథ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సంయుక్త సమీక్షా సమావేశాన్ని ముఖ్యమంత్రి మంగళవారం ప్రగతి భవన్ లో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తన్నీరు హరీశ్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.కె. జోషి, బి.ఆర్.మీనా, ముఖ్య కార్యదర్శి ఎస్. నర్సింగరావు, సీనియర్ అధికారి వాకాటి కరుణ, నీటి పారుదల ఈఎన్‌సీ మురళీధర్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యు సీఈ సత్యనారాయణ, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో గోదావరి, కృష్ణా నదుల ద్వారా అందుబాటులోకి వచ్చే జలాలను మంచినీరు, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక అవసరాల కోసం సమర్థంగా వాడుకునే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

"గోదావరి, క ష్ట నదులపై అనేక ప్రాజెక్టులు కడుతున్నాం. ఈ రెండు నదుల నీటితో రైతులకు సాగునీరు అందించడంతో పాటు మంచినీరు, పరిశ్రమలకు నీరు, విద్యుత్ ఉత్పత్తికి నీరు సరఫరా చేస్తున్నాం. ఈ నేపథ్యంలో నీటి విడుదలకు సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర రాజధాని నుంచి వచ్చే సూచనలు, ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలి. మిషన్ భగీరథ అధికారులు కూడా ఏ ప్రాజెక్టు నుంచి ఎన్ని నీళ్లు తీసుకుంటున్నాము? ఏఏ ప్రాంతాలకు ఎక్కడి నుంచి నీరు సరఫరా చేస్తున్నాము? అనే అంశాలపై స్పష్ట ఉండాలి. నీటి పారుదల, మిషన్ భగీరథ, విద్యుత్, పరిశ్రమల శాఖల అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకుని నదీ జలాల వాడకంపై అవగాహనకు రావాలి" అని సీఎం ఆదేశించారు. "ప్రాజెక్టుల నీటిలో మంచినీటికి అధిక ప్రాధాన్యమిస్తాం. ఇందుకోసం అన్ని రిజర్వాయర్లలో 10 శాతం నీటిని మంచినీటికి రిజర్వు చేశాం. ఆ నీటిని సమర్థంగా వాడుకోవాలి. వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. కాళేశ్వరం ద్వారా పాత వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందుతుంది. కాబట్టి మిషన్ భగీరథ అధికారులు రెండు రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఇప్పుడున్న నీటి లభ్యత, వనరులను బట్టి వచ్చే ఏడాది జూలై నాటికుండే పరిస్థితిని అంచనా వేసి ప్రణాళిక సిద్దం చేయాలి. కాళేశ్వరం నీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత శాశ్వత ప్రణాళిక వేసుకోవాలి. హైదరాబాద్ తో పాటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాల వారీగా లెక్కలు వేసుకుని ఎన్ని నీళ్లుకావాలో అన్ని నీళ్లు తీసుకుని మంచినీరు అందివ్వాలి" అని సీఎం సూచించారు.

పూర్తికాని భూసేకరణ

జాతీయ రహదారులు, భవనాల నిర్మాణంపై మంత్రి అసంతృప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారులు, ఇతర భవనాల నిర్మాణ పనుల ఆలస్యం కావడంపై ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కలెక్టరేట్లు, అతిథి గృహాల నిర్మాణం, ఎమ్మెల్యేల భవనాల నిర్మాణం వంటి పనుల్లో ఇంకా భూసేకరణ కాకపోవడం పట్ల మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలాల గుర్తింపులోనూ జాప్యం జరగడం ఎంతమాత్రం సరికాద న్నారు. 26 జిల్లాల కలెక్టరేట్లకు టెండర్లు పిలిచారని, వీటిలో 21 జిల్లాల్లో అధికార నివాస గృహ నిర్మాణం చేపట్టగా, మరో 26 జిల్లాల కలెక్టరేట్ల కాంట్రాక్టు అగ్రిమెంటు కూడా పూర్త యిందన్నారు. కాగా 14 జిల్లాల్లో మాత్రమే భూసేకరణ జరిగిందన్నారు. మంచిర్యాల, నిర్మల్, వరంగల్(గ్రామీణ), మహబూబ్‌నగర్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భూసేకరణ చేసినా నిర్మాణాలకు అనువుగా లేవని చెప్పారు. రంగారెడ్డి, మెదక్, కొత్తగూడెం, భూపాల పల్లి, సిరిసిల్ల, మహబూబాబాద్ జిల్లాల్లో కలెక్టరేట్లకు ఇంకా భూసేకరణ చేయలేదన్నారు. ఆయా జిల్లాల్లో అతిథిగృహాల నిర్మాణానికి ప్రతిపాదించగా, ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల కార్యాలయ నివాస బశనాల నిర్మాణంలోనూ తీవ్ర ఆలస్యం జరగడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్

(మొదటీపేజీ తురువాయి)

చేరుకొని సహాయక చర్యలను ప్రారంభించారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైలు పట్టాల కింది మట్టి కొట్టుకుపోయిందని, ఈ క్రమంలోనే ప్రమాదం జరిగి ఉండవచ్చునని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయాన్నే కావడంతో విధులకు హాజరయ్యే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 20న ఉత్కల్ రైలు పట్టాలు తప్పిన దుర్ఘటనలో 24 మంది చనిపోయాగా, 75 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసింది. యూపీలోనే 23న జరిగిన కైఫియత్ రైలు ప్రమాదంలో 100 మంది క్షతగాత్రులయ్యారు.

నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి :సీఎం

- హైదరాబాద్ దాహార్తికి సింగూరు నీరు
- సాగర్ జలాలు నల్లగొండ జిల్లాకు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

నాగార్జునసాగర్‌లో నీరు డెడ్‌స్టోరేజీ కన్నా తక్కువగా ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులతో అన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి హరీశ్‌రావు, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధరావును ఆయన ఆదేశించారు. కృష్ణా నదిలో ఈసారి వరదనీరు రాలేదని, నీటి లభ్యత తక్కువగా ఉన్నందున సింగూరు నుంచి హైదరాబాద్‌కు నీటిని వదలాలని, నాగార్జునసాగర్ నుంచి అక్కంపల్లి ద్వారా ఉదయసముద్రానికి నీరు వదిలి నల్లగొండ జిల్లాకు తాగునీరందించాలన్నారు. కృష్ణా నది నీళ్ళపై ఆధారపడిన హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ రెండు ప్రత్యామ్నాయాల ద్వారా మంగళవారం రాత్రి నుంచే నీరు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు.

రెండు కొత్త రిజర్వాయర్లు

హైదరాబాద్ మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రెండు రిజర్వాయర్లు నిర్మించాలని సీఎం చెప్పారు. ఒక దాన్ని కాళేశ్వరం ద్వారా వచ్చే గోదావరితో నింపాలని, రెండో దాన్ని కష్ణా నదీ జలాలతో నింపాలన్నారు. ప్రస్తుతమున్న హిమాయత్ సాగర్, గండిపేట చెరువుల సామర్థ్యం చాలా తక్కువని, అవి నగర అవసరాలు తీర్చలేవని చెప్పారు. కరువొచ్చినా నదీ జలాలు అందుబాటులో లేకున్నా సరే, హైదరాబాద్ నగర వాసులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే త్వరితగతిన రిజర్వాయర్ల నిర్మాణం కావాలన్నారు.

31న కలెక్టర్ల సమావేశం : సీఎం నిర్ణయం

హైదరాబాద్ : ఈ నెల 31న జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. జిల్లా భూరికార్డుల ప్రక్షాళనకు సంబంధించి క్షేత్ర స్థాయిలో జరగాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేసేందుకు ఈ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. మంగళవారం ప్రగతి భవన్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి రైతు సమన్వయ కమిటీల నియామకం జరగాలని, సెప్టెంబర్ 15 నుంచి రికార్డుల పరిశీలన ప్రారంభించాలని చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళన, రికార్డుల నిర్వహణ, పట్టాదారు పాస్ పుస్తకాలు, పహాణీ పత్రాల్లో మార్పులు, రిజిస్ట్రేషన్ విషయంలో సంస్కరణలు తదితర అంశాలపై విధి విధానాలకు తుదిరూపం ఇచ్చి కలెక్టర్ల సమావేశంలో వెల్లడించాలని సిఎం ఆదేశించారు.

31న వ్యవసాయాధికారుల సమావేశం

ఈనెల 31 హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో వ్యవసాయాధికారుల సమావేశం జరుగుతుంది. భూ రికార్డుల ప్రక్షాళన, రైతు సంఘాలు, రైతు సమన్వయ సమితిల నిర్మాణం, రైతు వేదికల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభోపన్యాసం చేస్తారు.

సైన్యంకంటే మీ వద్దే ఎక్కువ : సుప్రీం

న్యూఢిల్లీ: 'సైన్యం కంటే మీ దగ్గరే మందుగుండు ఎక్కువగా ఉన్నది. వాటితో దేశం మొత్తాన్ని తగులబెట్టొచ్చు' అంటూ దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లోని టపాసుల దుకాణదా రులను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. టపాసుల వల్ల ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యం పెరిగిపోతుందన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దీపావళిని ఐదురోజులపాటు జరుపుకుంటారని, రోజుకు 10 లక్షల కిలోల చొప్పున 50 లక్షల కిలోల మందుగుండు సామగ్రి అవసరమని, ఆమేరకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని దుకాణదారులు, పంపిణీదారుల వద్ద నిల్వలు ఉన్నాయని వారి తరపు న్యాయవాది వివరణ ఇవ్వగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మదన్ బీ లోకూర్, దీపక్‌గుప్తా ఆశ్చర్యపోయారు. చైనా టపాసులు తక్కువ ధరకు లభిస్తున్నాయని, వాటిలో నిషేధిత పదార్థాలు ఉన్నాయని, నాణ్యతా నియంత్రణ లోపించిందని టపాసుల తయారీదారుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దాంతో, స్పందించిన సుప్రీంకోర్టు చైనా టపాసుల నిషేధం కోసం కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటని ప్రశ్నించింది. దీనిపై సూచనలు చేస్తామని, త్వరలోనే నివేదిక సమర్పిస్తామని కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ పింకీఆనంద్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో టపాసుల పంపిణీదారులు, దుకాణదారుల లైసెన్సులన్నిటినీ సస్పెండ్ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజా విచారణలోనూ సస్పెన్షన్‌ను సుప్రీంకోర్టు తొలగించలేదు. ప్రస్తుతం దుకాణదారుల వద్ద నిల్వ ఉన్న మందుగుండును ఏంచేయాలన్నదానిపై సూచనలివ్వాల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డును సుప్రీంకోర్టు కోరింది.

ఉద్యోగులకు సీపీఎస్ శాపం

(మొదటీపేజీ తురువాయి)

చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ వర్తింపచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, సెప్టెంబర్ 22న జీవో నెంబర్ 653, జీవో నెంబర్ 654, జీవో నెంబర్ 655 ద్వారా కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్)ను అమల్లోకి తెస్తున్నట్టు నాటి ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగుల జీతంలో 10 శాతం, ప్రభుత్వం 10 శాతం కలిపి పింఛన్ నిధిలో జమ చేస్తారు. ఆ నిధిని షేర్‌మార్కెట్‌లో 50 శాతం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో 30 శాతం, ఇతర సంస్థలు జారీ చేసిన బాండ్లలో 20 శాతం జమ చేస్తారు. పదవీ విరమణ సమయంలో 60 శాతం ఇస్తారు. మిగిలిన 40 శాతం ఇన్సూరెన్స్ సంస్థల్లో యాన్యుటీ కింద తీసుకోవాలి. దాని మీద వచ్చే ఆదాయం పింఛనుగా భావించాలి. ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్ పొందడం ఉద్యోగి హక్కు. దశాబ్దాలపాటు సేవ చేసి రిటైరైన ఉద్యోగులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని 1982లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ప్రపంచబ్యాంకు విధానాల అమల్లో భాగంగా పాలకులు ఉద్యోగుల పింఛన్‌ను ప్రయివేటీకరించారు. 2014, ఫిబ్రవరి ఒకటిన పింఛన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) చట్టం అయ్యింది. సీపీఎస్ వల్ల ఉద్యోగులకే కాదు ప్రభుత్వాలకూ నష్టమే. ఆ సొమ్ము ప్రభుత్వాల వద్ద ఉంటే సంక్షేమ పథకాలకు వాడుకోవచ్చు. బ్యాంకుల వద్ద ఎక్కువ రుణాలకు అప్పు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. సీపీఎస్ వల్ల మార్కెట్ శక్తులకే లాభం కలుగుతుంది. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ఆ సొమ్ము వెళ్తున్నది.

మార్కెట్ శక్తుల చేతుల్లో పింఛన్ ఉండడం వల్ల రిటైరైనా పింఛన్ ఎంత వస్తుందో తెలియని అయోమయ స్థితిలో ఉద్యోగులున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్నది న్యూ పెన్షన్ స్కీం కాదు... నో పెన్షన్ స్కీం అని పలువురు ఉద్యోగులు విమర్శిస్తున్నారు. సీపీఎస్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 56 లక్షల మంది, తెలంగాణ ఉద్యోగులు 1,20,571 మంది, ఏపీలో 1.65 లక్షల మంది ఉన్నారు. పశ్చిమబెంగాల్, త్రిపుర, ఢిల్లీ రాష్ట్రాల్లో పాత పింఛన్ విధానం అమల్లో ఉంది.

కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని తొలగించడానికి అధ్యయనం చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వమూ సీపీఎస్ విధానం రద్దు చేసే దిశగా ఆలోచించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఉద్యోగ సంఘాలు కోరుతున్నట్టుగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు.

1న పింఛన్ విద్రోహ దినం : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చేనెల ఒకటిన పింఛన్ విద్రోహ దినం పాటిస్తున్నాం. ఉమ్మడి ఏపీలో వైఎస్ ప్రభుత్వం ఎవరితో సంప్రదించకుండా ఏకపక్షంగా 2004లో సీపీఎస్‌ను అమలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ అని నిరూపించుకోవాలంటే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి. రాష్ట్రంలోని 1.20 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఉపశమనం కలిగించాలి.

1న ఖిలాఫత్ దివాస్ : స్థితప్రజ్ఞ, టీఎస్‌సీపీఎస్‌ఈఏ అధ్యక్షుడు

సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పింఛన్‌ను వర్తింపచేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖిలాఫత్ దివాస్ పేరుతో సామూహిక సెలవు దినం పాటిస్తున్నాం. జిల్లా కేంద్రాల్లో శాంతియుతంగా ధర్మదీక్షలు చేస్తాం. తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగ సంఘాలు ముందుండి పాల్గొన్నాయి. సీపీఎస్ ఉద్యోగుల భవితవ్యంపై రాష్ట్ర ప్రభుత్వంతో ఎందుకు చర్చలు జరపడం లేదు. ప్రధాన సంఘాలకు ఎన్ని సమస్యలున్నా దీన్ని ప్రధానంగా గుర్తించాలి.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : శ్రీనివాస్‌గౌడ్, టీజీవో చైర్మెన్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి. ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానం వర్తింపచేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. సోమవారం జరిగిన టీజీవో కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు.

30,1న నిరసనలు : కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 30, వచ్చేనెల 1న రాష్ట్ర, జిల్లా, డివిజను, మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చాం. ప్రభుత్వ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేస్తాం. సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యూటీ సౌకర్యంతోపాటు ఫ్యామిలీ పింఛన్ పొందేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

సీపీఎస్ లోపభూయిష్టం : సురధీర్, పాత పింఛన్ పోరాట సమితి, అధ్యక్షుడు

సీపీఎస్ విధానం లోపభూయిష్టమైంది. ఉద్యోగుల ఆర్థిక, సామాజిక భద్రత లేని ఈ విధానాన్ని రద్దు చేయాలి. ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానం వర్తింపచేయాలి.

కాంగ్రెస్ ఉన్న కూటమిలో సీపీఐ(ఎం) చేరదు

(మొదటీపేజీ తురువాయి)

సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి సంస్కృతి పరిరక్షణ అన్నది విస్తృతమైన అంశమన్నారు. కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు లేదా అవగాహన కుదుర్చుకోరాదన్నది తమ పార్టీ విధానమని, ఇందులో ఎటువంటి సందిగ్ధతకు తావులేదని ఆయన అన్నారు. మహాకూటమికి సంబంధించిన సభలు, సమావేశాలకు తాము హాజరు కాబోమని, అయితే ఉమ్మడి సంస్కృతి పరిరక్షణకు సంబంధించిన సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతామని ఏచూరి వివరించారు.

జనం మత్తు..ఖజనా మస్తు!

(మొదటీపేజీ తురువాయి)

చేస్తోంది. మద్యం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకునే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. 2017-18 సంవత్సరానికి సంబంధించి మద్యం అమ్మకాలు, లైసెన్స్ ఫీజుల రూపంలో రూ.14వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకునేలా నూతన ఎక్సైజ్ విధానం ముసాయిదాను రూపొందించింది. కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్రంలో మరిన్ని మద్యం షాపులు, బార్ల సంఖ్యను పెంచనుంది. అదేవిధంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో విదేశీ మద్యం అమ్మకాల కోసం కొత్త షాపులకు అనుమతులు, తక్కువ మోతాదులో ఆల్కాహాల్ ఉన్న మద్యాన్ని షాపింగ్ మాల్స్‌లో విక్రయించేలా చర్యలు చేపట్టింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పెద్ద మొత్తంలో మద్యం అమ్మకాలు జరిగేలా ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేశారు దీనికి సంబంధించి మంగళవారం ఎక్సైజ్ శాఖ సమావేశమై ముసాయిదాపై చర్చించింది. ముసాయిదా ప్రతిని ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆర్ చంద్రవదన్ సీఎంకు అందజేశారు.

లైసెన్స్ ఫీజు తగ్గింపు.. షాపుల పెంపు ?

మద్యం షాపుల లైసెన్స్ ఫీజును కొంతమేర తగ్గించి, రాష్ట్రంలో మరిన్ని మద్యం షాపులు, బార్‌లకు లైసెన్స్‌లు మంజూరు చేయనుంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక్కో షాపు నుండి రూ.1.8 లక్షలు, మున్సిపాలిటీల్లో రూ.50 లక్షలు, నగర పంచాయతీల్లో రూ.25 లక్షలు లైసెన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం నూతన పాలసీ విధానం ప్రకారం మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో లైసెన్స్ ఫీజును తగ్గించనుంది. కొత్త ఎక్సైజ్ పాలసీ విధానం ప్రకారం మున్సిపాలిటీల్లో రూ.35 లక్షలు, నగర పంచాయతీల్లో 15లక్షలు చెల్లించేలా ముసాయిదాలో రూపొందించినట్టు తెలిసింది. ప్రతి 10వేల జనాభాకు ఒక్క మద్యం షాపును కేటాయించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,200 మద్యం షాపులు ఉన్నాయి. ఆ షాపుల సంఖ్యను 3వేల నుంచి 3200 వరకు పెంచనున్నట్టు అధికారులు తెలిపారు. ఒక వైపు లైసెన్స్ ఫీజులను తగ్గిస్తూనే మరో వైపు షాపుల సంఖ్యను పెంచడం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ఏమాత్రం కూడా గండిపడకుండా ఎక్సైజ్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టారు.

విదేశీ మద్యం అమ్మకాలకు ప్రత్యేక లైసెన్స్‌లు

రాష్ట్రంలో విదేశీ మద్యం అమ్మకాల కోసం ప్రత్యేకంగా లైసెన్స్‌లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఒక్క హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో విదేశీ మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నూతన పాలసీ ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాల్లో కూడా విదేశీ మద్యం అమ్మకాల కోసం లైసెన్స్ మంజూరు చేయనుంది. ఇందుకుగాను లైసెన్స్ ఫీజు రూపంగా రూ.1.8 లక్షలు చెల్లించాల్సి ఉంది. విదేశీ మద్యం షాపులో రూ.2వేలకు తక్కువగా ఉన్న మద్యాన్ని అమ్మకూడదన్న నిబంధనలు విధించనుంది.

షాపింగ్ మాల్స్‌లోనూ..

తక్కువ మోతాదులో ఉన్న ఆల్కాహాల్‌ను షాపింగ్ మాల్స్‌లో విక్రయించేందుకు కూడా అనుమతులు జారీ చేయనుంది. దీనికి ఆయా షాపింగ్ మాల్స్ యజమానులు ఆబ్కారీ శాఖ నుంచి విధిగా లైసెన్స్ పొందేలా నిబంధనలు విధించినట్టు సమాచారం.

రీప్లేస్ బస్సుల కోసం సీఎంకు నివేదిస్తా

రవాణశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాలంచెల్లిన పాతబస్సుల స్థానంలో 1,500 కొత్త బస్సుల (రీప్లేస్) కొనుగోలు కోసం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దృష్టికి తీసుకెళ్తానని రవాణశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారంనాడాయన సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ తదితర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. డిపోల వారీగా సంస్థ ఆదాయ వ్యయాలను ఆర్టీసీ ఎమ్‌డీ మంత్రికి వివరించారు. 96 డిపోల పరిధిలో ఏటా రూ.480 కోట్ల నష్టం వస్తున్నట్టు ఆయన తెలిపారు. అయితే దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వమని మంత్రి ఈ సందర్భంగా అధికారుల్ని ఆదేశించారు. దానితో పాటే నష్టనివారణకు చేపట్టాల్సిన ప్రణాళికల్ని కూడా అందచేయమని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలులో మినీ బస్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. దేశంలోని ఇతర ప్రజారవాణా వ్యవస్థలతో పోల్చితే టీఎస్‌ఆర్టీసీ పనితీరు మెరుగ్గానే ఉన్నదని, ప్రస్తుతం 27 డిపోలు లాభాల్లో ఉంటే, మరో 56 డిపోలు గరిష్టంగా నష్టాలను తగ్గించుకున్నాయని అన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన 'వజ్ర' బస్సుల పనితీరు మెరుగైందని, ఈ సేవల్ని విస్తరించాలని చెప్పారు. రాష్ట్ర ఆర్టీసీలో రోజుకు 93 కిలోమీటర్లు తిరిగే సర్వీసులు ఇప్పుడు 1.04 కోట్లకు చేరడంతో పనితీరు మెరుగైనట్టు ఆయన చెప్పారు. ముంబయి తరహాలో ఆర్టీసీని మెట్రోరైల్‌తో అనుసంధానం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని చెప్పారు. ఆర్టీసీ ఆస్తుల విభజన ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని, కేవలం ఒకటి, రెండు అంశాలు మాత్రమే పరిష్కారం కావల్సి ఉందని వివరించారు. జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి రావల్సిన నిధుల్ని ఎప్పటికప్పుడు రాబట్టుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు రవీందర్, వేణు, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్తి చేయాలి

- రిలీవ్ ఏపీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లిపోవాలి : మహానిరాహార దీక్షలో నేతల డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల విభజనను సత్వరం పూర్తి చేయాలని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మంగళవారంనాడిక్కడి మింట్‌కాంపౌండ్ టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మహా నిరాహార దీక్షను నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ శివాజీతో పాటు పలువురు ఇంజనీర్లు నల్ల చొక్కాలు ధరించి ఈ దీక్షల్లో పాల్గొన్నారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవీప్రసాద్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఎమ్‌యు ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి తదితరులు ధర్నానుద్దేశించి మాట్లాడారు. ఆంధ్రా స్థానికత ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ చేసి, రెండున్నరేండ్లుగా వారికి కూర్చొబెట్టి వేతనాలు చెల్లిస్తున్నారని, దీనివల్ల విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారాలు పెరుగుతున్నాయని వారు చెప్పారు. ఏపీ స్థానికత ఉద్యోగుల్ని ఆ రాష్ట్రప్రభుత్వం తీసేసుకోవాలని, రిలీవ్ ఉద్యోగులు అక్కడి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని చెప్పారు. అందుకు భిన్నంగా వారు జీతభత్యాలు సహా పదోన్నతులపై కూడా న్యాయస్థానాల్ని ఆశ్రయించి, ఇంకా తెలంగాణలో పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని విమర్శించారు. రిలీవ్ ఉద్యోగుల అంశాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణం పరిష్కారం చేసేలా చొరవ చూపాలని కోరారు. రిలీవ్ ఉద్యోగుల తీరు వల్ల తెలంగాణలో పదోన్నతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. సాయంత్రం ఐదుగంటలకు దేవీప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్ ఇంజనీర్లకు నిమ్మరసం ఇచ్చి దీక్షల్ని విరమింపచేశారు.




రంగారెడ్డిలో ఏపీపీ నియామకాలు రద్దు : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా కోర్టు పరిధిలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఈ ప్రక్రియను మూడువారాల్లో పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ హోం శాఖ ముఖ్యకార్యదర్శిని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు పీపీల భర్తీ నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతోందని పేర్కొంటూ దాఖలైన మూడు రిట్లను గతంలో జరిగిన విచారణ సమయంలో అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. కోర్టులంటే జోక్‌గా మార్చవద్దంటూ తీవ్ర స్వరంతో బెంచ్ హెచ్చరించింది.

వర్ష బీభత్సం



(మొదటీపేజీ తురువాయి)

ముంబయి: భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగు లను పనివేళలు ముగియక ముందే ఇండ్లకు పంపించాలని దేవేంద్ర ఫడ్నవీస్ సర్కార్ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించింది.స్కూళ్ల,కాలేజీలకు సెలవులు ప్రకటించారు.కాగా, పరేల్‌లోని ఓ ఆస్పత్రిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ ఆస్పత్రి ప్రాంగణంలో నిలిపివున్న కార్లన్నీ నీటమునిగాయి. రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొన్నది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయని తెలిపింది. జాలర్లు చేపల వేటకోసం సముద్రంలోకి వెళ్లొదని హెచ్చరించింది. 2005, జులై26న ముంబయిలో భారీ వరదలు సంభవించడంతో 5వేల మంది మృతి చెందారు. భారీగా ఆస్తినష్టం జరిగింది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్‌ఎఫ్) బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించే వినాయక నిమజ్జనానికి బీచ్‌లకు వెళ్లొద్దని సూచించారు. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని అన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి సాయం అందించేందుకు పోలీస్ యంత్రాంగం సన్నద్ధమైంది. తక్షణ సాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్100కు ఫోన్ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు నగర పౌరులను సూచించారు. విక్రోలి ప్రాంతంలో పాతభవనం కూలడంతో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరికి గాయలయ్యాయి. పరేల్ ప్రాంతంలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

నగదు లావాదేవీల్లో జర జాగ్రత్త

నిషేధాన్ని ఉల్లంఘిస్తే పెనాల్టీ: ఐటీ శాఖ

న్యూఢిల్లీ: నల్లధన నియంత్రణ చర్యల్లో భాగంగా రూ.రెండు లక్షలు అంతకు మించి జరిపే నగదు లావాదేవీలపై నిషేధం కొనసాగుతున్నట్టుగా ఐటీ శాఖ మరోమారు వెల్లడించింది. నగదు లావాదేవీల విషయంలో అక్రమాలకు పాల్పడితే భారీ జరిమానా ఎదుర్కోవల్సి వస్తుందని తెలిపింది. మరోవైపు ఒక రోజులో ఒక వ్యక్తి నుంచి ఒకే పనికి సంబంధించిన పలు లావాదేవీల కింద రూ.2లక్షలు గానీ అంతకంటే ఎక్కువగానీ నగదు లావాదేవీలు జరపడం నిషేధమని పేర్కొంది. అదే విధంగా స్థిరాస్తి విషయమై రూ.20 వేలు అంతకంటే ఎక్కువ మొత్తానికి లావాదేవీలు జరపడం, వృత్తిదారులు వ్యాపార ఖర్చుల కింద రూ.10 వేలకు మించి లావాదేవీలు జరిపితే నిషేధ ఉల్లంఘన కిందకు వస్తుందని ఐటీ శాఖ తెలిపింది. ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే పెనాల్టీ విధించనున్నట్టు వివరించింది. 2017 ఏప్రిల్ 1న కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షలు, అపై నగదు లావాదేవీలను నిషేధించిన సంగతి తెలిసిందే.

సెన్సెక్స్ ▼155	నిఫ్టీ ▼117	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,388	9,796	64.02	రూ. 30,278	రూ. 42,000

కోడిగుడ్లు

హైదరాబాద్	355	విజయవాడ	359
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	400

హచిసన్‌కు ఐటీ శాఖ భారీ జరిమాన



న్యూఢిల్లీ : హచిసన్ తన భారత వ్యాపారాలను వొడాఫోన్‌కు విక్రయించిన సమయంలో భారీ మొత్తంలో పన్ను ఎగవేసిన విషయం తెలిసిందే. ఈ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ విషయంలో బిలియనీర్ లీ కా సింగ్‌కు చెందిన హచిసన్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు ఆదాయపు పన్ను శాఖ వడ్డీ, డిమాండ్ పన్ను, జరిమాన తదితరాలు కలుపుకుని రూ.32,320 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. 2007లో బ్రిటన్‌కు చెందిన వొడాఫోన్‌కు హచిసన్ తన భారత మొబైల్ వ్యాపారాన్ని 11 బిలియన్ డాలర్లకు విక్రయించింది. ఈ ఒప్పందంలో హచిసన్ అనుచిత లబ్ధి పొందిందని, ఇందుకోసం రూ.7,900 కోట్లు పన్ను చెల్లించాలని ఆ సమయంలో ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. 10 సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ హచిసన్ స్పందించకపోవడంతో దీనిపై తాజాగా రూ.16,430 కోట్ల వడ్డీ, మరో రూ.7,900 కోట్ల జరిమాన విధించింది. మొత్తంగా రూ.30,230 కోట్లు చెల్లించాలని భారత ఐటీ శాఖ తమకు నోటీసులు జారీ చేసిందని హచిసన్ ఫైలింగ్‌లో పేర్కొంది.

సిద్ధమైన ఎగవేతదారుల రెండో జాబితా!



న్యూఢిల్లీ : బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన ఎగవేత దారులకు సంబంధించిన రెండో జాబితాను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధం చేసినట్టుగా సమాచారం. కార్పొరేట్ల నుంచి మొండి బకాయిలను రాబట్టుకునే ప్రక్రియలో భాగంగా దాదాపు 30-40 కంపెనీల తో కూడిన రెండో జాబితాను త్వరలోనే ఆర్‌బీఐ విడుదల చేయనుందని వార్తలు వస్తున్నాయి. ఇందుకోసం ఎన్‌సీఎల్‌టీలో ఆర్‌బీఐ కేసు దాఖలు చేయనుంది. సెప్టెంబర్‌లో జాబితాను బహిర్గతం చేయనుందని తెలుస్తోంది.

దేనా బ్యాంకు రుణ మేళా సక్సెస్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేనా బ్యాంకు హైదరాబాద్ జోనల్ కార్యాలయం వారి ఆధ్వర్యంలో మంగళవారం మెగా క్రెడిట్ మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ ఎస్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేళాలో భాగంగా లబ్ధిదారులకు రూ.67 కోట్ల విలువైన రుణ పత్రాలను ఆయన అందజేశారు. మేళాలో భాగంగా ప్రాధాన్యత రంగాల వారికి రుణాలను అందజేశారు. వ్యవసాయం, స్వయం సహాయక సంఘాల వారితో పాటు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల వితరణ జరిపారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన మైనార్టీ వర్గాల వారు, మహిళలు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వారు ఈ క్యాంపులో పాల్గొన్నట్టుగా బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ అశ్విన్ హెచ్ దలాల్, డిప్యూటీ జోనల్ మేనేజర్ పీవీఆర్ఎస్ ప్రకాశ్ రావు, రెండు రాష్ట్రాలకు చెందిన దేనా బ్యాంకు బ్రాంచీ మేనేజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫలహారంలా ప్రభుత్వ వాటాల విక్రయం!

- డిజిన్వెస్ట్‌మెంట్ జోరు పెంచుతున్న సర్కారు
- కేవలం 5 నెలల్లో రూ.9,300 కోట్ల నిధుల సమీకరణ
- ఆసక్తిగా కొనుగోలు చేస్తున్న 'పెద్దోళ్లు'
- ఎన్‌టీపీసీ ఇష్యూకూ 'అదే తరహా' స్పందన

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: మేటి సంస్థల్లో తనకున్న వాటాను సర్కారు ఫలహారంలా అమ్మేస్తోంది. దీంతో చౌక ధరల వద్ద లభిస్తున్న మేటి కంపెనీల వాటాను కొనుగోలు చేసేందుకు గాను బడా బాబులు పోటీ పడుతున్నారు. తాజాగా మంగళవారం ప్రారంభమైన 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్' (ఎన్‌టీపీసీలో) ఆఫర్ ఫర్ సేల్‌లోనూ (ఓఎఫ్ఎస్) ఈ విషయం మరోమారు రుజువైంది.

జోరుగా ముందుకు సాగుతున్న సర్కారు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ వాటాల విక్రయం ద్వారా దాదాపు రూ.73,000 కోట్ల మేర నిధులను సమీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. గడిచిన అయిదు నెలల కాలంలో వివిధ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాను విక్రయించడం ద్వారా దాదాపు రూ.9,300 కోట్ల మేర నిధులన సమీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ వాటా విక్రయం ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రూ.15,000 కోట్లు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన పీఎస్‌యూలు, బీమా కంపెనీల్లో వాటాల విక్రయం ద్వారా రూ.11,000 కోట్లను సమీకరించాలని సర్కారు నిర్ణ యించుకున్న సంగతి తెలిసిందే. సర్కారు నిర్ణయం సంపన్నులకు బాగా కలిసి వస్తోంది. తక్కువ ధర వద్ద మేటి కంపెనీల స్టాక్స్ లభిస్తుండడంతో వారుపోటీ పడి కొనుగోలు చేస్తున్నారు.



మొదటి రోజు బంపర్ స్పందన..

ఎన్‌టీపీసీలో వాటా విక్రయానికి గాను సర్కారు తీసుకువచ్చిన ఆఫర్ ఫర్ సేల్‌కు తొలిరోజైన మంగళ వారం బంపర్ స్పందన లభించింది. తొలిరోజు ఆఫర్‌ను కేవలం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకే (బడాబాబులు లకే) వర్తింపజేశారు. దీంతో ఈవిభాగానికి కేటాయిం చిన 32.98 కోట్ల షేర్లకు గాను 38.66 కోట్ల బిడ్లు లభించాయి. ఇది దాదాపు 1.17శాతం అధికం కావ డం విశేషం. ఎన్‌టీపీసీకి చెందిన దాదాపు 41.22 కోట్ల మేర షేర్లను మార్కెట్ వర్గాలకు విక్రయించి దాదాపు రూ.7000కోట్ల మేర నిధులను సమీకరిం చాలన్నది సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫర్‌కు అనూహ్య స్పందన లభిస్తే విక్రయాన్ని 10శాతం వర కు విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకు సర్కారు ఇప్పటికే పచ్చజెండా ఊపింది. ఎన్‌టీపీసీలో వాటా విక్రయం ద్వారా దాదాపు రూ.7000 కోట్ల నుంచి రూ.13,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలని ప్రభుత్వం ఉద్దేశం. ఆఫర్ రెండో రోజైన బుధవారం షేర్లను కొనుగోలు చేసేందుకు గాను రిటైల్ ఇన్వెస్టర్లను కంపెనీ వర్గాలు అనుమతించనున్నారు. వీరికి 5 శాతం డిస్కౌంట్‌తో దాదాపు 8.24 కోట్ల మేర షేర్లను కేటాయించారు.


2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ

వాటాల విక్రయ లక్ష్యం ₹72,500 కోట్లు

కంపెనీ	వాటా విరమణ మార్గం	పెంచిన మొత్తం రూ. కోట్లలో
ఎల్ అండ్ టి	ఓఎఫ్ఎస్	4,153
హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	ఐపీఓ	1,207
నాల్కో	ఓఎఫ్ఎస్	1,191
ఆయిల్ ఇండియా	బై బ్యాక్	1,135
నేషనల్ ఫెర్టిలైజర్స్	ఓఎఫ్ఎస్	530
కొచ్చిన్ షిప్‌యార్డ్	ఐపీఓ	470
హిందుస్తాన్ కాపర్	ఓఎఫ్ఎస్	404
రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్	ఓఎఫ్ఎస్	205
మొత్తం		9,295

రోజుకు రూ.100 పెనాల్టీ!

- జీఎస్టీ రిటర్న్స్ జాప్యాన్ని తగ్గించేలా సర్కారు అనూహ్య చర్య
- లక్ష్యాన్ని మించిన జీఎస్టీ వసూళ్ల
- ఇప్పటికే 92,283 కోట్ల ఆదాయం: జైట్లీ



న్యూఢిల్లీ: 'వస్తుసేవల పన్ను' (జీఎస్టీ) ఫైలింగ్‌లో జాప్యాన్ని నివారించేందుకు గాను ఇకపై కఠినంగా వ్యవహరించాలని కేంద్రసర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆలస్యంగా రిటర్నులను దాఖలు చేస్తున్న వారిపై రోజుకు రూ.100 చొప్పున అపరాధ రుసుమును వసూలు చేయనుంది. ఈ విషయాన్ని స్వయంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీలకు సంబంధించిన రిటర్న్‌లకు ఈ పెనాల్టీ వర్తిస్తుందని జైట్లీ తెలిపారు. కొత్త పన్ను విధానంలో మొదటి నెల జీఎస్టీ రిటర్నుల దాఖలునకు ఆఖరి తేది ఆగస్టు 25తో ముగిసింది. జీఎస్టీ తొలి వసూళ్లు లక్ష్యాలను మించి నమోదైయినట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. జులై నెలలో జీఎస్టీ వసూళ్లు లక్ష్యాన్ని దాటేసి రూ.92,283 కోట్లకు చేరువైనట్టుగా మంత్రి వెల్లడించారు. మొత్తంగా చూస్తే నిర్దేశించుకున్న లక్ష్యాలతో పోలిస్తే వసూళ్లు ఎక్కువగా ఉన్నట్టు ఆయన విశ్లేషించారు. జీఎస్‌టీ నెట్‌వర్క్‌లోకి 59.57 లక్షలమంది పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారని వీరిలో దాదాపు 38.3లక్షల మంది జీఎస్టీ రిటర్నులను ఫైల్ చేసినట్టుగా జైట్లీ తెలిపారు. కొత్త పన్ను విధానలంలోకి దాదాపు 72.33 లక్షల వ్యాపార సంస్థల వారు మారారని జైట్లీ తెలిపారు.

జీఎస్టీతో లాభాలు తగ్గాయి: ఇక్రా

ప్రభుత్వం తాజాగా అమలులోకి తెచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) దేశీయ పరిశ్రమల లాభాలపై ప్రభావం చూపుతోందని రేటింగ్ సంస్థ ఇక్రా విశ్లేషించింది. పెద్దనోట్ల రద్దు షాక్ నుంచి క్రమంగా కోలుకుంటున్న పరిశ్రమలను తాజాగా సర్కారు అమలులోకి తెచ్చిన జీఎస్టీ గణనీయంగా ప్రభావితం చేసిందని ఇక్రా ఒక నివేదికలో ఆవేదన వ్యక్తం చేసింది. గత త్రైమాసికంలో దేశంలోని448 కంపెనీలకు చెందిన ఆదాయాల వృద్ధి మందగించి 5.3 శాతానికి పరిమితమైనట్టుగా తెలిపింది.

10 శాతం మార్కెట్ వాటా లక్ష్యం

- వాటర్ ప్యూరిఫైయర్‌ల విభాగంలో విస్తరిస్తాం: బ్లూ స్టార్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ప్రముఖ ఎయిర్ కండీషనర్ల తయారీ సంస్థ బ్లూ స్టార్ వచ్చే మూడేండ్ల కాలంలో నీటి శుద్ధి యంత్రాల వ్యాపారంలో 10 శాతం మార్కెట్ వాటా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కంపెనీ మంగళవారం మార్కెట్లోకి నూతన టెక్నలాజీతో కూడిన వాటర్ ప్యూరిఫైయర్‌లను విడుదల చేసింది. ఈ సందర్భంగా బ్లూ స్టార్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొడక్టు బిజినెస్ ప్రెసిడెంట్ సీపీ ముకుందన్ మీనన్ మాట్లాడుతూ వాటర్ ప్యూరిఫైయర్‌లలో ఇప్పటికే మొత్తం 21 మోడళ్లను ఆవిష్కరించమన్నారు. వీటి ధరల శ్రేణి రూ.7,900 నుంచి రూ.44,900 వరకు ఉందన్నారు. ఈ రంగం ప్రతి ఏడాది 22 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. మార్కెట్ విలువ రూ.4000 కోట్లుగా ఉందన్నారు. ఇందులో ఎలక్ట్రిక్ ప్యూరిఫైయర్ల వాటా 80శాతమని పేర్కొన్నారు. తాము ప్రస్తుత ఏడాదిలో రూ.60 కోట్లు, వచ్చే ఏడాది రూ.120 కోట్లు, 2021 నాటికి రూ.500 కోట్ల టర్నోవర్ అంచనా వేస్తున్నామన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరుబాట

- పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్



నవతెలంగాణ-హుజురాబాద్ / జమ్మికుంట

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరుబాట తప్పదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో మంగళవారం విద్యార్థిపోరు పాదయాత్ర చేపట్టారు. హుజూరాబాద్‌లో ప్రారంభమైన యాత్ర జమ్మికుంట వరకు సాగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. రూ.కోట్ల నిధులు గుళ్లు, గోపురాలకు ఖర్చు పెడుతున్న సర్కారు భావితరాలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయిం బర్స్‌మెంట్ మొత్తం ఒకేమారు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలోని 425పాఠశాలల్లో 70శాతం మేరకు పాఠశాలల్లో పరిపడా ఉపాధ్యాయులు, సౌకర్యాల్లేవని తెలిపారు. 60శాతం పాఠశా లల్లో మధ్యాహ్నభోజన వంట గదుల్లేక చెట్లకిందే కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. శాతవాహన యూనివర్సిటీకి రూ.200 కోట్లు కేటాయించాలని, జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నంద గణేష్, కార్యదర్శి రజనీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవం ముగిసే వరకు నిఘా

- సున్నితమైన ప్రాంతాలలో భద్రత కట్టుదిట్టం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో గణేష్ ప్రతిమల నిమజ్జనోత్సవం ముగిసేంత వరకు మతపరంగా సున్నితమైన ప్రాంతాలలో నిఘాను పెంచడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లను ఆదేశించారు. ముఖ్యంగా సంఘవిద్రోహ శక్తులు, గూండాలు, రౌడీలు, కమ్యూనల్ రౌడీల కదలికలపై ప్రత్యేకంగా దృష్టిని సారించాలని కోరారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ను ంచి అంతర్గత ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది. గతంలో పాతబస్తీలోని కొన్ని ప్రాంతాలతో పాటు అదిలాబాద్ జిల్లా బైంసా,మహబూబ్‌నగర్ పట్టణం, వికారాబాద్, భువనగిరి, నల్లగొండ మొదలైన ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోవడాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ముందుజాగ్రత్త చర్యలను తీసుకోవాలని ఆయన సూచించినట్టు తెలిసింది. అలాగే గత ఏడాది ట్యాంక్‌బండ్‌లో నిమజ్జన పర్వం దాదాపు మూడు రోజుల పాటు సాగడం వలన కొన్ని ఇబ్బందులు ఎదురు కావడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మారు ఆ పరిస్థితి తలెత్తకుండా తగిన వ్యూహరచన చేసి అమలు చేయాలని ఆయన నగర పోలీసు కమిషనర్‌ను కోరినట్టు తెలిసింది.

బాలల హక్కుల పరిరక్షణ చైర్మెన్ ఎంపికపై హైకోర్టు స్టే

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్‌గా గుడిమళ్ల రవికుమార్‌ను నియమించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై వివరణ ఇవ్వాలని హైకోర్టు తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. తమ ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ చైర్మెన్‌గా ఎవరినీ నియమించరాదని హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరామ్ మధ్యంతర ఆదేశాలిచ్చారు.

దొరల పాలన పాలిట సింహస్వప్నం టీమాస్

- వారి బోగాల కోసమా బంగారు తెలంగాణ : టీమాస్ జిల్లా ఆవిర్భావ సభలో తమ్మినేని
- ఎర్రజెండాలు ఒక్కటై దొంగలకు ఉరిపేనాలి : గద్దర్

నవతెలంగాణ-యాదాద్రి భువనగిరి ప్రతినిధి

నియంతృత్వ దొరల పాలన పాలిట సింహస్వప్నంగా టీమాస్ ఆవిర్భవించిందని ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే టీ మాస్ లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్‌లో జరిగిన తెలంగాణ ప్రజాసంఘాల ఐక్య వేదిక (టీమాస్) జిల్లా ఆవిర్భావ సభలో తమ్మినేని ప్రసంగించారు. మూడేండ్ల పాలనలో 3200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ఉద్యోగాల కోసం తప్పుడు నోటిఫికేషన్లు వేయడం, కోర్టులు కొట్టేయడం తంతుగా మారిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల జాడ లేకపోగా, దళితుల భూపంపిణీ అటకెక్కిందన్నారు. కులం, మతం, రాజకీయ, సంస్కృతి, ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్ష, పురుషాధిక్యత ఇలా అనేక సమస్యలపై టీ మాస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ప్రజా ఉద్యమాలపైఉక్కుపాదం మోపుతూ బంగారు తెలంగాణ పునర్‌నిర్మాణం పేరుతో బోగాలు అనుభవిస్తున్న దొరల పాలనకు టీమాస్ చరమగీతం పాడుతుందన్నారు. బతుకు తెలంగాణ కోసం టీ మాస్‌తో సబ్బండ వర్గాలు కలిసి రావాలని కోరారు.

ప్రజాగాయకులు గద్దర్ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న, అమరుల బలిదానాలతో ఏర్పడిన త్యాగాల తెలంగాణ దొరలకు బోగాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన భువనగిరి నుంచి సామాజిక తెలంగాణ కోసం మరో ఉద్యమానికి ప్రజలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేత, రాజకీయ, కుల వివక్షపై టీమాస్ పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. 93 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీలు గద్దెపై కూర్చునే వరకు పోరాటం చేస్తుందన్నారు. చీలిపోయిన ఎర్రజెండాలు ఒక్కటై దోపిడీ దొంగలకు ఉరి పేనడమే లక్ష్యంగా ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. టీమాస్ ఫోరం సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానన్న కేసీఆర్ ప్రజల్ని కుక్కలుగా చూస్తున్నాడన్నారు. ఆయనను కుక్కను చేసి ఆడించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎక్కడ అన్యాయం.. కన్నీళ్లు వస్తే అక్కడ టీ.మాస్ ఉంటుందన్నారు.




టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కేబినేట్ మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా స్థానం కల్పించకపోవడం బాధాకరమని, మహిళలకు గౌరవం దక్కినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్టని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే, మార్క్స్ జ్ఞాన సిద్ధాంతాలతో టీ మాస్ ఫోరం ముందుకు సాగుతుందన్నారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు దాసురాం నాయక్ మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు, మతోన్మాదంతో దేశంలో అణగారిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయన్నారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, టీ మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు మేడి పాపయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కమీషన్ల కక్కుర్తి కోసం మిషన్ కాకతీయకు దారి మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదేశ్ గంగపుత్రుల రాష్ట్ర అధ్యక్షులు, టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎ.ఎల్ మల్లయ్య మాట్లాడుతూ.. తరతరాలుగా అగ్రవర్ణాల వారికి ఓట్లు వేయడానికి మనం కూలీలం కాదని, వారి చేత ఓట్లు వేయించుకొని అధికారంలోకి రావడమే సామాజిక తెలంగాణ ఉద్దేశమని అన్నారు.

ఈ సభకు అధ్యక్షవర్గంగా మాటూరి బాలరాజు, బట్టురామచంద్రయ్య, బట్టుపల్లి అనురాధ, ధరావత్ గణేష్‌నాయక్ వ్యవహరించగా.. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు, టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, కూరపాటి రమేష్, సుర్వంగ శివలింగం, బెల్లి కృష్ణ, ఆర్ శ్రీరాంనాయక్, ప్రభంజన్‌యాదవ్, దళిత ఉద్యమ సీనియర్ నేత జేబీ రాజు, టీ మాస్ ఫోరం జిల్లా నిర్వాహకులు ఎండీ జహంగీర్, కొండమడుగు నర్సింహ్మ, చింతల భూపాల్‌రెడ్డి, మంగ నర్సింహులు పాల్గొన్నారు.

వికలాంగుల గురుకుల విద్యాసంస్థల సాధనకు ఉద్యమం

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిర్ణయం
- విద్యా ఉద్యోగాల్లో 5% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్
- ఎన్‌పీఆర్‌డీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగుల గురుకుల విద్యాసంస్థల సాధన కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేయాలని నిర్ణయించినట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అడివయ్య, గోరెంకల నర్సింహ తెలిపారు. ఉద్యోగాల్లో 5% రిజర్వేషన్లు అమలు చేయాలని, డబుల్ బెడ్ రూంలో వికలాంగుల వాటా ఎంతనో ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎన్‌పీఆర్‌డీ ద్వితీయ మహాసభల్లో చేసిన తీర్మానాలపై మంగళవారం సుందరయ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. మహాసభల్లో 17 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించగా, 91 మందితో నూతన రాష్ట్ర కమిటీ, 25 మందితో ఆఫీస్ బేరర్స్ ఎన్నికయ్యారని వివరించారు. రాజకీయ రంగంలో, అన్ని సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5% వాటా ఇవ్వాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పింఛన్‌ను రూ.5 వేలకు పెంచాలన్నారు. బడ్జెట్‌లో 5% నిధులు కేటాయించి ప్రత్యేక సబ్‌ప్లాన్ చట్టం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేసి రోస్టర్ పాయింట్స్ 10లోపు ఉంచాలని సూచించారు. 40% అంగవైకల్యం ఉన్నవారందరికీ పింఛన్ సదుపాయం కల్పించాలని, 90% సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో మెట్రో బస్సుల్లో వికలాంగులకు పాసులు అనుమతించాలని, మరుగుజ్జులకు సైతం బస్‌పాస్‌లు అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా వికలాంగులపై వేధింపులను అరికట్టి ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రయివేటు రంగంలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో పాఠశాల, కళాశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. వికలాంగులకు వివాహక ప్రోత్సాహం రూ.2లక్షలకు పెంచి, వికలాంగులు, వికలాంగులు పెండ్లి చేసుకుంటే రూ.5 లక్షల ఆర్థిక సహకారంతోపాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఏడాదంతా పనులు కల్పించాలని, ప్రభుత్వ శాఖలన్నీ 5% నిధులను వికలాంగుల సంక్షేమానికి ఖర్చు చేయాలని తదితర డిమాండ్లను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని అడివయ్య, నర్సింహ వివరించారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ ఎం.జనార్ధన్‌రెడ్డి, కోశాధికారి ఆర్.వెంకటేశ్, సహాయ కార్యదర్శి వెంకట్, ఉపాధ్యక్షులు నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా ఎం.జనార్ధన్‌రెడ్డి, అధ్యక్షునిగా ఎం.అడివయ్య, ప్రధాన కార్యదర్శిగా గోరెంకల నర్సింహ, కోశాధికారిగా ఆర్.వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా పీ.నర్సిరెడ్డి, టీ.వరమ్మ, యశోద, ఎం.బస్వరాజ్, లక్ష్మీ, బీ.సురేష్, జానీ, నాగలక్ష్మీ, ఎండీ యూసుఫ్, వీ.వెంకన్న, రాజు, సహాయ కార్యదర్శులుగా కే.వెంకట్, బీ.గణేష్, సయ్యద్ ఖాజా, సీహెచ్ సాయమ్మ, కవితారెడ్డి, పోచమ్మ, ఉపేందర్, మల్లయ్య, ఆఫాన్ అలీ, పొట్టి గంగాధర్‌తోపాటు 91 మంది రాష్ట్ర కమిటీని ఎన్నికున్నారు.

లైంగిక వేధింపులపై పోరాటం

దేశంలో పెరుగుతున్న పిల్లల అక్రమ రవాణా

- సెప్టెంబర్ 11 నుంచి భారత యాత్ర
- నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్ధి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

దేశవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తానని నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి చెప్పారు. దేశంలో రోజురోజుకు పిల్లల అక్రమ రవాణా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా భారతయాత్ర పేరిట పోరాటం ప్రారంభిస్తున్నానని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 11న కన్యాకుమారిలో భారతయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 21న హైదరాబాద్ చేరుకుంటుందని, అక్టోబర్ 16న ఢిల్లీలో ముగుస్తుందని చెప్పారు. పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను ఆరికట్టడానికి పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చిన్నపిల్లలపై లైంగికవేధింపులు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. మైనర్లపై అత్యాచారాలు ఎక్కువగా సన్నిహితుల ద్వారానే జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక-2015 ప్రకారం నేరస్థుల్లో 99శాతం తెలిసినవారే ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో బాల్యవివాహాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. 3,19,108 మంది అమ్మాయిలకు, 3,21,073 మంది అబ్బాయిలకు చట్టరీత్యా వివాహ వయస్సు కంటే ముందుగానే పెండ్లి జరిగిందని ఓ నివేదిక తెలిపిందని అన్నారు. 2013-15 సంవత్సరంలో ఈ రాష్ట్రాల్లో 17,560 మంది తప్పిపోయారని, ఈ పిల్లలందరూ తర్వాత అనేక సార్లు విక్రయించబడి, భౌతిక, మానసిక, లైంగిక వేధింపులకు నిరంతరంగా గురవుతున్నారని చెప్పారు. ప్రతి చోట చిన్న పిల్లలు సంకెళ్లు ధరించి ఉంటే దేశం ఎలా పురోగమిస్తుందని ప్రశ్నించారు. ఇవి మన దేశాన్ని వెంటాడుతున్న నైతిక మహమ్మారి అన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక బాలిక మిస్సింగ్ అవుతుందని, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను చూస్తే బాధేస్తుందని చెప్పారు. 150 మందితో కలిసి భారత యాత్ర చేస్తున్నాననీ, దీనికి ప్రధాని నరేంద్రమోడీతో పాటు అన్ని పక్షాల మద్దతు ఉందని అన్నారు.

జరదేఖో
నవతెలంగాణ
11
హైదరాబాద్
బుధవారం 30-8-2017
www.navatelangana.com

కోటలకు ప్రసిద్ధి తెలంగాణ. ఎన్నో చారిత్రక ఘట్టాలకు, రాజరికపు వైభవానికి అద్దం పడతాయి ఈ కోటలు. పెద్ద పెద్ద రాళ్లతో టర్కీ ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్‌తో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ఈ కోటలు అద్భుతమైన శిల్పా సంపదను, చాతుర్యాన్ని కలిగి ఉన్నాయి. అంతే కాదు మత సామరస్యానికి ప్రతీకలు ఈ ఖిల్లాలు. ఏలిన ప్రాంతాలు చిన్నవే కావచ్చు, కానీ ఏలికలు మాత్రం ఘన చరితులే. మనుషులు చేసే యుద్ధాల నుంచి ప్రకృతి వైపరీత్యాల వరకు అనేక విపత్కర పరిస్థితుల ను ఎదుర్కొని నిలబడేలా పటిష్టంగా నిర్మించారు తెలంగాణలోని రాజులు. ఒడిసెల రాళ్ల నుంచి మర ఫిరంగుల దాకా దేన్నైనా తట్టుకోగల సామర్థ్యం కలిగి ఉన్నాయి ఈ కోటలు. తరాలు గడిచినా చెక్కుచెదరని కట్టడాలను ఆస్తులుగా, తరగని జ్ఞాపకాలుగా ఈ కోటలు నిలిచి ఉన్నాయి. ఒక్కొక్క కోటను ఒక్కొక్కరోజు సందర్శించడం మరపురాని అనుభవం.



కోటల్లో దాగిన పర్యాటక వైభవం

భువనగిరి కోట...

తెలంగాణలో ఆలనాటి చరిత్రకు రాజరిక వ్యవస్థకు ప్రతీక భువనగిరి కోట. నాటి పాలకులకు గుర్తుగా వందల ఏండ్ల చరిత్ర కలిగిన కోటలు, బురుజులు, దర్వాజలు ఇప్పటికే తెలంగాణ లో పెద్ద ఎత్తున కనిపిస్తాయి. అయితే ఇలాంటి కోటలకు పెట్టింది పేరు నల్లగొండ జిల్లాలోని భువనగిరి కోట. ఇది త్రిభువనగిరి కోటగా పేరుగాంచింది.

హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో వరంగల్ జాతీయ రహదారి పక్కనే ఉంది. నల్లగొండ జిల్లాలోని చారిత్రక కట్టడాలు, కోటల్లో భువనగిరిదే అగ్రతాంబూలం. పదవ శతాబ్దంలో కళ్యాణ చాళుక్యుల ఆరవ రాజు రాజ త్రిభువన మల్లు విక్రమాదిత్యుని పేరుతో భువనగిరి ప్రసిద్ధి చెందింది. క్రీ.శ 1325 వరకు కాకతీయుల సామంత రాజుల రాజధానిగా ఉండేది. కాల క్రమంలో ఢిల్లీ సుల్తాను మహ్మద్ బిన్ తుగ్లక్ దాడులతో కాకతీయ రాజ్యం పతనం అయింది. తర్వాత కళ్యాణ చాళుక్యుల రాజ్యం కూడా అంతం అయింది. ఆ తర్వాత బహమనీ సుల్తానుల అధీనంలోకి భువనగిరి వెళ్లిపోయింది. క్రీ.శ 1330-1350



వరకు ముసునూరి నాయకుల అధీనంలో ఉండేది. 1440లో బహుమనీ సుల్తాన్ మహ్మద్ షా అధీనంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఐదు వందల ఏండ్ల పాటు ముస్లిం రాజులు కోటను నిరాటంకంగా పాలించారు.

భువనగిరి కోట సేదతీరుతున్న ఏనుగు ఆకారంలో ఉంది. దాదాపు 900 అడుగుల ఎత్తులో ఉంది. ఏక శిల పర్వతంపై ఈ కోటను నాటి రాజులు అద్భుతంగా తీర్చిదిద్దారు. కాకతీయుల కాలంలో మాతాంబముని వంశీయులు ఈ కోటను నిర్మించినట్లు శాసనాలు ఉన్నాయి. అనంతరం కులీ కుతుబ్ షాహీ నుంచి ఉస్మాన్ ఆలీ ఖాన్ వరకు కోటను పాలించారు. స్వాతంత్ర్య అనంతరం నైజామ్ నవాబులు భారత దేశంలో కలిసి పోవడంతో ఈ చారిత్రక కట్టడం కూడా ప్రభుత్వం అధీనంలోకి వచ్చింది. కోట మీద గుళ్లు, గోపురాలు ఉన్నాయి. అలాగే సప్త కన్యలుగా పిలిచే ఏడు కొలనులు ఇక్కడి ప్రత్యేకత. అనేక మంది పర్యాటకులు నిత్యం ఈ కోటని దర్శిస్తున్నారు.

గాంధారి కోట...

చారిత్రక, ఆధ్యాత్మిక కట్టడాలకు ఆదిలబాద్ జిల్లా పేరుగాంచింది. కాకతీయులు, గోండు రాజులకు సంబంధించిన పరిపాలన వైభవాన్ని కండ్లకు కట్టే కట్టడాలు ఇక్కడ దర్శనం ఇస్తాయి. ఆదిలాబాద్ జిల్లాలో ప్రముఖంగా చెప్పుకునే వాటిలో ఒకటి గాంధారి కోట. గోండు రాజులకు రాజాధానిగా ఉన్నటు వంటి ఈ ఖిల్లా పై అనేక అద్భుత కట్టడాలు కనిపిస్తాయి. ఆదిలాబాద్ జిల్లా మందల మర్రి మండలంలోని బొక్కట గుట్ట గ్రామ శివారులలో ఉంది గాంధారి కోట. మంచి ర్యాల, మందమర్రి దారిలో కనిపించే బొక్కల గుట్ట నుంచి మూడు కిలో మీటర్లు నడిచి వెళ్లితే ఈ కోట వస్తుంది. ప్రస్తుతం స్థానికులు, చుట్టు పక్కల వాళ్లు వన భోజనాల సమ యాల్లో మాత్రమే ఈ కోట దగ్గరకు వెళ్తుంటారు.



చారిత్రక ఆధారా లను బట్టి ఈ కోట సుమారు 1000 సంవ త్సరాల నాటిదని తెలుస్తుంది. కొంత కాలం వడ్డె రాజులు, రెడ్డి రాజులు కూడా పాలించారని ప్రచారంలో ఉంది. అప్పట్లో కాకతీయులు దాడులు చేయడంతో గోండు రాజులు తల దాచుకోవడానికి ఈ కోటను నిర్మించారని స్థానికులు చెబుతారు.

గాంధారి ఖిల్లా అనేక కళా రూపాలకు, శిల్ప సంపదకు నిలయం. కొండలు తొలిచి శత్రుదుర్భేద్యంగా నిలిచిన ఈ కోట పర్యాటకులను అబ్బురపరుస్తుంది. ఇక్కడి బావులు ఏడాది పొడవునా నీటితో నిండి ఉంటాయి. అడవి మధ్యలో ఉన్న అపురూప కళా సంపదకు నిలయం గాంధారి కోట. దీంట్లో ఎన్నో కళా రూపాలు, శిల్పా సంపద, విగ్రహాలు, ఆలయాలు ఉన్నాయి. కోట పై రక్షణ కోసం ఏర్పాటు చేసిన కట్టడాల్లో ఒకటి 'నగరా గుండు'. అప్పటి నిర్మాణ చాతుర్యానికి, ఇంజనీరింగ్ అద్భుతానికి ఇదో ఉదాహరణ. శత్రువులు వచ్చేటప్పుడు కోట లోని వారిని అప్రమత్తం చేసేందుకు దీన్ని నిర్మించారు. కొండ పైకి ఎక్కేందుకు నిర్మించిన మెట్లు కూడా ఇప్పటికి చెక్కుచెదర లేదు. ఇక కొండ పైకి గుర్రాలు, ఏనుగులు వెళ్ళే మార్గం కూడా అలాగే ఉంది.

రాచకొండ కోట...

హైదరాబాద్ పక్కనే ఓ అందమైన చరిత్ర దాగి ఉంది. అద్భుతమైన కొండ, కోనల మధ్య ఏడు వందల ఏండ్ల క్రితం ఓ మహా సామ్రాజ్యం విలసిల్లింది. భారత దేశంలోనే వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసిన చరిత్ర ఈ రాజ్యానికి ఉంది. అద్భుతమైన టౌన్ ప్లానింగ్, వాస్తు శైలిలో నిర్మించిన ఆ రాజ్యం గురించి తెలుసుకుందాం...! నల్లగొండ జిల్లా సంస్థాన్ నారాయణ పురం లోని కడీలబాయితండా ప్రాంతం దాటి వెళ్తుంటే ఓ అద్భుత ప్రపంచంలో అడుగు పెడుతున్న అనుభూతి. శిథిలాల మధ్య బోసిగా మిగిలిపోయిన రాతి నిర్మాణాలు నాటి రాచరికపు వాసనల్ని వెదజల్లుతూ ఉంటాయి. ఎత్తైన కొండలు, కోనల మధ్య ఆ నాటి ఆనవాళ్ళను చూస్తుంటే శిథిలమైన చరిత్ర మరుగున పడిపోయిన నిజాలు ప్రపంచం ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తాయి.



వందల ఏండ్ల క్రితం ఓ అందమైన సామ్రాజ్యం. రత్నాలు రాసులుగా పోసిన సంపన్న రాజ్యం. మన దేశానికి వ్యవసాయం అంటే ఎంటో చూపిన అన్నపూర్ణ క్షేత్రం రాచకొండ కోట. ఏక శిలతో చెక్కిన 18 అడుగుల దర్వాజాలు, ఇప్పటికీ చెక్కుచెదరని గుర్రపు శాలలు, ఎటుచూసినా కనిపించే నీటి కాలువలు. రాచకొండ గుట్టల్లో అడుగడుగునా ఎన్నో ఆధ్యాత్మిక క్షేత్రాలు తారసపడతాయి. అద్భుతమైన ఆర్కిటెక్చర్, చెక్కుచెదరని రాతి నిర్మాణాలు ఉన్నాయి. ఆ కాలంలోనే మూడు వందల చెరువులు, మూడు వేల కుటుంబాలు, మూడు వేల చేద బావులు ఇక్కడ తవ్వించారని శాసనాలు చెబుతున్నాయి. రాయసముద్రం, అనపాత సముద్రం, నాగ సముద్రం, ఆహల్యా నదులు రాచకొండ చుట్టు పక్కల ఉన్న నీటి వనరులు.


ఖమ్మం కోట...

రాములోరి గడ్డపై అత్యద్భుత రాతి కట్టడం. అది వెయ్యి ఏండ్ల ఘన చరిత్రకు సాక్ష్యం. తెలంగాణ వైభవానికి ప్రతీక. నాటి ఇంజనీరింగ్ పని తనానికి, సాంకేతిక నైపుణ్యానికి మచ్చు తునక. మట్టితో మొదలైన చిన్న కోట. శత్రుదుర్భేద్యమైన రాతి ఖిల్లాగా రూపొందింది. ఖమ్మం జిల్లా అంటే సహజ సంపదలకు నిలయం. ఈ కోట పట్టణం నడి బొడ్డున పురాతన చిహ్నంగా, చరిత్రకు ఆనవాలుగా నిలిచింది. ఖమ్మం జిల్లా పేరు చెప్పగానే భద్రాది రాముడుతో పాటు గుర్తుకు వచ్చేది ఖమ్మం ఖిల్లా. దీన్ని దాదాపుగా 1050 సంవత్సరాల క్రితం నిర్మించినట్టు చరిత్ర చెబుతున్నది. ఈ ఖిల్లా ఇప్పటికి ఎంతో పటిష్టంగా, చెక్కుచెదరకుండా ఉంది.

కొన్ని వందల సంవత్సరాలు అధికారదర్పం ప్రదర్శించి, ఎందరో పాలకులకు రక్షణ కల్పించి, ఇంకెందరికో నీడ నిచ్చిన రాతి కట్టడం. నాలుగు చ.కి.మీ. వైశాల్యంలో ఉంది ఖమ్మం ఖిల్లా. దీంట్లో 12 బురుజులు, 10 రాతి దర్వాజాలు కన్పిస్తాయి. ప్రతిదీ ఓ అద్భుత నిర్మాణం. కోట లోపలికి వెళ్లే కొద్ది ఎన్నో వింతలు దర్శనం ఇస్తాయి. నాటి చారిత్రక పరిస్థితులు కండ్ల ముందు కదలాడుతాయి. ఖమ్మం ఖిల్లా ఎంత పెద్దగా ఉందో దాని చరిత్ర కూడా అంతే పెద్దగా ఉంటుంది. కోట ముందు శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం కనిపిస్తుంది. 16 వ శతాబ్దంలో విజయ నగరం సామ్రాజ్యాన్ని దశ దిశలా వ్యాపించిన దేవరాయల ఏలుబడిలో ఈ కోట ఉండేది. కాకతీయుల పాలన కాలంలో అంటే క్రీ.శ. 950 లో ఖమ్మం ఖిల్లాకు పునాదిరాయి పడింది. 1006 నాటికి కోట నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత 300 ఏండ్లు రెడ్డి రాజుల చేతుల్లో కొనసాగింది. ఆ తర్వాత వెలమ, గజపతులు, నందపానులు, కాళ్లూరు, గుడ్లూరు.... ఇలా క్రమ క్రమంగా చేతులు మారుతూ వచ్చింది. 15 వ శతాబ్దంలో దేవరాయల ఈ కోటపై తన జెండా ఎగరవేసారు. ఆ తర్వాత కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు వచ్చి కోటను అభివృద్ధి పరచటంలో ప్రముఖ పాత్ర పోషించారు. అసఫ్‌జాహీలు సొంతం చేసుకున్న తర్వాత పూర్తి స్థాయి రాతి కట్టడంగా మారింది. కోట లోపల జాఫరుద్దౌలా కాలంలో నిర్మించిన ఒక పాత మసీదు, మహల్



ఉన్నాయి. అలాగే అరవై అడుగుల పొడవు, ఇరవై అడుగుల వెడల్పు ఉన్న జాఫర్ బౌలీ అనే బావి కూడా ఉంది. కోటపై ముట్టడి జరిగినప్పుడు తప్పించుకోవడానికి ఒక రహస్య సొరంగం కూడా ఉంది. వర్షపు నీటిని నిలువ చేసుకోవడానికి నీటి కాలువలు కూడా ఉన్నాయి.



ఎలగందుల కోట...

ఎలగందుల కోట ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యం. తెలంగాణలో పారిన రక్తపుటేరులను, రాజరికపు దర్పాలను చూసిన ప్రాంతం. అంతే కాదు మత సామరస్యానికి ప్రతీక ఈ ఖిల్లా. కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి పది కిలోమీటర్ల దూరంలో మానేరు నదీతీరంలో తాటిచెట్ల మధ్య సుందర ప్రకృతిక నేపథ్యంలో ఈ కోట నిర్మించబడి ఉంది. ఒకప్పుడు ఈ కోట కుతుబ్ షాహీ వంశం, మొఘల్ సామ్రాజ్యం, హైదరాబాద్ నిజామ్‌ల ఆధీనంలో ఉండేది.

ఎలగందుల ఊరు చౌరస్తా నుంచి కుడివైపు వెళ్తే చాలు నాటి రాజాదర్పానికి సాక్ష్యంగా నిలబడిన ఎలగందుల కోటకు మొదటి ద్వారంగా ఉన్న చమన్ కనిపిస్తుంది. కాకతీయులకు, ముసునూరి నాయకులకు, రేచర్ల పద్మనాయకులకు, శత్రుదుర్భేద్యంగా నిలిచిన కోట. దీని నిర్మాణాన్ని పరిశీలించి చూస్తే కండ్లు తిరుగుతాయా అనిపించేంత పెద్ద కొండ. ఆ కొండ పై కోట నిర్మాణం. కోట కింది నుంచి చూస్తే రెండు మినార్‌లు చిన్నగా కనిపిస్తాయి. పెద్ద పెద్ద బండరాళ్లను అందంగా చెక్కి రక్షణగా బురుజులను ఏర్పాటు చేసుకున్నారు. దాదాపుగా 200 మీటర్ల ఎత్తులో ఉంటుంది ఈ ఖిల్లా. కోటకు ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. చుట్టూ పెద్ద పెద్ద రాళ్ల తో కదంకం ఉంది. కోట రాళ్లను చూస్తుంటే వందల ఏండ్ల చరిత్రను చెబుతున్నట్టుగా అనిపిస్తాయి. కోట మొత్తం టర్కీ, ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్ కనిపిస్తుంది.



రామగిరి కోట...

రాజుల కాలపు కోటలు, చెక్కుచెదరని రాతి కట్టడాలు, పచ్చటి ప్రకృతి నడుమ నందన వనం. అదే కరీంనగర్‌లోని రామగిరి ఖిల్లా. ఈ కోట ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది. రోజు రోజూకు సందర్శకులు పెరుగుతున్నారు. దశబ్దాల చరిత్రను గుర్తు చేసే ఆనాటి చిరస్మరణీయ ఆనవాళ్లు కరీంనగర్ జిల్లా బేగం పేట గ్రామంలోని రామగిరి ఖిల్లాలో ఇప్పటికి కనిపిస్తున్నాయి.

అలనాడు శత్రువులను మట్టి కరిపించేందుకు వాడిన ఫిరంగులు, కొండలపై ఏర్పాటు చేసిన కోట బుర్జులు ఇప్పటికి ఉన్నాయి. ప్రకృతి అందాల నడుమ గౌతమి పుత్ర వంశానికి చెందిన వారు ఈ కోటను నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. తర్వాత దీని కేంద్రంగా చాళుక్యలు పరిపాలన సాగించారు. వీరి నుంచి రామగిరి ఖిల్లాను కాకతీయ వంశం కైవసం చేసుకుంది. వీరి కాలంలో కోటపై మరిన్ని రాతి కట్టడాల నిర్మాణం జరిగింది. ఇక్కడ నుంచి పాలన సాగించిన రాజులు వారి చారిత్రక ఆనవాళ్లు ఇప్పటికి కనిపిస్తాయి. రాతి శిలలపై చెక్కిన శిలలు అలనాటి కళలకు అద్దం పడుతుంది.

కొండపైకి ఎక్కి ఎటు చూసిన పచ్చటి ప్రకృతి పలకరిస్తుంది. ఇక్కడ శ్రీరాముడు, సీతా దేవితో కొంతకాలం విడిది చేసినట్లు స్థానిక ప్రజలు చెబుతుంటారు. కోటపై శ్రీరాముడి పాదాలు, సీతామ్మ కొలను కూడా ఉంది. దీంతో ఇక్కడికి ప్రతి ఏడాది శ్రావణంలో అధికంగా ప్రజలు వస్తుంటారు. అందువల్ల ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చాలని కోరుకుంటున్నారు సందర్శకులు. సహజంగా రాళ్ల గుట్టలు అధికంగా ఉన్న ప్రదేశంలో అసాధ్యం అనుకున్న కోటలను శత్రువులను ముందుగానే గుర్చించేలా బుర్జులు నిర్మించారు రాజులు. ఖిల్లాలో విలాసవంతమైన గదులు, కోటలు నిర్మించి తమ కళా చతురతను ప్రదర్శించారు. ఇంతటి చరిత్ర గల చారిత్రక కట్టడాలను ప్రభుత్వం గుర్తించాలని, పర్యాటక రంగంగా మార్చాలని కోరుతున్నారు ప్రజలు.

రూప
సెల్ నెంబర్ : 7661910634

అందాల హిల్ స్టేషన్‌లు...

హిల్ స్టేషన్‌ల అందాలను తనివి తీరా ఆస్వాదించాలంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. ఆ ప్రయాణం మరువలేని అనుభూతులను ఏడాది పొడవునా గుర్తు ఉండిపోయే అందాలను పంచుతుంది. సాధారణంగా అందరికి తెలిసిన లేదా ప్రసిద్ధి చెందిన హిల్ స్టేషన్‌లకు వెళ్ళడానికి ఎక్కువ మొగ్గు చూపుతారు. కానీ భారత దేశంలో అందమైన హిల్ స్టేషన్‌లు అనేకం ఉన్నాయి. చాలా మందికి తెలియని అందమైన హిల్ స్టేషన్‌ల గురించి తెలుసుకుందాం... !

రీఘరూ : అరుణాచల్ ప్రదేశ్‌లోని సుభాన్సిరి జిల్లాలో గల రీఘరూ... ఒక చిన్న అద్భుత పర్వత నగరం. కొన్ని సంవత్సరాలుగా పర్యాటకులు ఈ ప్రదేశానికి ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్ర రాజధాని ఈటానగర్ నుంచి 150 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.



తవాంగ్ : అరుణాచల్ ప్రదేశ్ లోని మరొక అందమైన హిల్ స్టేషన్ తవాంగ్. ఇది సముద్ర మట్టానికి సుమారు పది వేల మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ హిల్ స్టేషన్ దక్షిణ టిబెట్ లోకి వస్తుంది. ఇక్కడి ప్రకృతి దృశ్యాలు పర్యాటకులను మంత్ర ముగ్ధలను చేస్తాయి.

చిరిమిరి : చత్తీస్ గఢ్ రాష్ట్రంలోని కొరియా జిల్లాలో గల చిరిమిరి ఒక అందమైన హిల్ స్టేషన్. ఇక్కడి ప్రకృతి దృశ్యాలు హిల్ స్టేషన్ లు బాగా ప్రసిద్ధి చెందినవి.


పావగడ : ఇది కర్ణాటక లోని పావగడ కాదు సుమా ! ఈ అందమైన హిల్ స్టేషన్ గుజరాత్ రాష్ట్రంలోని పంచమహల్ జిల్లాలో కలదు.

సపూతర : అందమైన ఈ హిల్ స్టేషన్ గుజరాత్ రాష్ట్రంలోని డాంగ్ జిల్లాలో కలదు. ఈ హిల్ స్టేషన్ సముద్ర మట్టానికి సుమారు వేయి మీటర్ల ఎత్తులో ఉంది. దీన్ని పాముల ప్రదేశం అని కూడా అంటారు. ఈ నదిని స్థానికులు పూజిస్తారు.

విల్సన్ హిల్స్ : గుజరాత్ లోని మరొక హిల్ స్టేషన్. వల్సాడ్ జిల్లాలో గల ఈ హిల్ స్టేషన్ గుజరాత్‌లోని ప్రసిద్ధి చెందిన సూరత్ పట్టణానికి సమీపంలో ఉంటుంది.

చంబా : హిమాచల్ ప్రదేశ్ లోని చంబ జిల్లాలో గల చంబా హిల్ స్టేషన్ ఒక పురాతన పట్టణం. ఇక్కడి రావి నదీ ప్రవాహ అందాలు పర్యాటకులను అబ్బుర పరుస్తాయి.


చైల్ : ఇది హిమాచల్ ప్రదేశ్ లో ఉండే అందమైన హిల్ స్టేషన్. సముద్ర



మట్టానికి సుమారు 2,444 మీటర్ల ఎత్తున కలదు. ఇక్కడ కనిపించే ప్రదేశం ప్రపంచంలో అతి ఎత్తైన ఒక క్రికెట్ గ్రౌండ్.

కుఫ్రి : హిమాచల్ ప్రదేశ్ లో సిమ్లా జిల్లాలో ఉన్న చిన్న హిల్ స్టేషన్ కుఫ్రి. కుఫ్రి అంటే సరస్సు అని అర్థం. ఈ సరస్సు కారణంగా హిల్ స్టేషన్‌కు ఈ పేరు వచ్చిందని చెబుతారు. సిమ్లా పట్టణం నుంచి కేవలం 13 కిలో మీటర్ల దూరంలో మాత్రమే ఉంటుంది.

రేవల్సర్ : హిమాచల్ ప్రదేశ్ లోని మంది జిల్లాలో ఉంది. సముద్ర మట్టానికి 1360 కిలో మీటర్ల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో బౌద్ధ, హిందూ మత ధర్మాలు ఎక్కువగా కనిపిస్తాయి.





22 ఏండ్లలోనే ప్రతిష్ఠాత్మక ఈవెంట్లలో ఫైనల్లో ఆడిన అనుభవం. ఒలింపిక్స్ సహా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో వరుసగా రజత పతకాలు. ఏ అథ్లెట్‌కైనా ఇది తిరుగులేని ట్రాక్ రికార్డు. అయితే, పసిడి పోరులో ప్రతిసారి సిల్వర్‌తో సరిపెట్టుకుంటున్నాననే భావన సింధులోనూ ఉంది. బంగారు పతకం కొట్టలేదనే బాధ ఎప్పుడూ ఉంటుందని సింధు అంటోంది.

బంగారం బాధ ఎప్పుడూ ఉంటది!

వరుస సిల్వర్ మెడల్స్‌పై పి.వి సింధు

- ఒకుహరతో మ్యాచ్ ఎంతో కఠినం
- ప్రస్తుతం కెరీర్ గొప్పగా సాగుతోంది

నవతెలంగాణ-హైదరాబాద్

గ్లోబల్ టోర్నీల్లో వరుస విజయాలతో భారత్‌లో టాప్ క్రీడాకారిణిగా ఎదిగిన పి.వి సింధు, గ్లాస్గోలో జరిగిన బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రజత పతకం సాధించింది. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో చరిత్రలోనే మారథాన్ మ్యాచ్‌గా నిలిచిన సింధు, ఒకుహర పసిడి పోరులో తెలుగు తేజం సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. 110 నిమిషాల పాటు సాగిన ఫైనల్లో ఆఖర్లో తడబడి పసిడి కోల్పోవటం బాధగా ఉన్నా, సిల్వర్ మెడల్‌తో సంతోషంగానే తిరిగొచ్చానని పి.వి సింధ పేర్కొన్నది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ముచ్చటగా మూడో మెడల్ ఖాతాలో వేసుకున్న పి.వి సింధు మంగళవారం మీడియాతో మాట్లాడింది. గోపీచంద్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్లాస్గో పసిడి పోరు విశేషాలు పంచుకున్నది. జపాన్ షట్లర్ నొజోమి ఒకుహర 21-19, 20-22, 22-20తో పి.వి సింధుపై గెలుపొంది 40 ఏండ్లలో జపాన్‌కు తొలి బంగారు పతకాన్ని తీసుకెళ్లిన విషయం తెలిసిందే.



❒ **గ్లాస్గో ఫైనల్ ఓ అద్భుతం. 110 నిమిషాల మారథాన్ మ్యాచ్ గురించి క్లుప్తంగా..**

సింధు : గేమ్ ఎవరిదైనా కావచ్చు. కానీ ఒకింత నిరుత్సాహం. తొలి గేమ్ నుంచి ప్రతి పాయింట్ ఇద్దరికీ ఎంతో ప్రధానం. నేను ఆధిక్యంలో ఉన్నా, ఇరు వైపుల నుంచి అప్పుడే ముగియలేదు. సుదీర్ఘ ర్యాలీలలో ఏ షటిల్‌నూ వదిలే పరిస్థితి లేదు. కానీ మూడో గేమ్‌కు వచ్చేసరికి అప్పుడు 20-20. చెప్పడానికి మాటల్లేవ్. ఎవరైనా గోల్డ్ మెడల్ కోసమే ప్రయత్నిస్తారు. ఆఖర్లో అంతా మారిపోయింది. రజతంతో నేను సంతోషంగా ఉన్నాను. కానీ బంగారు పతకం కోల్పోయిన బాధ ఎప్పుడూ ఉంటుంది.

❒ **రియో ఒలింపిక్స్‌లో ఒకుహరను సులువుగా ఓడించారు. ఇప్పుడామెపై మీ అభిప్రాయం**

సింధు : అవును, కానీ ఒకుహరతో పోరు ఎప్పుడైనా సులువు కాదు. మేమిద్దరం ఎప్పుడు తలపడినా కఠిన ర్యాలీలు సాగాయి. ఆమెను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు. సుదీర్ఘ మ్యాచ్ కోసమే నేను సన్నద్ధమయ్యా. దురదృష్టశావత్తు ఫైనల్స్ నా రోజు కాదు.

❒ **రెండో గేమ్‌లో 73 షాట్ల సుదీర్ఘ ర్యాలీపై ఏమంటారు?**

సింధు : అది పెద్ద ర్యాలీ అని నేను భావించట్లేదు. ప్రతి ర్యాలీ సైతం సమాన స్థాయిలో పెద్దవే. ప్రతి ర్యాలీలోనూ రెండు వైపుల నుంచి లెక్కలేనన్ని షాట్లు. ఒకుహర అలసిపోయింది. నేనూ అలసిపోయాను. గ్లాస్గో ఫైనల్స్ గుడ్ మ్యాచ్.

❒ **ఒకుహర వరల్డ్ క్లాస్ షట్లర్. గాయం నుంచి కోలుకున్న తర్వాత ఆమె ఇలా పుంజుకుంటుందని భావించారా?**

సింధు : జపాన్ ప్లేయర్స్ ఎప్పుడూ శారీరకంగా బలవంతులని నాకు తెలుసు. లాంగ్ టాస్‌లు సహా స్లో డ్రాప్స్‌కు ముందు నుంచే సిదమయ్యా. మూడో గేమ్‌లో 1-5తో నేను వెనుకంజలో ఉన్నా, పుంజుకున్నా. 11వ పాయింట్ తర్వాత ఇది మరింత సుదీర్ఘంగా సాగుతుందని అనుకున్నా. వరల్డ్ క్లాస్ ప్లేయర్ గురించి.. అంతర్జాతీయ స్థాయిలో ఏ క్రీడాకారిణి సులభం కాదు. ప్రతి ప్లేయర్‌కు ఓ స్టైల్ ఉంటుంది. మ్యాచ్ రోజు ఎవరు బాగా ఆడారనే విషయంపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది.

❒ **నిరుడు రియో ఒలింపిక్స్ ఫైనల్స్‌కు చేరారు. ప్రస్తుతం కెరీర్‌పై మీ భావన ఎలా ఉంది?**

సింధు : నా కెరీర్‌పై ఎంతో సంతోషంగా ఉన్నాను. ఇదే ఆత్మవిశ్వాసంతో మరింత ముందుకు దూసుకెళ్లాలని అనుకుంటున్నాను. ఫైనల్స్ పోరుతో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను, మరింత ధృడంగా తిరిగొస్తాను.

❒ **వరల్డ్ చాంపియన్‌షిప్స్ పోడియంపై ఇద్దరు భారతీయ షట్లర్స్ ఉండటంపై..**

సింధు : ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఒకే సారి రెండు పతకాలు రావటం నిజంగా చాలా సంతోషంగా ఉంది. సైనా నెహ్వాల్ చాలా బాగా ఆడింది. నేను సిల్వర్ మెడల్‌తో తిరిగొచ్చాను. చాలా బాగుంది.

పసిడి పండిస్తుంది

'సింధు వయసు 22 ఏండ్లు. ఇంకా సుదీర్ఘ కెరీర్ ఉంది. వరుసగా నాలుగేండ్లలో నాలుగు పతకాలు సాధించింది. ఆమె కెరీర్ ముగిసేవరకూ లెక్కలేనన్ని బంగారు పతకాలు సాధించగలదు. సైనా నెహ్వాల్, పి.వి సింధు వంటి క్రీడాకారిణీలు మనకు ఉండటం ఎంతో అదృష్టం. ఫిట్‌నెస్ ప్రమాణాలను సైతం మనం ఎంతో మెరుగుపర్చుకున్నాం. శ్రీకాంత్, సాయిప్రణీత్‌లు మంచిగా రాణించారు. ఈ విజయంలో కోచింగ్ సిబ్బందితో పాటు ఫిట్‌నెస్ కోచ్‌ల భాగస్వామ్యం మరువలేనిది'

- పుల్లెల గోపీచంద్





లోకేశ్ రాహుల్

విఫలమవుతున్న రాహుల్, జాదవ్

నవతెలంగాణ క్రీడా విభాగం

శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ లక్ష్యం కేవలం సిరీస్ విజయం కాదు!. ధావన్, రోహిత్ లేదా కోహ్లి, ధోనిలు గెలిపించటం కాదు కావాల్సింది!. అసలు లంకలో అడుగుపెట్టిన లక్ష్యమే వేరు. లంకలో సాధించాల్సిన విజయమే విభిన్నం. తొలి మూడు వన్డేలు ముగిసినా టీమ్ ఇండియా సిరీస్ సాధించిందే కానీ అసలు లక్ష్యాన్నికి ఏమాత్రం చేరువ కాలేదు. 2019 ప్రపంచకప్ సైన్యమే లక్ష్యంగా వన్డేల్లో కొత్త వ్యూహంతో బరిలోకి దిగుతున్నామని, అందుకు కొన్ని మ్యాచులను కోల్పోవడానికి సైతం సిద్ధమేనని కెప్టెన్ కోహ్లి ప్రకటించాడు. అందుకు తగినట్టే పల్లెకెలెలో రెండో వన్డేలో బ్యాటింగ్ లైనప్ ఆర్డర్‌లో అనూహ్య మార్పులు తీసుకొచ్చాడు. 2019 ప్రపంచకప్‌లో మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాళ్లుగా ఎదుగుతారని భావిస్తున్న లోకేశ్ రాహుల్, కేదార్ జాదవ్‌లను తన కంటే ముందుగా బ్యాటింగ్‌కు పంపాడు. కానీ కోహ్లి వ్యూహం ఫలించలేదు. రాహుల్, జాదవ్‌లు

ఆడాలి వీళ్లు!

ఆడలేదు. ముగింపు మొనగాడు మహేంద్రసింగ్ ధోని కూల్ ఇన్నింగ్స్‌తో గత రెండు మ్యాచుల్లోనూ కోహ్లిసేన సాధికారిక విజయాలు అందు కున్నది. మరో రెండు మ్యాచులు ఉండగానే సిరీస్ సాధించినం దుకు ఆనందపడాల్సిన పని లేదు. రాహుల్, జాదవ్ సహా కొత్త కెరటాల ప్రదర్శన ఏ విధంగా మెరుగుపడుతుందనే విషయం పైనే ఇప్పుడు జట్టు మేనేజ్‌మెంట్ ఆలోచన చేయాల్సి ఉన్నది.



కేదార్ జాదవ్

జాదవ్ 1 రాహుల్ 21

శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అజింక్య రహానెను పక్కనపెట్టి మరీ లోకేశ్ రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. రాహుల్ డ్యాషింగ్ బ్యాటింగ్ నైపుణ్యమే అతడిని తుది జట్టులో ఉండేలా ప్రేరేపించింది. కేదార్ జాదవ్ విషయంలోనూ ఇదే జరిగింది. లోయర్ ఆర్డర్‌లో మెరుపు బ్యాటింగ్‌కు తోడు బంతితో పార్ట్ టైమ్ స్పిన్నర్‌గా ఉపయోగపడతాడు. కానీ తొలి మూడు వన్డేల్లో కేదార్ జాదవ్ కేవలం ఒక్క పరుగు చేయగా, లోకేశ్ రాహుల్ 21 పరుగులు చేయగలిగాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అయితే ఇంకా పరుగుల ఖాతా తెరువలేదు. దీంతో చివరి రెండు వన్డేల్లో వీరి ప్రదర్శనపై ఆసక్తి నెలకొన్నది. క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలబడి పరుగులు చేయటమే సిసలైన బ్యాట్స్‌మన్ లక్షణం. జట్టు అప్పటికే బోలెడన్ని పరుగులు చేసిన వేళ.. మరింత దూకుడుగా ఆడితే ఆనందమే కానీ పెద్ద ఉపయోగం ఉండదు. కానీ టాప్ ఆర్డర్ విఫలమైన చోట, ఓపిగ్గా భాగస్వామ్యాలు నిర్మించినప్పుడే గొప్ప విజయాలు సాధ్యమవుతాయి. హార్దిక్ పాండ్య ఒద్దికైన ఇన్నింగ్స్‌లు ఆడటంలో ఇంకా ఓనమాలు నేర్చినట్టు లేదు!. బంతితో మూడు వికెట్లు కూల్చిన జాదవ్ పార్ట్ టైమ్ స్పిన్నర్‌గా బాధ్యత నెరవేర్చాడు. కానీ బ్యాట్స్‌మన్‌గా అతడు నిరూపించుకోవాలి. లోకేశ్ రాహుల్ మిడిల్ ఆర్డర్‌లో తన స్థానానికి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మూడు ఇన్నింగ్స్‌ల్లో 186 పరుగులు చేసిన శిఖర్ ధావన్ లంకలో భీకర ఫామ్ కొనసాగిస్తున్నాడు. రోహిత్ శర్మ అజేయ శతకం సహా 182 పరుగులు చేశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనే ధోని 112 పరుగులు సాధించి, రెండింటా నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్ విభాగంలో సీనియర్లకు విశ్రాంతి ఇవ్వటంతో అక్షర్ పటేల్, చాహల్‌లు జట్టులోకి వచ్చారు. ఐదు వికెట్లతో అక్షర్, నాల్గు వికెట్లతో చాహల్‌లు ఆకట్టుకున్నారు. ఇప్పటికే సిరీస్ సొంతం కావటంతో.. ఆఖరి రెండు వన్డేల్లో మరిన్ని ప్రయోగాలు చేసే అవకాశం ఉంది. ఇక్కడైనా రాహుల్, జాదవ్‌లు నిలకడైన ఇన్నింగ్స్‌లతో రాణిస్తే అప్పుడే మిషన్ శ్రీలంక సక్సెస్!.

పతకం ఖాయం

- సెమీఫైనల్లో గౌరవ్ బిధూరి
- బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్



హాంబర్గ్ : స్టార్ బాక్సర్లు పస లేని పంచ్‌లతో నిష్క్రమించిన వేళ.. బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో వైల్డ్ కార్డ్ బాక్సర్ భారత్‌కు ఓ పతకం ఖాయం చేశాడు. 56 కేజీల విభాగంలో వైల్డ్ కార్డ్ ఎంట్రీ బాక్సర్ గౌరవ్ బిధూరి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. మంగళవారం నాటి క్వార్టర్‌ఫైనల్స్ ఫైట్‌లో గెలుపొందిన గౌరవ్ కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నాడు. దీంతో ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పతకం సాధించిన నాల్గో భారత బాక్సర్‌గా గౌరవ్ రికార్డు నెలకొల్పాడు. విజేందర్ సింగ్ (2009), వికాస్ కృష్ణన్ (2011), శివ థాప (2015)లు గతంలో భారత్‌కు కాంస్య పతకాలు తీసుకొచ్చారు. అయితే గౌరవ్ కాంస్యంతో సరిపెట్టుకుంటాడా? మెరుగైన మెడల్ తీసుకొస్తాడా అనేది ఆసక్తికరం. క్వార్టర్స్‌లో ట్యూనిషియా బాక్సర్ బిలెల్ మహెదిపై పంచ్ పవర్ చాటిన బిధూరి నేటి సెమీఫైనల్లో కఠిన ప్రత్యర్థితో తలపడాల్సి ఉంది. 49 కేజీల విభాగంలో అమిత్ పంగల్ నిరాశపరిచాడు. ఒలింపిక్ చాంపియన్ బాక్సర్ హసన్‌బాయ్ (ఉబ్బెకిస్థాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

షరపోవా దూసుకొచ్చె..

- రెండో సీడ్ హాలెప్‌పై విజయం
- యు.ఎస్ ఓపెన్



న్యూయార్క్ : సుదీర్ఘ విరామం తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అడుగుపెట్టిన రష్యా స్టార్, మాజీ వరల్డ్ నెం.1 మరియా షరపోవా న్యూయార్క్‌లో రెచ్చిపోయింది. ఎన్నో విమర్శల నడుమ వైల్డ్ కార్డ్ ఎంట్రీతో యు.ఎస్ ఓపెన్‌లో ఆడుతున్న షరపోవా తొలి పోరులోనే దుమ్మురేపింది. రెండో సీడ్ సిమోన హాలెప్‌ను చిత్తు చేసి పునరాగమనంలో మెరుపు విజయం నమోదు చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం.145 షరపోవా సాధికారిక విజయంతో టోర్నీని ఘనంగా మొదలెట్టింది. మూడు సెట్ల పోరులో 6-4, 4-6, 6-3తో హాలెప్‌పై గెలుపొందింది. తొలి సెట్‌లో నెగ్గిన షరపోవా, తర్వాతి సెట్‌లో హాలెప్‌కు తలొగ్గింది. కానీ కీలక మూడో సెట్‌లో మెరిసిన షరపోవా సెట్‌తో పాటు రెండో రౌండ్ బెర్త్‌ను ఎగరేసుకుపోయింది. దీంతో హాలెప్ తొలి రౌండ్ నుంచే నిష్క్రమించింది. అమెరికా వెటరన్ ప్లేయర్ వీనస్ విలియమ్స్ బోణీ చేసింది. స్లోవేకియా అమ్మాయి విక్టోరియా కుజుమోవాపై 6-3, 3-6, 6-2తో గెలుపొందింది. వింబుల్డన్ విజయం జోరుమీదున్న వీనస్.. న్యూయార్క్‌లోనూ టైటిల్ రేసులో ఫేవరేట్. సిబుల్కోవా 6(5)-7(7), 6-3, 6-2తో గెలుపొందగా, కరొలినా వోజ్నియాకి 6-1, 7-5తో గెలుపొందింది. రష్యా క్రీడాకారిణి మకరోవా 6-2, 6-1తో తొలి రౌండ్‌లో శుభారంభం చేసింది. ఇక పురుషుల సింగిల్స్ సర్క్యూట్‌లో సొంగా (ఫ్రాన్స్) 6-3, 6-3, 6-4తో కాపిల్ విజయం సాధించాడు. జాన్ ఇస్నర్ 6-1, 6-3, 4-6, 6-3తో హెర్బర్ట్‌పై గెలుపొందాడు. మారిన్ సిలిచ్ 6-4, 6-3, 3-6, 6-3తో అమెరికా ఆటగాడిపై పైచేయి సాధించాడు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఖేల్‌రత్న అందుకుంటున్న దేవేంద్ర జజారియా, సర్దార్ సింగ్. అవార్డు అవార్డు స్వీకరిస్తున్న జ్యోతి సురేఖ

ఎంతో చేయాలి

- ఖేల్‌రత్న గ్రహీత జజారియా
- అట్టహాసంగా క్రీడా పురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ : దేశంలో పారా అథ్లెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సింది ఎంతో ఉన్నదని రెండు సార్లు ఒలింపిక్ చాంపియన్, రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న పురస్కార గ్రహీత దేవేంద్ర జజారియా అన్నాడు. 'పారా అథ్లెట్లకు ఇది చారిత్రాత్మక రోజు. ఇంకా చాలా మంది పారా అథ్లెట్లు ఉన్నారు. వారికి ఎంతో సహకారం అవసరం. ప్రత్యేక స్టేడియాలు, రోప్ వేలు, వీల్ చైర్లను అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వాలు చేయాల్సింది చాలా అవసరం. మా అమ్మ సహకారం లేనిది నేను లేను. నా కోసం అమ్మ ఎంతో చేసింది' అని ఖేల్‌రత్న పురస్కారం అందుకున్న తొలి పారా అథ్లెట్ జజారియా అన్నాడు. జాతీయ క్రీడా దినోత్సవం (హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినం) సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం క్రీడా పురస్కారాల ప్రదాన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. హాకీ ఇండియా మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ సైతం ఖేల్‌రత్న అందుకున్నాడు. తెలుగమ్మాయి, ఆర్చర్ జ్యోతి సురేఖ అర్జున అవార్డు తీసుకున్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.